# కుర్చీలో కూనిరాగం

## ఆరుద్ర

విచ్చలవిడిగా సంగీతం వెల్లువగా పారే వేళప్పుడు (స్నానాల గదిలో అని అప్పుడే పోల్చుకొన్నారూ! మీరు చాలాగ చాలా ఘటివాళ్ళని నాకు ముందే తెలుసు) ఉడుకుడుకు నీళ్ళు పోసుకొంటూ ఉండబట్టలేక సన్నని కూనిరాగం తీస్తున్నా. ఇప్పటి మాటకాదు...ఆరేళ్ళకిందట. ఒక ఆధునిక కవి, ఆధునిక కవులకి సహజమైన పెడసరపు ధోరణిలో "నా యింట్లో నేనొక షాని, షర్షాని, నాదిర్ షాని" అన్నాడు. అలాగే మా యింట్లో నేనొక బాలగంధర్వని, బడేగులామలీని, కాదంటే కనీసం జి. యన్. బీని. సహజంగా సంగీతం అప్రయత్నంగా వెలువడే వేళప్పుడు పాడుకొనేందుకు నా స్వేచ్ఛ ఉందనుకొనేవాణ్ణి.

ఆరేళ్ళకిందట - ఆ స్వేచ్ఛ నాకూ, నాతోపాటు ఒకే గదిలో అద్దెకుంటున్న నలుగురు స్నేహితులకీ ఉండేదికాదు. మా యింటిగల ఆవిడ గది అద్దెకిస్తూ పెట్టిన షరతులో ఇంట్లో పాటలు పాడకూడదు అనేది అగ్రేసర - షరతు. కర్మంకాలి ఎప్పుడేనా కూనిరాగం వచ్చిందో మా పెట్టెబేడా నడిరోడ్డు మీద ఉంటాయని పుట్టెడు భయం మా గొంతుకలను నొక్కి-గుండె గొంతుకలో కొట్లాడేది.

ఆరోజు అదేం దురదృష్టమో కూనిరాగం తీశా. పరవశత్వంలో నన్ను నేనే మరిచిపోయా. సంగీత పారిభాషికపదాలు నాకట్టే తెలియవుగాని పై షడ్జమం దాటిన పంచమందాకా గొంతుకలో ఉత్సాహం ఎగిరుంటుంది. అంత చక్కటి ఫీటు చేసినందుకు నన్ను నేనే అభినందించుకొన్నా. సబ్బు పెట్టె తువ్వాలు పట్టుకొని స్నానాలగదిలోంచి బయటకొచ్చేసరికి లంకిణీలాగ మా యింటావిడ - పొరపాటు, ఇంటిగలావిడ - నిజం చెప్పొద్దూ ఆవిణ్ణి తలచుకొన్నంత మాత్రానే మాటలు తడబడుతున్నాయి, కోపంగా ఉరిమింది.

"సంగీతం బాగా పాడగలవే" అని ఇట్టే కనిపెట్టేసింది. నేను సంగీతం పాడగలనని ఈవిడ కెలా తెలిసిందా అని ఆశ్చర్యపడ్డా. తెలిసింది. తెలిసింది. "శిశువులకు తెలును, పశువులకు తెలుసు సంగీతం పాములకు తెలుసు" అనే అర్థంలో ఒక సంస్కృత శ్లోకం ఉంది. ఈవిడ శిశువు కాదు. తక్కిన రెండింటిలో ఏ ఒక్కటేనా కావచ్చు కాబట్టి ఇంత సులువుగా పోల్చుకొంది అని నేను పోల్చుకొన్నా- పట్టపగలు, పట్టనడిబజారులో దొంగతనం చేసి దొరికిపోయినవాడిలాగ భయపడుతూ చేసిన తప్పు ఒప్పుకొన్నా. "ఇంకెప్పుడూ పాడను!" అని ఆవిడ నిష్కర్షగా ఆదేశించి నిష్క్రమించింది.

"భావప్రకటన మా జన్మహక్కు- రాజ్యాంగం దానిని భద్రపర్చేవరకు విశ్రమించం" అని ఇటీవల పత్రికలు శపథం తీసుకొన్నట్టు "కూనిరాగం మా జన్మహక్కు- ఇల్లుగలావిడ దానిని భద్రపరిచేవరకూ విశ్రమించం" అని నేనూ నాతోబాటు అద్దెకుంటున్న స్నేహితులూ శపథం తీసుకొనేవాళ్ళమే గానీ ఆరోజుల్లో ఇల్లుదొరకడం - ఇల్లుసిగా తరిగిరి—కనీసం గది. లేదా కారు షెడు దొరకడం ఎడారిలో నీళ్ళు దొరికినంత

మీకూ జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఆ రోజుల్లో ఇళ్ళుదొరికేవి కావు. కాలేజీలలో సీట్లు దొరికేవి కావు. వ్యాపారానికి పెర్మిట్లు దొరికేవు కావు. నెలాఖరురోజుల్లో చేబదుళ్లు దొరికేవికావు. మా శ్రీరంగం నారాయణ బాబు ఆరోజుల్లోనే మాంబళంలో అతి దక్కని నవరత్నఖచితమైన గదొకటి సంపాదించాడు. దాన్ని సంపాదించ అతను ఒడంబడిన షరతులు వింటే గుడ్లు తేలవేసి గుండెలు బాదుకోక తప్పదు. రాత్రి ఎనిమిది గంటలు లోపునే ఇంటికి చేరుకోవాలట - పది దాటాక లైటు వేయకూడదట - ఇంటివాళ్ళ పిల్లల్ని అప్పుడప్పుడు ఆడించాలట. వారానికి కనీసం ఏడురోజులైనా మార్కెట్టునించి కూరలు కొని తెచ్చి పెట్టాలట - ఇంకా ఎన్నో షరతులు. వీటన్నిటికీ ఒప్పుకొని పైపెచ్చు అణా స్టాంపుమీద సంతకంపెట్టి మరీ ఆ గదిలో చేరాడట.

నయం! మా యిల్లుగలావిడ ఒక్క సంగీతం పాడకూడదన్న షరతే పెట్టిందని సంతోషించి నోరుమూసుకొన్నాం. గాని అణిచేస్తే అణుగుతుందా - దాచేస్తే దాగుతుందా. ఆఫీసులో డస్కు బల్లముందు కూర్చొని - ఆరావళీ పర్వతాలలాంటి ఫైళ్ళని ఉత్సాహంతో పరిష్కరించుతూ ఉంటే - వజ్రాయుధంతో దేవేంద్రుడు కొండల రెక్కల్ని నరుకుతున్నట్టు కలంతో దస్తరాలని దునుమాడుతూ చెండాడుతూ, చీల్చిపారేస్తూ ఉంటే దాం తస్సాదియ్యా, కూసింత కూనిరాగం, కాస్త ఈలపాట రాక తప్పుతుందా.

మా ఆఫీసరాధముడు ఔరంగజీబంత సంగీత విద్వేషి. అతగాడికి నేను కుర్చీలో కూనిరాగం తియ్యడం ఎంతమాత్రం గిట్టదు. నే నిలా నోరు విప్పేసరికి - పానీ తిట్టకూడదూ, అరవకూడదూ, గర్జించకపోతే ఓండ్రపెట్టకూడదూ—ఊహూ "నో హమ్మింగ్ ప్లీజ్" అని చీటీముక్కమీద రాసి బంట్రోతు చేతికిచ్చి శ్రీముఖం పంపించేవాడు. తోటి గుమాస్తాలంతా నన్నేదో జూలో జంతువుని చూసినట్టు చూసేవారు. ఉక్రోషాన్నీ. అవమానాన్నీ దిగమింగి ఫైళ్ళలో తలదాచుకొనేవాణ్ణి.

పెద్దపెద్ద డైరీ ఫారాలలో పాలు పిండేటప్పుడు హెచ్చు పాలివ్వడానికి ఆవుల కోసం సంగీతం ప్రసారంచేస్తారట. కొన్ని కొన్ని కార్ఖానాలలో కార్మికులు కులాసాగా, నిర్విచారంగా పని చెయ్యడానికి కూడా సంగీతం ప్రసారంచేస్తారట. కొండలని కొట్టేవాళ్ళూ, గోడ్లు బాగుచేసేవాళ్ళూ, కోతలు కోసుకొనేవాళ్ళూ పాటలు పాడుకోవడం పరిపాటేకద - ఆఫీసులోని గుమాస్తాలంతా ఏకగ్రీవంగా బృందగానం ఎత్తుకోకపోయినా యథాశక్తి వ్యక్తిగతంగా కూనిరాగం తీయడానికేనా అనుమతించకపోతే అనుమతించనివాడికి బుద్ధిలేదన్నమాట అని ఆఫీసరాగ్రణితో ఘట్టిగా చెప్దామనుకొన్నాగానీ, ఉద్యోగం మానేసి పోయేటప్పుడు చెప్పడంకోసం ఆమాటలు జాగ్రత్తచేసుకొన్నా.

గానీ ఇంతలోకే నేనొక ఆఫీసర్నయి కూర్చున్నా. అద్దె కొంపలో ఒకేఒక్క గదిలో నలుగురితోపాటు ఉండడం స్నానాలగదిలో కూనిరాగం తియ్యడం ఆపుకోవలసిన అస్వాతంత్ర్యం అన్నీ పోయాయి. కుర్చీలో కూర్చొని కూనిరాగం

తీయడం, నాపనిమాని మెచ్చుకొని హెడ్డాఫీసువాళ్ళు 'సెభాషు లేఖలు' రాసి పంపుతున్నప్పుడు ఉత్సాహంతో ఊళ వెయ్యడం ఇలాంటివన్నీ పరిపాటి అయిపోయాయి. గానీ నన్ను మాసి నాలాగే కుర్చీలో కూనిరాగంతీసే గుమస్తా దద్దమ్మలు కొందరు నా చేతికింద దాపరించారు. అతి ముఖ్య సమస్యమీద మీదనున్న అధికారులకి ఉత్తరాలు రాస్తూన్నప్పుడు - సరైన పదజాలం ఎంత కొట్టుకు చచ్చినా దొరకనప్పుడు గుమస్తాగాడి కూనిరాగం వినబడితే, చెప్పొద్దూ, ఒళ్ళు మంటుతుంది. నేను కూడా "నో హమ్మింగ్ ప్లీజ్" అని చీటీ ముక్క మీద రాసి పంపిస్తున్నా. ఆఫీసులో నేనుకూడా కూనిరాగం తియ్యడం మానుకొన్నా.

కానీ, పొద్దున్నే తీరుబాటుగా ఇంటి దగ్గిర కుర్చీలో కూర్చొని, కాఫీతాగుతూ, సిగరెట్ పీలుస్తూ పేపరు తిరగేస్తూఉంటే చిన్న చిన్న టు(మీ)వార్తలు నవరసభరితంగా కనబడుతూ ఉంటే కూనిరాగాలు ఆలాపించక తప్పదు. గాని కూనిరాగం తియ్యడం మొదలెడితే అలవాటయిపోయి అది ఆఫీసులోకూడా పొరబాటున వచ్చేస్తుందని కూనిరాగం బదులు ఏదో కాగితం మీద రాయడం అలవాటుచేసుకొంటున్నా.

ఆత్మానందంకోసం కూనిరాగం తీసినా, అది సహృదయులు ఆలకించి మెచ్చుకొంటే ఆనందం. అలాగే నేనేదో రాసేది మీలాంటి వాళ్లు ఆలోకించితే అంతకన్నా కావలసిందేముంది. చిత్తగించండి.

*  *  *

"డామిట్! కథ అడ్డంగా తిరిగింది" అని వాయించా డెక్కడికి పోయాడో గానీ గిరీశం గాని గుంటూరులో గాని ఈ నెల ఏడవ తేదీనఉంటే ఎంతో సంతోషించేవారు. ఆయనగారి ముఖ్య శిష్యుడు వెంకటేశం అధికారరీత్యా ప్రకటించిన స్టేట్‌మెంటు ప్రకారం గిరీశం గారివల్ల వారికి (అనగా వెంకటేశం గారికి) అబ్బినదల్లా ఒక్క చుట్ట తాగడం మాత్రమే! అయితేనేం చుట్టయొక్క గొప్పతనాన్ని శ్రీగిరీశం గారు అవకాశం దొరికినప్పుడెలా వర్ణించారు. "చుట్ట తాగని ఇంగ్లీషువాణ్ణి నువ్వు చూశావూ" అని ప్రియశిష్యుణ్ణి మందలించారు. చుట్ట పంపిణీమీదే కుంపిణీవారు స్టీము యింజను వగైరాలు కనిపెట్టారని వారు (అనగా గిరీశం గారు) కనిపెట్టారు.

గిరీశం గారు ఎవరెవరు మటుకి కీర్తించినా సంతోషించగలరు. ఒకే ఒక్క సందర్భంలో — వెంకటేశం శిసిమిసి సెలవులకి యింటికొచ్చినప్పుడు గురువుగారితో తన తలిదండ్రుల సమక్షమందు అనర్గళంగా

# [illegible]

★

కొనకళ్ళ వెంకటరత్నం

కలకలమేమో కనుమన్నా
అటు
తెలతెలవారెను తెలుగన్నా

అమరావతి హంపీ శిథిలాలను
అమరశిల్పి యులి కదలినజాడలు
వెనుకటి యుగాల పొరలు చీల్చుకొని
వినపడునో చెదరు నిదుర మంపుల
కలకల...

కుదియించిన జీవకళ లజంతా
గుహాలలోన మంచుమేల్ముసుంగుల
మూగచిత్రాల వాతెరల్కదలి
రాగమురలి చెవి రంజిల్లినా
కలకల...

గలగలమను కెరటాల కడుపులో
కండగల్గు కవితాసుధ కలదని
గోదావరిపెన్నా తరంగిణులు
ఘోషపెట్టుతున్నవిరా వినరా
కలకల...

శిలలుద్రవించిన చోట తేమలై
చిగిరించిన మోడు లుపవనాలై
మధువొలికిన త్యాగరాజు కోకిల
మరల గొంతు సవరించేనేమో
కలకల...

నిప్పురేడలిన పలనాటి తేకువల
నిప్పుకుండను పెకీలు మన్నదో
రాజమార్గమున కదలిన తెలుంగు
రథచక్రాల నినాదములో అవి
కలకల...

ఇంగ్లీషులో సంభాషించిన పిదప కరటక శాస్త్రుల్లవారి కోరికమీద చదవమన్న తెలుగు పద్యానికి మచ్చుతునకగా "పొగచుట్టకి సతిమోవికి" అనే పద్యం చదువుతుండగా గిరీశం గారు వారించారు. ఆ ఒక్క తరుణంలో తప్పించి గిరీశం గారు మరెప్పుడూ పొగచుట్ట ప్రశస్తినీ, ప్రసక్తినీ కీర్తించడం మానలేరు. వారు పొగాకుని చుట్టలుగావాడి సద్వినియోగం చెయ్యాలని ఉపదేశించారు. నశ్యంకింద వాడడం మహాపాపం అనికూడా సెలవిచ్చారు.

గిరీశం గారికి ప్రియమైన పొగచుట్టకీ పొగాకుకీ ఈ నెల ఏడవ తేదీన పండుగలాంటిది జరగడం అస్మదాదులకి ఆనందదాయకం అందులోకీ, సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ వాణిజ్యమంత్రి టి టి కృష్ణమాచారిగారూ, సదరు ప్రభుత్వ ఆర్థికశాఖ ఉపమంత్రి మహాగారూ వెంచేసి ఆంధ్ర పొగాకు సాంకేతికాంకాలు వినడం గిరీశం గారి అనుయాయులమైన మాకందరికీ జిల్లాలోన్నూ పిప్పిడేంటు గిరీ నొక్కినంత సవ్వనం. (అన్నట్టు వీటిని అనగా ఈ గిరిలని రద్దు చేసేస్తారట - అది తరవాత చూసుకొందాం)

ప్రపంచంలో పొగాకు ఉత్పత్తిచేసే దేశాల్లో భారతదేశం ఒకటి. (ఎంత గొప్ప విషయం!) దేశవాళీ పొగాకులో సగభాగం గుంటూరు తత్పరిసర జిల్లాలలోనే ఉత్పత్తి అవుతూంది. (ఎంత గర్వకారణం!) ఏ దొరలు చుట్టపంపిణీ మీద స్టీము యింజను కనిపెట్టి - మన దేశాన్ని గెలిచారో, ఆ గిరీశం గారి దొరల దేశానికే ఏటా పదికోట్ల పౌనుల పొగాకు ఎగుమతి అవుతూందట. (ఇందుకు నాకళ్ళప్పుడే నెత్తిమీదకి వచ్చాయి.) పొగాకు ఎగుమతివల్ల పన్నెండు కోట్ల రూపాయిల విదేశీనాణెములు మన దేశానికి దొరుకుతున్నాయి (దేశముఖుగారు మనకి కృతజ్ఞత చూపాలి) ఎక్సైజు సుంకం, ఎగుమతి పన్నుల మూలంగా కేంద్రప్రభుత్వానికి ప్రతిసంవత్సరం వచ్చే 40 కోట్ల రూపాయలలో సగభాగం ఆంధ్రరైతులు పండించే పొగాకు మూలంగానే వస్తూందట. (ఈ ఒక్క ఏడాది ఈ దెబ్బ కేంద్ర

# కుర్చీలో కూనిరాగం ★

(ప్రభుత్వం తనది కాదనుకొంటే - రామపాదసాగరం మనకి వీలవుతుందా?)

ప్రభుత్వంవారి బొక్కసానికి, జాతీయ సంపదకూ యింత గొప్పగా తోడ్పడుతున్న ఈ పొగాకుని ఉత్పత్తిచేసే రైతులకి చాలా క్లిష్ట సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించడానికే ఈ పొగాకు మీటింగు జరపడం. కృష్ణమాచారిగారు ఏదో ఒక రీతిగా (మనకు లాభించేరీతిగా అని వేరే చెప్పాలా) దీన్ని పరిష్కరించి పొగాకు ఉత్పత్తి వర్తకాలలో యేర్పడ్డ సంక్షోభాన్ని రూపుమాపితే అస్మదాదులం సంతోషిస్తాం.

వర్జీనియా నాటు పొగాకుకి సంబంధించిన అన్ని సమస్యలమీద తమకు తెలిసిన సమాచారాలతో తీర్మానముల రూపంలో గాని సలహాలుగాని 4 వ తేదీకి అందేటట్టు ఈ మీటింగు ఆహ్వాన సంఘాధ్యక్షులకి పంపాలనే కాగితం ఒకటి నాకు లేటుగా అందింది. లేకపోతే ఒక్క సలహా పంపేవాడిని. ఈ చెన్నపట్టణం దుకాణాలలో ఫస్టురకం వేగోలు పొగాకు దొరక్క అస్మదాదులం ఛస్తున్నాం. పై దేశాలకి ఎగుమతి తరవాత చూసుకొందాంగాని ప్రస్తుతం చెన్నపట్టణానికి విరివిగా పొగాకు ఎగుమతిచేసి పుణ్యం కట్టుకొంటే కనీసం నే నొక్కణ్ణైనా ఏకగ్రీవంగా హర్షిస్తాను.

* * *

మన మంత్రివర్గానికేమైనా మతిపోతూందా ఏమిటి చెప్మా! లేకపోతే (కొందరికి) నిక్షేపంలాంటి జిల్లాబోర్డులను రద్దు చేసేస్తామంటారేమిటి? వీళ్ళంతే పదవుల్లో కూర్చున్నారుగాని, కూర్చోని వాళ్ళ మాటేమిటి? మంత్రిపదవి దొరక్కపోతేపాయె- కనీసం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగిరీ అయినా ఉండకపోతే కొందరికి కాలం పొద్దుపోదు. అదీకాక జిల్లాబోర్డు ప్రెసిడెంటంటే, వీడిల్లు బంగారం కానూ (కొందరి విషయాల్లో అయిందిలెండి) ఎంతహోదా, ఎంత దర్జా!

కుర్రవాడు: అమ్మా! నాన్న ఇవాళ ఆఫీసుకు తొందరగా వెళ్ళిపోయారేమి?

తల్లి: అయ్యో ఇవాళ డబ్బు అడగడం మర్చిపోయానే?

—వల్లూరి రామారావు, బందరు.

అలాంటిది లేకుండా చేసేస్తే.. ఏమో మంత్రివర్గంవారు బాగాఆలోచించి, ఏదో అంతకు తక్కువకాని హోదా గల ఇంకో పేరైనా ఏర్పాటుచేసి ఆతరవాత యిలాంటి పదవులు రద్దుచేస్తే మంచిది! ఎవరికి? వాళ్ళకే? - జమీందారీలు రద్దుచేసి నష్టపరిహారం ఇచ్చినట్టు - కొంతమంది ప్రెసిడెంటులకి నష్టపరిహారం కూడా ఇచ్చుకొంటే మరీ మంచిది. ఏమైనా, రాజప్రముఖ్ గిరీలు రద్దు చేయమని పైవాళ్ళకి రాయకూడదూ - అవీ మన మంత్రులలాంటి వెంకుకు వేస్తారండీ. పోన్లెద్దురూ - ఆఫీసుకి వేళవుతోంది తరవాత చూసుకొందాం. ★



మత్స్యాన్వేషణ ఫొటో : యం. వీరభద్రరావు, విజయవాడ.




నిన్న నే, యథాలాభంగా పోతున్న ఒకానొక మహాకవిని నిలబెట్టి, ఆయన్ని దర్శించుకొన్నట్టు నటించి, మంచిగా నాలుగుమాటలాడి, లంచంగా రెండుపొగడ్తలు పొగిడి "మహాకవీ, మహాశయా, మహానుభావా! ఇంగ్లీషులో కల్చర్ అనేదాన్ని తెనిగించినట్టు కనబడే సంస్కృతి అనేదానికి నిర్వచనం ఏమిటో కాస్తా శెలవిస్తారా" అని అర్థించేటట్టు ప్రార్థించాను. ఆయన అందరు మహాకవుల లాగే, మహాశయులలాగే, మహానుభావుల లాగేమోమెత్తి, తల పంకించి, చూపు నిగిడించిచిరునవ్వునవ్వి, అంతలోనే నిట్టూర్పు విడిచి, నానాబాధాపడి "ఏ నాయనమ్మనడిగినా చెపుందిగా" అని తప్పుకొన్నారు.

ఈ మహావాక్యం విన్నాక, మహావాక్యంతు కర్తవ్యం అని నాకు నేను హెచ్చరిక చేసుకొన్నాను. వారు సెలవిచ్చినట్టు ఏ నాయనమ్మనైనా వెళ్ళి అడుగుదామని నిశ్చయించుకొన్నాను. కాళ్ళీడ్చుకొంటూవెళ్ళి ఆవిడ దర్శనం చేసుకొన్నా. ఆవిడపెట్టిన ప్రశస్తమైన దిబ్బరొట్టె ఆవకాయ నంజుకొంటూ, "నాయనమ్మా, నాయనమ్మా సంస్కృతంటే ఏవిటో కాస్త చెబుదూ" అన్నాను. ఆవిడ మారు వడ్డిస్తున్న దిబ్బరొట్టి కాస్తా ఉపసంహరించి నేను మాతంశానికి తలవంపులు తెస్తున్నంత అపకీర్తిని దిగమింగి, "ఒరే అంతవాడి కడుపునపుట్టి, అల్లంతవాళ్ళ మనవడివై సంస్కృతం అంటే ఏవిటో తెలియదట్రా" అని కోపించింది.

నేను తమాయించుకొని, "సంస్కృతం కాదు నాయనమ్మా! సంస్కృతి, సంస్కృతి. దాన్ని ఇంగ్లీషులో కల్చరంటారు. సరైన జాతీయమైన తెలుగులో కల్చరంటేఏవిటో ఒక్కమాటలో చెప్తావని అడిగా" అని ఆవిడకి బోధపరిచాను. ఆవిడ "ఏవిటీ ఏవిటీ" అని రెట్టించి, "పోనిద్దూ పోయిన పొద్దల్లా పోయి అవన్నీ ఎందుకూ, హాయిగా కడుపునిండా దిబ్బరొట్టితిని, కళ్ళుమూసుకు పడుకో" అని సలహా యిచ్చింది.

మహాకవిని అడిగితే అలా సెలవిచ్చాడు. నాయనమ్మని అడిగితే ఇలా సలహాఇచ్చింది. కల్చర్ అంటే ఈ రెండింటికీ మధ్యస్తంగా ఉంటుందో అన్న అనుమానం వేయడంలో ఆశ్చర్యంలేదు. మహాకవులకీ, మహాశయులకీ, మహానుభావులకీ, ఇలాంటి మహామహా వాళ్లకీ, చులకనగా, తేలిగ్గా చూడతగ్గంత సర్వసాధారణమైనదీ, నాయనమ్మలకి అదేమిటయినా ఫరవాలేనిదీ కల్చర్ కామోసు అని తేల్చుకొన్నా.

వాస్తవానికి కల్చరంటే ఏమిటో నాకు తెలియక కాదు, ఇంత తాపత్రయపడి అదేమిటో తెలుసుకోడానికి ప్రయత్నించడం. కల్చర్ గలవాళ్లని కొంతమందిని నేను కల్సుకొన్నాను. వాళ్ళ పరిచయదౌర్భాగ్యం కలగడం నా దురదృష్టం. బొంబాయిలో ఒక పెద్దమనిషి నా కింకో పెద్దమనిషిని పరిచయం చేశాడు. ఆ పెద్దమనిషికి చాలాచాలా కల్చరుందట! ఈ విషయం పరిచయం చేస్తున్న పెద్దమనిషే నాకు హెచ్చరిక చేశాడు. ఆ పెద్దపెద్దమనిషిలోని కల్చరేం నాకళ్ళకి కనబడలేదు. నా మొహంగాని, కల్చర్ కళ్ళకి కనబడుతుందా. అది అనిర్వచనీయమైన అవ్యాజ పరబ్రహ్మ పదార్థంలాంటిదిగాబోలు.—గాని పెద్ద పెద్ద మనిషిగారి మాటలనిబట్టి కల్చరంటే ఏమిటో పోల్చేసుకొన్నా.

**ఆరుద్ర**

ఆయన మాట్లాడే ప్రతీ రెండో వాక్యంలో "షా చెప్పినట్టూ, చూడండీ, ఆరిస్టాటిల్ అన్నట్టు - కారల్ మార్క్సు ఏమన్నాడంటే" అంటూ చాలాచాలా గొప్ప గొప్ప వాళ్ళ పేర్లు లాక్కొచ్చాడు. అప్పుడు కల్చరంటే ఏమిటో నాకు బోధపడిపోయింది. పెద్ద పెద్దవాడిగా చెలామణీఅవడానికి గొప్ప గొప్పవాళ్ళు చెప్పిందంతా తెలిసుండాలని. మామూలువాళ్ళు కూడా మాట్లాడుతున్నప్పుడు అప్పుడప్పుడు ఏదో శాస్త్రం చెప్పినట్టు అని అంటూఉంటుంటే—ఆ అంటూ ఉండడంలోనే ఉంటూఉన్న దన్నమాట ఈ కల్చరనే దానికి బీజం. మనం చెప్పే దానికి, ప్రాచీన ప్రమాణాలు, సాధికారమైన ఉదాహరణలో చెప్పడమే కల్చర్ కి ఆయువుపట్టు కాబట్టి, మీకు మనవిచేస్తున్న ఈ రెండు ముక్కల్లో ఉదహరించే నిమిత్తం సంస్కృతికి నిర్వచనం ఏమిటో చెప్పమని మహాకవినీ, మా నాయనమ్మనీ, ప్రార్థించాను. వాళ్లు కాస్తా అలా చేశారు.

పోనీ ఏం చేస్తాను. కల్చర్ అనగా సంస్కృతి, అనగా పెద్దపెద్దమనిషితనం, అనగా గొప్పగొప్పవాడితనం, లేక సర్వజ్ఞత్వంలో సంగోరుభాగం ఇవేవీ లేనివాడిలాగే ఏదో నేననుకొంటున్న నాలుగు ముక్కలూ మనవిచేస్తా చిత్తగించండి.

ప్రతీమనిషి పుట్టేటప్పుడే, రెండు కళ్లతోటీ రెండుకాళ్ళతోటీ పుట్టేటట్టు ఇంత సంస్కృతితో పుట్టడు. అలా పుట్టినవాడు గిట్టేలోపుగా పెరిగి పెద్దవాడయితే, అతగాడు ఆకళించుకొన్నది, అవగాహన చేసుకొన్నది ఆనవాయితీగా వస్తున్నదానిని అనుసరిస్తున్నదీ అంతా కలిపి వెరసి సంస్కృతి అని చెప్పుకోవచ్చు. చరిత్ర, సాహిత్యం, విజ్ఞానం, సంప్రదాయం, ఆచార వ్యవహారాలు ఇవన్నీ కావుండా, ఇవన్నీ అవుతూ వీటన్నిటినిగ్గూ, చదువు గిదువు, సదసద్వివేకం, సహృదయత, సరసత అనే వాటిని కలిపి జాతీయత అనే అమాందస్తాలో వేసి మర్దించి మర్దించి అర్థంచేసుకొని నెత్తికి, ఒంటికి, ఇంటికీ పట్టించుకొన్నదే కల్చరని నా ఉద్దేశం. ఇది నేచురల్ గా, సహజంగా దానంతట అదే అబ్బుతుందని తమలాంటి వాళ్ళు అభిప్రాయపడి దాన్ని తెచ్చిపెట్టుకొందికి అడ్డదారులు వెదకవలసిన అవసరం ఏముందా అని నన్ను ప్రశ్నించవచ్చు.

అవసరం ఉంది. అడ్డదారులు వెదకాలి. లోకం మారుతూంది చూడండి. దాంతోటి సంస్కృతియొక్క కొలతలు కూడా మారిపోతున్నాయి. మనకి స్వరాజ్యం రాకముందు అధికారవర్గాలకీ, వాళ్ళ చుట్టూవున్న వాళ్ళకి కల్చరంటే ఒక అభిప్రాయం ఉండేది. అలాగే అనధికారవర్గాలవారికీ, వారిచుట్టూఉండే వాళ్లకీ మరొక అభిప్రాయంఉండేది. స్వరాజ్యం వచ్చేక ఇది మారిపోయింది. ఆంధ్రరాష్ట్రం వచ్చాక మనకి కొద్దిగా, మారుతుంది. మనకి స్వతంత్రం వచ్చేక సంస్కృతికి మరీ గిరాకీ తగిలింది. దేశదేశాలనుంచి, రకరకాల సంస్కృతీ రాయబారవర్గాలు ఆరోజు కారోజు మనకి దిగుమతి అయిపోతున్నాయి. మనదేశంనుంచి అధికార, అనధికార సంస్కృతీ రాయబారకూటాలు ఎగుమతి అవుతున్నాయి. మనదేశంలోకి దిగబడుతున్న వాడికోసం మనం ఎగబడుతున్నాం. మనం పైదేశాలకి రవాణా చేస్తున్న వాటిని విదేశీయులు చూచి తలలూచి కరతాళ ధ్వనులమధ్య వేనోళ్ల పొగుడుతున్నారు. ఇటువంటి శుభసమయంలో, చరిత్రాత్మకమైన చరితార్థమైన దివ్యతరుణంలో సంస్కృతి అంటే ఏవిటో

# ★ కుర్చీలో కూనిరాగం ★

దాన్ని సాధించడానికి దారి సుదూరం కాబట్టి అడ్డదారిని బడి దాన్ని తెచ్చి పెట్టుకోడానికి కొన్ని కిటుకులు తెలుసుకోడం క్షేమకరం.


మనదేశానికొస్తున్న సంస్కృతి రాయబారవర్గాలలో ఎవరెవరున్నారో ఏఏ డిపార్టుమెంటుల సంస్కృతుందో చూస్తే కిటుకుల కీలకం మనకి తెలిసిపోతుంది.

కవులు - నాట్యంచేసేవాళ్లు, వాళ్ళవాళ దేశాలలో వాళ్ళ వాళ్ళ పల్లెటిదిక్కు, పాటలు పాడేవాళ్ళు, సంగీతం పాడేవాళ్ళు జంత్రాలు వాయించేళ్ళు వీటన్నిటినీ మించి వీటన్నిటినీ గురించి మాటాడేవాళ్ళు వీళ్ళంతా సంస్కృతికి ప్రతినిధులన్న మాట. వాళ్లలాగ మాట్లాడగలగడం, లేకపోతే వాళ్లు ఆడేదీ పాడేదీ అర్థంచేసుకోగలగడం, సరైన సందర్భాల్లో సరిగ్గా చప్పట్లు కొట్టగలగడం నేర్చేసుకొంటే మనకి సంస్కృతిలేదని ఎవడూ చెప్పడానికి సాహసించడు.

పాతచింతకాయ పచ్చడిలాగ, అతి ప్రాచీన, అతిపురాతనమైన కిటుకు ఇంకోటి ఉంది. అదేవిటంటే - మనవిచేస్తున్నా. శతశ్లోకీ నపండితః అని ఒక చిన్న సూత్రం ఉంది. నూరుశ్లోకాలు వచ్చినవాడు పండితుడు కాడు అని దానిభావం. గాని శతశ్లోకేన పండితః అని అంటే నూరుశ్లోకాలు వచ్చినవాడు పండితుడు అని మార్చేశారు. అది సంస్కృతి సాధించడానికి అడ్డదారిగా పనికొస్తుంది. వందకాకపోయినా, సత్యనారాయణ వ్రతంలో చెప్పినట్టు బంగారం అంత ఓపిక లేకపోతే వెండి - దానికీ సత్తువలేకపోతే రాగి - దానికీ గతిలేకపోతే ఇత్తడి అన్నట్టు వందకాకపోతే, యాభైలేకపోతే పాతిక పద్యాలు, శ్లోకాలు, సుభాషితాలు కంఠతా పెట్టండి. అవకాశం వచ్చినప్పుడల్లా రాకపోయినా ఇబ్బందిలేదు. తెచ్చుకోవాలి - అడ్డమైన వాళ్ళదగ్గరా, అడ్డంకొని వాళ్ళదగ్గర అవి యా కరువుపెట్టండి. పడికట్టు రాళ్ళలాగ కనబడ్డా ఈ పదాలు పాదాలూ, పద్యాలూ మనలో గల సంస్కృతిని బయటికి చూపెట్టే సాధనాలు. మనకి స్వతంత్రం రాకముందూ ఇంగ్లీషులోవి అప్పుడప్పుడు అనడం సంస్కృతికి గుర్తు. స్వతంత్రం వచ్చేక దేశవాళీ, ప్యూర్ స్వదేశీ అనగా సంస్కృతం సామెతలు గుప్పించడం ఫాషన్.

భ్రమరకీటన్యాయం, తిలతండులన్యాయం, స్థాలీపులాకంగా, విపులాచపృథ్వీ, నందో రాజ భవిష్యతి, భ్రష్టస్యకావాగతిః మొదలైన రడీమేడ్ మాటలు కొన్ని పనికొస్తాయి. ఉపనిషత్తుల్లోకి, భగవద్గీతలలోకి పోవడం మరీ మంచిది. అట్టే సంస్కృతి లేకపోయినా, అడ్డదారిని అన్నీ సాధించి అమోఘవిజయాలని పొందినవాళ్లలో అగ్రగణ్యుడు శ్రీజిత్ ఎన్. గిరీశంగారు. ఇతగాడు ఏదో నోటకొచ్చిన పద్యము—

ఖగపతి అమృతం తేగా
భుగభుగమని పొంగి చుక్క భూమిని
వ్రాలెన్



ఇండియన్ సోప్ & టాయిలెట్రీస్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులు


పొగచెట్టై జన్మించెను
పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్.

అని చదివిపారేసి ఇది బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో ఉంది చూసుకో అన్నాడు. వెంకటేశం నమ్మేవాడు. దమయంతి రెండో పెళ్ళికి ధరనుండే రాజులెల్ల దడదడవచిరీ. అని దడదడచదివేసి ఇది మరేదో పుస్తకంలో ఉందన్నాడు. పాపం పూర్ గర్ల్ బుచ్చెమ్మ నమ్మక తప్పిందికాదు. వెంకటేశం దృష్టిలో, బుచ్చెమ్మ ఉద్దేశంలో గిరీశంగారు ఎంతో గొప్పవారు, అన్నీ తెలిసినవారు అనగా బోల్డంత కల్చెరున్నవారు. మనంకూడా పూజ్యులు, గురుపాదులు అయిన శ్రీ గిరీశంగారి అడ్డదారినిపోతే ఇట్టే సంస్కృతిని సాధించేస్తాం. అయితే గిరీశంగారి లాగే మనకన్నా తక్కువ చదువుకొన్నవాళ్ళ దగ్గరా, కొంచెం తెలిసినవాళ్ళదగ్గరా ఇలా తస్సాలు చెప్పి రంజింపచేస్తేనే మంచిది. లేకపోతే మన యొక్క దేహారోగ్యానికి కొద్దిగా భంగం వాటిల్లవచ్చు.

మనకన్నా హెచ్చు తెలిసినవాళ్ళదగ్గర కూడా వాళ్ళకన్నా ఎక్కువ తెలిసినట్టు నటించి మనకి మరీ కల్చరున్నట్టు బుజువు చేసుకోవచ్చు. మళ్ళా గిరీశంగారి ఉదాహరణే తీసుకోండి. సౌజన్యరావు పంతులుగారిదగ్గర శ్రీమాన్ మిస్టర్ గిరీశంగారు షేక్స్పియరుగారు చెప్పిన వాటీజ్ ఇన్ ఎ నేమ్ అన్న సూక్తిని పేరులోన ఏమి పెన్నిధి ఉన్నది అనే ఆటవెలదిముక్కలోకి తర్జుమాచేసి భేష్ అనిపించుకొన్నారు. అలాగే మనంకూడా కొద్దిపాటి తెలివితేటలతో సంస్కృతికి అడ్డదారిని పట్టుకోవచ్చు.

మరో చిన్న కిటుకు. కళ్లూ, చెవులూ లేని ముసలమ్మ వీధిభాగోతంచూసి మెచ్చుకోడం జ్ఞాపకం ఉందా. అంతా నవ్వుతున్నప్పుడు మెచ్చుకొంటున్నప్పుడు నన్ను కాస్త గిల్లితే నేనూ నవ్వుతానందట. నవ్వుతానన్న ఆవిడ తెల్లారేక నవ్వుతాలపాలయింది గాని ఆవిడ సూత్రం కొద్దిగా ఆధునిక పరిస్థితులకి అనువుగా మనం మార్చేస్తే మనకో అడ్డదారి దొరుకుతుంది. పెద్ద పెద్ద పాటకచేరీలు జరుగుతున్నాయి అనుకోండి. పాటగాడు ఏదో పాడేస్తూఉంటే వినేవాళ్లలో కొందరు అప్పుడప్పుడు ఏకగ్రీవంగా వహ్వా—భేష్—సెభాష్ అని అరుస్తూ ఉంటారు. ఎందుకు వహ్వా అనాలో ఎక్కడ భేష్ అనాలో ఎలా సెభాష్ అనాలో మనకి తెలియదనుకోండి. అయినా ఇబ్బంది లేదు. వాళ్ళంతా అలా అనేటప్పుడు వాళ్లతోపాటు మనంకూడా, వాళ్ళకన్నా బిగ్గరగా మెచ్చుకొంటే వాళ్ళకున్నంత సంస్కృతి మనకికూడా ఉందనుకొంటారు. ఇక పోతే చిత్రకళాప్రదర్శనా లుంటాయి. అక్కడ కూడా మన సంస్కృతిని ప్రదర్శించడానికి అడ్డదారులుంటాయి. ఆధునిక చిత్రకళ, ఆమాటకొస్తే ప్రాచీన చిత్రకళ కూడా మనకి తెలియకపోయినా ఇబ్బంది లేదు. ఏ బొమ్మదగ్గర పదిమంది గుమిగూడుతున్నారో ఆ బొమ్మదగ్గర మనంకూడా ఓ గడియసేపు నించుంటే సరి. ఇంతకన్నా గట్టికిటుకు ఇంకొకటి ఉంది. ఒక బొమ్మదగ్గర నిలబడి తదేకదృష్టితో దాన్ని చూసి, ఆ బొమ్మని అడుగుదూరంనుంచి, పదడుగుల దూరందాకా కొంచెం వెనక్కి వెళ్ళి కొంచెం దగ్గరకొచ్చి, ఈపక్కనుంచి, ఆపక్కనుంచి పరిశీలించి మనం పరీక్షగా చూస్తున్నట్టు పదిమందికీ తెలిసేటట్టు చేసుకొంటే మనకీ ఎంతో సంస్కృతిఉన్నట్టు తెలియవచ్చు. ఎంతో తెలిసినవాడుకాకపోతే అంత కూలంకషంగా ఎందుకు చూస్తాడు. అని వాళ్లనుకొంటారు. లేతతోటకూరకాడలలాంటి చేతులు, టి. బీ. పేషెంటుల్లాంటి ఆకారాలుఉన్న ఆడవాళ్లని మగవాళ్లని వేసే ఆర్టిస్టుని అంతా గొప్ప చిత్రకారుడంటున్నారనుకోండి. మీరూ ఒప్పుకోండి. మీరు సంస్కృతికివెళ్లే హైరోడ్డుమీద ఉన్నట్టే లెక్క. ఇక ఆధునిక చిత్రకళ ఒకటుంది. అదిమహామహావాళ్లకేబోధపడదు. అయినా దాన్ని వాళ్ళు హర్షిస్తూఉంటారు. అది తలకిందులాఉందో ఎటు పక్కదాని మట్టమో తెలియకపోయినా ఇబ్బంది లేదు. పికాసోలాగ ప్రయత్నించినా ఆర్టిస్టులో ఏదో ఉందని మీరు అనండి. క్యూబిజం, ఇంప్రెషనిజం, మొదలైనవి అతడిమీద పని చేశాయి - అని మీకు తెలిసినట్టు అందరికీ తెలియచేస్తే మీరు సంస్కృతిగలవాళ్లలాగ చెలామణీ అయిపోతారు. మీరు బంగారప్పిచుకలై మీదగ్గర డబ్బు మూలుగుతూ ఉంటే అందరూ మెచ్చుకొంటున్న చిత్రాలలో కొన్ని కొనేయండి. మీ సంస్కృతికి విలువకూడా ఉంటుంది. మీరు డబ్బున్నవాళ్లయితే సంస్కృతికి ఎన్నో అడ్డదారులు చేస్తాను. సంస్కృతి ఉన్నట్టు నటించడం శ్రీమంతులకి చాలా ముఖ్యం. మీరేదో పనిమీద పైదేశాలకి వెళుతున్నారనుకోండి. కొద్దిగా డబ్బు ఖర్చుపెట్టి వెళ్లేముందు ఒక చిన్న మీటింగు పెట్టించండి. మీ మెడలో నాలుగుదండలు వేయించుకోండి. ఆ దేశానికి, అనధికారంగా వెళుతున్న సాంస్కృతిక రాయబారవర్గంలోని ఏకైక ప్రతినిధిగా మీ భుజస్కంధాలమీద పురజనుల కోరికమీద కొంత భారాన్ని పెట్టించుకోండి. ఆ దేశం వెళ్లాక మీ వ్యాపారం మీరు చేసుకొని చూసుకొని చక్కా వచ్చెయ్యండి. వచ్చేక మరో మీటింగు పెట్టించుకొని, మరికొన్ని దండలు వేయించుకోండి. అక్కడ తీసిన ఫొటోగ్రాఫులు గట్రా నలుగురికి చూపెట్టండి. ఆ దేశం కబుర్లు నాలుగు చెప్పండి. ఈ సంగతులు దినపత్రికలవాళ్ళు అచ్చువేశారా సరేసరి. లేకపోతే డబ్బిచ్చి ప్రకటనగా మీరే వేయించుకోవచ్చు. మీ వ్యాపారం మీరు చేసుకొంటూఉంటే అది నలుగురికీ లాభించి పదిమందీ మెచ్చుకొన్నారనుకోండి. అది అదనుగా తీసుకొని ఓ రెండు సన్మానాలు చేయించుకొంటే మీ సంస్కృతికి మరి ఢోకా ఉండదు.

ఇన్ని రకాల అడ్డదారులలో పడి చాలామంది సంస్కృతిని సాధించుతున్నారుగాని మనంకూడా అలా చేస్తే కొద్దిగా ఔచిత్యం పాటించడం అవసరం. లేకపోతే బెడిసికొడుతుంది. ఔచిత్యం అంటే సందర్భశుద్ధి అన్నమాట. ఒక చిన్న ఉదాహరణ మాడిండి. మామూలుగా మన ఊళ్లలో సంతర్పణలు అవీ అవుతున్నప్పుడు-మజ్జిగా అన్నం కలిపేవేళకి కొద్దిగా ముందుగా కొందరు కస్తూరీ తిలకంలాంటి శ్లోకాలు చదవడం తక్కినవాళ్లు "భోజనకాలే నమః పార్వతీ పతే హరహర మహాదేవ" అని అరవడం కద్దు. అదొక రకమయిన సంస్కృతి. ఒక సంతర్పణలో - సంస్కృతికోసం నేను చెప్పిన అడ్డదారులలో కృషిచేసిన ఒకానొక బుద్ధిమంతుడు తక్కినవాళ్ళంతా ఏవేవో శ్లోకాలూ, పద్యాలూ, చదువుతూ ఉండగా "నేనేనా తక్కువతిన్నాను. (నిజానికి సంతర్పణలో అందరికన్నా అతడే ఎక్కువ తిన్నాడులెండి) నేనుమట్టుకు వీళ్ళలా చదవలేనా" అని "ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు" అని తనకి జ్ఞాపకం ఉన్న పద్యం కాస్తా చదివాడు. తరవాత ఏమయిందో మీరే ఊహించుకోగలరు. సంస్కృతికి సీదా రాస్తాలో వెళ్ళడం వీలుపడకపోతే అడ్డదారిని వెళ్ళడం మంచిదేగాని "ఉప్పుకప్పురంబు" పద్యం చదివిన స్నేహితుడిలాగ ముళ్లకంపనీ, గాజుపెంకుల గోడని దాటి సంస్కృతిని సాధించకపోవడం సర్వోత్తమం. (ఈ సంగతే మొన్న రేడియోలో చెప్పాను మీరు వినిపించుకొన్నారో లేదో అని మళ్ళీ చెపుతున్నాను.) ★



# కుర్చీలో కూనిరాగం

బుద్ధ

"బలరామ్‌పూర్ ఆస్పత్రిలో ఉన్న తోడేలుబాలుడిని తోడేళ్లు పెంచి ఉండవు. అదంతా నాటకం"

"మైసూర్ జంతు ప్రదర్శనశాలలో ఆమరణాంతం నిరశనవ్రతం పట్టిన పాము అసలు నిరాహారదీక్షే పూనలేదు"

"ఖూర్గు ధనలక్ష్మి నిజంగా అన్నపానాదులు ముట్టుకోటంలేదు"

"మార్క్సు ఆర్థిక సాంఘిక సూత్రాలు తప్పు"

"శ్రీనాథుడికి సీసపద్యం రాయడం రాదు"

"విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణం మూలం చదవలేదు. చదివినా అది వారికి బోధపడి ఉండదు"

ఒక్కవారంలో ఎన్నివార్తలు విన్నా! పూర్వం నిత్యసత్యాలుగా చెలామణీ అయిన విషయాలు టపీమని అబద్ధాలు అని వింటే ఏమిటో అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరి ప్రకటనలని ఖండించుకూనే ఉన్నారు. స్వవచోఘాతాలు మరీని. "అప్పుడెప్పుడు ఒపినియన్సు ఛేంజి చేస్తూఉంటేనే గాని పొలటీషియన్ కానేరడు" అని గిరీశంగారు సెలవిచ్చాడు. రాజకీయవేత్తలు ఏమన్నా-మనమేం లక్ష్యపెట్టం. ఏమంటే, లక్ష్యపెట్టినా పెట్టకపోయినా వాళ్ళు అంటూనే ఉంటారు.

లోగడ అట్లాంటిక్ ఛార్టరు అని ఏదో ఉండేది. దాన్లో ప్రపంచం ఉద్ధరించడానికి పెద్ద పెద్ద బుర్రలు ఏమిటో ఏవేమిటో నిర్ణయించేరని మనమంతా భ్రమపడ్డాం. చాలాకాలం పత్రికలు పతాక శీర్షికలుపెట్టి సదరు అట్లాంటిక్ ఛార్టరుగురించి ఏవేవో ప్రచురించాయి. తీరా ఒక మంచి చెడ్డరోజు చూసి అది తిలకాష్ఠ మహిష బంధనం అని తేల్చేశారు.

అలాగే, "శ్రీబాగు పాక్టు" అని అరవ వలసినంత అరిచారు. దాన్ని అచరించకపోతే అటు సూర్యుడిటు ఉదయిస్తాడు; సాగరాలు ఇంకిపోతాయి; గ్రహాలు గతులు తప్పుతాయి; ప్రళయం సంభవించేస్తుంది అన్నారు. కర్నూలులో రాజధాని పెట్టేశారు. వైజాగులో హైకోర్టు అంటున్నారు. "శ్రీబాగుపాక్టు" ఏమయిందో మనకి తెలియదు; ఏంచేశారో చెప్పరు. ఇవన్నీ గిరీశంగారి ధోరణిలో "అప్పుడెప్పుడు ఒపినియన్సు ఛేంజి చేయడం." రాజకీయాలు ఇలాగే అఘోరిస్తూ ఉంటాయిగాని తదితర విషయాల్లోకూడా తక్కిన ప్లేటు మార్పుగాస్తే మనస్సు చివుక్కుమంటుంది.

అమెరికా రచయిత ఒకడు మార్క్సు సిద్ధాంతాలు తప్పుఅని ఋజువు అయినట్టు ఋజువుచేస్తూ ఒక పుస్తకం రాశాడట. మార్క్సుసిద్ధాంతాలు రైటో తప్పో తేల్చవలసినది మహామహా తెలివైన వాళ్ళకి గాని చేతకాదు. మనలాంటి సగటు బుర్రలకి అది కొరుకుడు పడదు. అయినా ఓ ఇరవై ఏళ్ళపాటు కాంగ్రెసులో ఉంటూఉండే సోషలిస్టులూ – ఆ రోజుల్లోనే నెహ్రూగారూ మరీ మరీ పెద్దవాళ్లు "మార్క్సిజం - మార్క్సిజం" అంటే "ఓహోహో" అన్నాం. మార్క్సు ఇలా అన్నాడు కాబట్టి ఇలా జరుగుతుంది అని ఎవరైనా తెలిసినవాళ్ళు చెప్తే టక్కున నమ్మేవాళ్లం. కాలం మారిపోయింది.

రాజకీయాలు, సాంఘిక ఆర్థిక సిద్ధాంతాలు ఎలాగా ఇలా ఉంటాయని, మనల్ని తికమకలు పెడతాయని మనకు తెలిసిందే వాటిని కొంచెం పట్టించుకోడం మానేద్దాం. మరి తతిమ్మా విషయాలు? "శ్రీనాథుడికి సీసపద్యాలు రాయడం చేతకాదు." "విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణం మూలం చదివిఉండరు" వగైరా వగైరా విషయాలు ముందు మనవిచేశానే - అవి వింటే ఎలా ఉంటుంది. సాహిత్యం విషయం తరవాత మాట్లాడుకొందాం గాని "తోడేలు బాలుడు" "పాము ఉపోషం" వాటిని చిత్తగించండి.

రుడ్‌యార్డ్ కిప్లింగ్ కథానాయకుడిలాంటివాడు మనతిరంలో మన కళ్లముందు (పేపర్లలో) కనబడ్డాడని ఎంత మురిసిపోయాం. తీరా అదంతా అబద్ధం అంటే ఎలా నమ్మడం. ఎంత ఆశాభంగం! మద్యనిషేధం తొలగిస్తామంటే ఉపోషంఉంటామని బెదిరించేవాళ్ళు, రావలసినది రాకపోతే అభోజనం ఉండేవాళ్లు రోజురోజుకీ పెరిగిపోతున్నరోజుల్లో ఒక పాముకూడా నిరాహారదీక్ష పూనిందంటే ఎంత ముచ్చటగా ఉంటుంది.

నాగరాజు నిరశనవ్రతంగురించి చదివిన రెండురోజులకే "అబ్బే అలాంటిదేంలేదు పాము ఘనపదార్థాలు తినటంలేదుగాని నీళ్లు ముట్టుకూ తాగుతున్నాది. అది నిరశనవ్రతం కాదు" అంటూ ఖండనవార్త పడ్డాది. ఇది ఎలా నమ్మమంటారు చెప్పండి. రాజకీయ నాయకులు నిరశనవ్రతాలు చేస్తున్నా మంచినీళ్ళుముట్టుకూ తాగుతూ ఉంటారు. నాగరాజు తప్పకుండా నిరాహారదీక్ష పూనినట్టే అని భావిస్తున్నాను. దాని కనీసపు కోర్కెలు తీర్చేస్తే మంచిది.

ఈమాదిరిగా పూర్వంపడ్డ వార్తలని ఖండించుతున్నట్టే మరికొన్ని వార్తలకి ఖండన జరిగితే చాలా సంతోషిస్తాం. కుంభమేలాలో చచ్చిపోయినవాళ్ళు బ్రతికే ఉన్నారు అని వార్తవస్తే ఎంతబాగుంటుంది! కాని అలాంటివి కాక ఎందుకూ పనికిరాని ట్రూమీవార్తలే తప్పని సవరణలు పడుతూ ఉంటాయి. లోకంలో ఇలాగ జరిగే విషయాలు మన నిత్యజీవితంలోకూడా జరిగితే బాగుండును.

మా కిరాణాకొట్టువాడు బాకీ నూరు రూపాయలు దాటిందని ఒక వార్త ప్రకటించాడు. అది వెంటనే తీర్చకపోతే "ఏదో చేయగలను" అని బెదిరింపుకూడా ప్రచురించాడు. ఈ రెండు వార్తలు అబద్ధం అని, అదంతా నాటకం అని తెలియకూడదూ? వట్టిది. అలాంటివి జరుగుతాయా?

*    *    *

మనకి ఒక సామెతఉంది. "పిల్లికి బిచ్చం పెట్టడు" అని. దీని పూర్వగాథ విజ్ఞులకే తెలుసుగాబోలు. ఈ సామెత నిజమో ఏమో కాని "పిల్లికి పింఛను ఇవ్వడం" ఈమధ్య జరిగింది. పంజాబులోని ఒక కోర్టువారు - వినయవిధేయతలతో, స్వామిభక్తితో, విశ్వసనీయంగా ఒక పిల్లి పనిచేస్తూ ముసిలిదయిపోవడంవల్ల దానికి యావజ్జీవ పింఛను మంజూరు చేయడానికి నిశ్చయించారు. పిల్లిని ఆఫీసులో నియోగించడానికీ, కింద ఆఫీసు పై ఆఫీసుకీ, పై ఆఫీసు ఆ పై ఆఫీసుకి ఉత్తరాలు రాయడం మొదలైన తతంగాన్ని చిత్రిస్తూ హేళన చేస్తూ ఒక ప్రఖ్యాత విదేశీ కథ ఉంది. దాన్ని ఒకళ్ళిద్దరు తెనిగించారు కూడా. అటువంటి "రెడ్ టేపు" సంకెళ్ళలో పడ్డాదో లేదో గాని పంజాబు కోర్టులోని పిల్లి రిటైరుఅవడానికి ముందు అదృష్టవంతురాలనాలి. చక్కగా ఉద్యోగం చేసుకొంటూ ఉండేది. "అయమ్ పటాటోపః" అన్న బాధలేకుండా అదాలత్ వారు దానికి పాలుపోస్తూ ఉండేవారు. తీరా రిటైరు

(40వ పేజీ చూడండి)

ఉట్టిపడే సన్నివేశాలు చాలా వున్నాయి. ఇందులో కథానాయకుడు మామూలు సినిమా హీరోలకు విరుద్ధమైనపాత్ర కలవాడు. వట్టి వెర్రిబాగులవాడు; స్నేహితుల మద్దతులేనిదే ఏపనీ స్వతంత్రించి చేయలేనివాడు; గార్దభ స్వరం కలవాడు. వాడికి ప్రత్యర్థిగా, పాడ గలిగినవాడు, కవిత్వం మాట్లాడగలిగినవాడు ఉంటాడు. వీరిద్దరూ నాయికను ప్రేమించ డంతో రసవత్ ఘట్టాలు ఏర్పడతాయి. ముఖ్యంగా ప్లేబాక్ ద్వారా సుబ్బారాయుడు, ప్రేమ్‌కుమార్ సంగీతపు పోటీ జరపడం రసవంతంగా నడిచింది. ముద్దుకృష్ణ గారి సంభాషణలు, రేలంగి నటన ఈ చిత్రానికి చాలా పుష్టి ఇచ్చాయి. ★

## సినిమా వార్తలు

గోకుల్ పిక్చర్సువారి "నిరుపేదలు" మార్చి 2 వ తేదీన, వాహినీవారి "పెద్ద మనుషులు" 11 వ తేదీన, భరణీవారి "చక్రపాణి" 19 వ తేదీన విడుదలవుతాయని తెలుస్తోంది.

* * *

పరిమళా పిక్చర్సువారి "ప్రజారాజ్యం" గాని, జయంతీవారి "బంగారుభూమి" గాని మార్చి 26 న విడుదలచేయడానికి డిస్ట్రిబ్యూటర్లు పూర్ణావారు ఆలోచిస్తున్నారు.

"ప్రజారాజ్యం"లో అంజలీదేవి, పద్మిని, కె. ఆర్. రామస్వామి నటిస్తున్నారు. సంగీత దర్శకుడు కే. కే. సుబ్బరామన్.

"బంగారుభూమి"లో అంజలీదేవి, టి. ఆర్. రామచంద్రన్ నటిస్తున్నారు. ★

## ★ గ్రంథ స్వీకారం ★

### ఆంధ్ర సినీతారలు

పేరు "ఆంధ్ర సినీతారలు" అని పెట్టినా ఈ పుస్తకంలో తెలుగుసినిమా నటీ నటుల ఫొటోలు, సంగ్రహంగా పరిచయవాక్యాలు మాత్రమే కాక ప్రముఖ సినిమా వ్యక్తుల ఎడ్రెసులు, ఇప్పటివరకూ వచ్చిన తెలుగు చిత్రాల జాబితా, ఆంధ్రలో జిల్లాలవారీగా సినిమామందిరాల పేర్లుకూడా ఉన్నాయి. తెలుగుసినిమారంగం మూడు పేజీలలో సమీక్షించబడింది. దీని ప్రచురణకర్త ఎస్. ఎస్. బాల; సంపాదకులు: ఎస్. ఎస్. పతివాడ; వెల 0-8-0; దొరకుచోటు మేనేజరు, లక్ష్మి ప్రెస్, రాజమండ్రి.

### మంజీర

ఇటీవల హైదరాబాదులో జరిగిన తెలంగాణా రచయితలసంఘ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వెలువడిన పత్రిక. వెల 0-8-0. దొరికే చోటు బి - 18 - 1041, గోషామహలు, హైదరాబాదు (దక్కను).

ఈ పత్రికలో వున్న రెండు విభాగాల లోను, మొదటిదానిలో కొన్ని పద్యాలు, వ్యాసాలు, రెండవదానిలో వార్షికోత్సవంలో జరిగిన విశేషాలు, ఉపన్యాసాలు ప్రచురింపబడ్డాయి. "ఉత్కృష్టమైన వాఙ్మయాన్ని సృష్టించడం ఉద్దేశ్యంగా" 'మంజీర' పత్రికను నిర్వహించాలనే ఉద్దేశ్యం ఈ సంఘంవారికి ఉన్నట్లు తెలుస్తున్నది. రాజకీయంగా, సాంస్కృతికంగా చైతన్యవంతమవుతున్న తెలంగాణా ప్రాంతపు సాహిత్యావసరాలు తీరుస్తూ, "మంజీర" ఆంధ్రులకు ఆదరణీయంగా అభివృద్ధిపొందుతుందని ఆశిస్తున్నాము.

### చైనా విప్లవం - మావో

రచయిత చెన్‌పో—టా; అనువాదకుడు డి. ఎన్. ప్రసాద్; వెల 0-12-0; ప్రతులకు—విశాలాంధ్ర ప్రచురణాలయం, బకింగ్‌హాం పేట పోస్టు, విజయవాడ.

చైనీస్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర సంఘ సభ్యుడైన ఈ రచయిత చైనా విప్లవాన్ని సమీక్షిస్తూ, ఆ విప్లవంలో మావో, ఆయన సిద్ధాంతాలు వహించిన ప్రముఖపాత్ర వివరించారు.

### పార్టీ కాంగ్రెసు నిర్ణయాలపై అజయఘోష్ అంత్యోపన్యాసం

వెల 0-4-0; ప్రతులకు విశాలాంధ్ర ప్రచురణాలయం, బకింగ్‌హాం పేట పోస్టు, విజయవాడ.

### మరణ సుంకాల చట్టం

1953 లో ప్యాసైన మరణ సుంకాల చట్టం గూర్చి హైకోర్టు వకీలు పి. సి. రెడ్డి గారు వ్రాసిన వ్యాఖ్య. వెల 0-4-0; పోస్టేజి 0-1-0; ప్రతులకు ప్రభాత పబ్లికేషన్సు, గూడూరు, నెల్లూరు జిల్లా.

### 1954 లో మీ అదృష్టం

రచన సత్యప్రకాష్ జోషి; వెల 0-12-0; ప్రతులకు కిశోర్ పబ్లికేషన్స్, 29, గంగా యమ్మన్ కోయిల్ స్ట్రీటు, రాయపేట, మద్రాసు - 14.

1954 సంవత్సరపు ఫలితాలు వివిధరాసులలో జన్మించినవారికి ఎలా వర్తించేదీ వివరింపబడిన గ్రంథం.

## కుర్చీలో కూనిరాగం

(11-వ పేజీ తరువాయి)

అవవలసిన వయస్సు వచ్చేక దాని ప్రశంసనీయమైన సేవని గుర్తించి కోర్టువారు పింఛనుగూడ మంజూరు చేశారు. ఈ మంజూరుకాగితాలు రెడ్ టేపులో చిక్కుకోకుండాఉంటే - కోర్టువారు అదృష్టవంతులు. లేకపోతే ప్రఖ్యాత విదేశీకథ రాసిన కథకుడిలాంటివాళ్లు అవహేళన చేస్తారు.


* * *

రాజధాని హైకోర్టు ఒకదగ్గరే పెట్టాలి. ఇది రాజాగారి అభిప్రాయం. చాలామంది ఇలాగే భావిస్తారు. అది రైటే - గాని ఆంతర్యం ఆ పెరుగుతున్న వాళ్ళకిలాంటి అభిప్రాయమే ఉండని చెప్పక చెప్పటం లేదా? మహానుభావులు. ఏమైనా చేస్తారు.

* * *

శ్రీనాథుడికి సీసపద్యాలు రాయడం చేతకాదూ? పెద్దన్నదగ్గరనుంచి ప్రతి ఒక్కడూ అబాణీ అనుసరించినవాడేకద! కొసుల పురుషోత్తం అంతకన్నా బాగా రాస్తాడని విశ్వనాథ సత్యనారాయణగారన్నారట. శ్రీనాథుడి సీసాలనుగురించి ఆయన ఆదినుంచీ ఒకేవైఖరి గలవారు. గాని భట్రాజులాగ శ్రీనాథుడు అడిగిన ప్రతివాడికీ అంకితమిచ్చి పద్యాలు చెప్పినందుకు అతడిని వేరొక భట్రాజుతో గారికే చెల్లింది. గుసుగుసీసాలు బావుంటాయని సాహిత్య కిటుకులు తెలిసినవాళ్ళు అంటారుగాని ప్రజలు వప్పుకోవద్దూ! "చింతపం డొకచోట చిరుకందు లొకచోట" అని టకటకా - టకటకా విరిగితేనేగాని సీసపద్యం కాదన్న రోజులొచ్చేశాయి. ఇప్పుడా, ఎప్పట్నించో వచ్చేశాయి. పోనిద్దురూ - ఈ సాహిత్య చర్చలు పద్మవ్యూహంలాంటివి. ఇందులో చిక్కుకొంటే బయటకిరాలేం. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి లాంటి "అనేక యుద్ధముల నారియు తేరిన వృద్ధమూర్తి విశ్వనాథవారిలాంటి అతిరథులు సాహిత్యయుద్ధాలు చేయనియ్యండి. ఏం

విశాఖపట్టణంలో హైకోర్టు పెట్టడంలో కం- [illegible] విశ్వనాథ సత్యనారాయణ [illegible] చూద్దాం; చదువుకొందాం. ★



# కుర్చీలో కూనిరాగం

"ఆరుద్ర"

మన ఎసెంబ్లీ సభ్యులకు నిరుపేదలంటే ఎంత కరుణ. ఆంధ్రలోని బంజరు భూములన్నీ స్వాధీనపర్చుకొని నిరుపేదలకు పంచిపెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఏకగ్రీవంగా, అంటే ఒక్క గొంతుకతో ఇంత చక్కటి నిర్ణయానికి రావడంచూస్తే మన ఎసెంబ్లీ సభ్యులు ఎంత మారిపొయ్యారు, ఎంత సంఘీభావంతో ఉంటున్నారని ముచ్చటేస్తుంది. ఏమంటే ఈ బంజరు భూముల తీర్మానం ఐక్యకంఠంతో రావడానికి ముందు జిల్లాబోర్డుల తీర్మానం స్పీకరుగారి కేస్టింగువోటుతో నెగ్గవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇంత పరస్పర వ్యతిరేకత, ఉత్తర దక్షిణ ధ్రువాల లాంటి విభిన్నాభిప్రాయాలు ప్రభుత్వానికి ప్రతిపక్షానికి ఉన్నప్పుడు హఠాత్తుగా అసెంబ్లీవాళ్ళంతా ఏకగ్రీవంగా ఒక చక్కని విషయంపై తీర్మానం చెయ్యడం ముదావహంకదా. కానీ ఈ ఏకగ్రీవ తీర్మానంలో ఒక లోగుట్టు ఉందని ఎవరో కిట్టనివాళ్ళు వ్రాశారు. జిల్లాబోర్డుల బిల్లుపై కాస్టింగ్ వోటుతో గండం తప్పించుకొన్న ప్రభుత్వం బంజరుభూముల సమస్యమీద తమకు ఓటమి తప్పదని గ్రహించారట! అందుకే ప్రతిపక్షం ప్రతిపాదించిన తీర్మానాన్ని మంత్రివర్గం కూడా ఆమోదించవలసి వచ్చిందట. రామ! రామ! మన మంత్రులకి జయాపజయాలమీద ఖాతరు ఉందిటండీ జీతాల బిల్లులో ఓడిపోయాక మన మంత్రులు ఏమైనా పట్టించుకొన్నారా! జిల్లాబోర్డుల బిల్లులో గెలిచారని విర్రవీగారా! బిల్లులపైనే గెలుపు ఓటమి అనేవాటి విషయంలో ప్రభుత్వానికి ఈరకం వేదాంత దృక్పథం ఉన్నప్పుడు తీర్మానాలతో విజయ పరాజయాలను లెక్కపెడతారా? కిట్టనివాళ్ళు రాసిన మాటలు సుతరాం కిట్టిశే సుమండి. అంతగా ఓడిపోతాం అని భయపడితే హైకోర్టు తీర్మానం విషయంలో ప్రతిపక్షానికి మంత్రివర్గం ఎందుకు తలఒగ్గలేదు ఒక్క వోటుతో 'హైకోరు తీర్మానం సవరణ'లో ఓడిపోయినా ప్రభుత్వం ఏం చేస్తున్నదో తమకు తెలిసినదే. అయినా ఒకందుకు ప్రభుత్వాన్ని మెచ్చుకోవాలి. అప్పుడప్పుడు ఏకగ్రీవతని చూపెట్టడానికి సంసిద్ధత ప్రదర్శిస్తున్నది.

ఇంతకీ ఇవాళ పదవిలో ఉన్నవాళ్లు ఓడిపోతే రేపు మళ్ళా వాళ్ళే అధికారంలోకి రారని ఏం నమ్మకం. ఈజిప్టు సంగతి చూడండి.

*       *       *

నజీబు రాజీనామా,
స్వగృహంలో అతడి నిర్బంధం.
విప్లవసంఘంలో కల్లోలాలు.
నజీబు పదవీస్వీకారం.

నాలుగురోజుల్లో ఓడలు బండ్లయినాయి మళ్లా బండ్లు యధాప్రకారం ఓడలయిపోయినాయి నజీబు పదవీచ్యుతుడు కాగానే అతడిపటాలు, ఫొటోలు అన్నీ లాగి పారేసేరట. పదవీస్వీకారం మళ్లా చెయ్యగానే ఆ పటాలు, ఫొటోలు మళ్ళీ ఎక్కడివక్కడ తగిలించేశారట. ఇలాంటిఫొటోలుమార్చడం ఇండియాలో జరక్కుండా ఉండాలని వెయ్యిదేముళ్లకి మొక్కుకోవాలి. పటాలు ఫొటోలు తీసెయ్యడం, మళ్ళా తగిలించడం చాలా కష్టం. ఒకఫొటో గోడకి తగిలించడానికి మళ్ళా తీసెయ్యడానికి, తిరిగి తగిలించడానికి కలిపి ఒక నిముషం పడుతుందనుకోండి. ముప్పయిమూడుకోట్ల భారతీయులూ ఇలాగ ఫొటో తగిలించి, తీసేసి, మళ్లా తగిలించడానికి ముప్పయిమూడుకోట్ల నిముషాలు వృధా చేస్తారు. అంటే ఏభయి అయిదు లక్షల గంటలు వేస్టు అవుతుంది. అంటే రెండులక్షల ఇరవై తొమ్మిదివేల నూట అరవైఆరురోజుల పదహారుగంటలన్న మాట. అనగా ఏడు వేల ఆరువందల ముప్పయి ఎనిమిదినెలల ఇరవై ఆరురోజుల పదహారు గంటలన్నమాట. దీన్ని సంవత్సరాలలోకి మార్చితే ఆరువందల ముప్పయి ఆరు సంవత్సరాల ఆరునెలల ఇరవైఆరురోజుల పదహారు గంటలన్నమాట. నాయకుడి ఫొటో మార్చడానికి మన దేశం సగటున ఆరుశతాబ్దాలు తీసుకొంటుంది. మన దేశీయులు వస్తుతహాకూడా ఒకసారి నాయకుడు అనుకొన్నాక కొన్ని శతాబ్దాలదాకా అతడి ఆరాధన మానెయ్యరు. దీన్ని మూఢనమ్మకం అంటారో, వారసత్వం అంటారో ఏమంటారో మీరే తేల్చండి.

*       *       *

కుంభమేలా దుర్ఘటన గురించి చర్చిస్తూ శ్రీ మస్నిప్రహాగారూ, శ్రీజిత్ టాంసన్‌గారూ, కట్జూ పంతులు గారూ మూఢనమ్మకాల గురించి ముచ్చటించారు. మహారాజరాజశ్రీ కట్జూ పంతులుగారు కుంభమేలా వేళప్పుడు గంగలో తాము దిగగానే తమకూ తమ తరతరాల పూర్వీకులకూ ఎడతెగని సంబంధం ఏర్పడుతుందన్నారు. వాస్తవమే. అబ్దికాలు పెడుతున్నప్పుడు గాని, వర్ధంతులు జరుపుతున్నప్పుడు గాని పూర్వీకులకూ మనకూ మానసికంగా రాకపోకలు జరుగుతాయి. ఆ విషయం గురించి మనం ఆట్టే తర్కించక్కర్లేదు. కుంభమేలా దుర్ఘటనకి కారణమైన "స్వాములవారి పాదరేణువులని శిరసావహించడం" అనే పిచ్చినమ్మకం ఎంతవరకు అవసరం అనేది కొద్దిగా ఆలోచించవలసిన విషయం.

"కలడు కలండనెడివాడు కలడో లేడో" గాని మన కళ్ళెదుట, కట్టెదుట ప్రత్యక్ష దైవం ఒకడు లేకపోతే ఈ జాతీయ అంతర్జాతీయ ఆర్థిక పారమార్థిక సాంఘిక రాజకీయ క్లిష్ట కష్టపరిస్థితులలో మనశ్శాంతి దొరకడం మహాచెడ్డ చిక్కుపని. అనుకొన్నవి జరగనప్పుడు, జరిగినవి అనుకోకుండా జరిగినప్పుడు, ఆశలు ఫలించనప్పుడు, ఎటుచూచినా చీకటిలాగ విచారం క్రమ్మినప్పుడు, దివ్యజ్యోతిలాగ మనకి వెలుగు చూపించే మహావ్యక్తి అవసరం. అతడి అడుగుజాడల్లో నడిచి ఆనందం, సంపాదించిందికి, అష్టకష్టాలస్థానే అష్ట అయిశ్వర్యాలను పొందడానికి ఆశపడడం సహజమే. గాని దివ్యజ్యోతి అనుకొనే మహావ్యక్తిలో దివ్యత్వం గాని, మహత్వం గాని చాలా సందర్భాలలో చాలా అరుదుగా ఉంటుంది. మునిగిపోతున్నవాడు గడ్డిపోచను పట్టుకొన్నట్టు కష్టాల్లో ఉన్నవాడు గుడ్డిదీపాన్నే దివ్యజ్యోతిగా ఎంచుకొంటాడు

అందుకే సగటున అయిదేసి సంవత్సరాలకి మనకో కొత్త 'బాబా' అవతరిస్తూ ఉంటాడు. కొత్తస్వాములారు విజయం చేస్తూ ఉంటాడు. కొత్త 'ధన్వంతరి' వెలుస్తూ ఉంటాడు. ఆ 'బాబా'గారి నామస్మరణ చేస్తే సర్వపాపాలూ పోతాయి. ఆ స్వాములారి సేవచేస్తే స్వర్గద్వారాలు తెరచుకొంటాయి. ఆ 'ధన్వంతరి' చేతి మూలికలు పుచ్చుకొంటే సకలరోగాలు చటుక్కున మాయమవుతాయి. వేదనలో బాధల్లో దరిద్రంలో విసిగి వేసారిన ప్రజలు ఈరకం మహాపురుషుల సంగతి

వినగానే వాళ్ళని నమ్మేస్తారు. వాళ్ళకి తమ ఆత్మల నమ్మేస్తారు. అక్కడదాకా సహజమే. గాని చిత్రం ఏమిటంటే అలా నమ్మినందువల్లా ఆత్మలను అమ్మినందువల్ల తమ బాధలు తగ్గినట్టూ తమ వ్యాధులు పోయినట్టూకూడా నమ్మకం కలుగుతుంది.

సుమారు ఆరేడేళ్ళ కిందట చెన్నపట్నంలో తంబుచెట్టివీధి మొగదల, హైకోర్టు కెదురుగా చర్చికి కుడిపక్క అరుగుమీద ఒక లావుగా పొట్టిగా ఉండే గడ్డాలవ్యక్తి నిల్చొనేవాడు. మాసిపోయిన జుబ్బా, నలిగిపోయిన లుంగీ - మాటలు కూడా సరిగ్గారావు. ఆ వ్యక్తిచుట్టూ జనం చేరేవారు. ఆ జనంలో అన్నిరకాలవాళ్లూ ఉండేవారు. అన్నిమతాలవారూ ఉండేవారు. ఆ వ్యక్తికి తమ జబ్బులు చెప్పుకొనేవారు. అతడు అది విని, వాళ్ళలో ఒకొక్కణ్ణి తన ముందుకు పిలిచేవాడు. జబ్బగలవాడి కుడిచేతిని ఎత్తమనేవాడు. "అమా అమా" అంటూ రామశబ్దం స్ఫురింపజేస్తూ జబ్బకింది ఏదో నరం పట్టుకొని లాగేవాడు. అలా లాగించుకొనే వాడి ముఖం మీది కండరాలన్నీ ముడుచుకుపోయేవి. కళ్ళు మూసుకుపోయేవి. కన్నీళ్ళు వచ్చేవో లేదో నాకు తెలియదు. ఆ ముఖాలలో బాధ మట్టుకూ కనిపించేది. గాని గడ్డాల వ్యక్తి ఆ నరం లాగిన మరుక్షణంలో మట్టుకు లాగించుకొన్నవాడి పెదిమలమీద చిరునవ్వు కనబడేది. కళ్ళల్లో ఆనందం - ముఖం నిండా తృప్తి వెల్లివిరిసేది. తనకున్న వ్యాధి దీర్ఘమైనా, హ్రస్వమైనా అది వెంటనే పోయిందని నమ్మి - గడ్డాలవ్యక్తికి నమస్కరించి, తృణమో పణమో సమర్పించి వెళ్లిపొయ్యేవాడు. ఈ గడ్డాలవ్యక్తిని తమ తమ ఇళ్ళకు తీసుకెళ్ళడానికి టాక్సీలు తెచ్చేవారు. పెద్దపెద్ద ఖరీదైనకారులు తెచ్చేవారు. తీసుకెళ్ళి ఇళ్ళల్లోఉన్న ఆత్మీయుల రుగ్మతలని బాగుచేయించుకొని, మళ్ళా ఆ వీధి మొగదలలోనే అతణ్ణి కారులో విడిచిపెట్టేవారు.

ఇది రోజూ, నేనూ, నా స్నేహితుడూ చూసేవాళ్ళం. నా స్నేహితుడు ఆ వ్యక్తిని చూసిన మరుక్షణమే "వీడా!" అని పెదవి విరిచాడు. "ఏం" అని అడిగాను. "నేను విజయనగరంలో చదువుకొనేరోజుల్లో వీణ్ణి నాకు తెలుసు. వీడు సగం పిచ్చివాడు. మా అయోధ్యమైదానం దగ్గర తిరుగుతూ ఉండేవాడు. మా ఫుట్‌బాల్ టీములు ఏదేనా ఊరెళ్ళుతూఉంటే వాటితోబాటు వెంట పడేవాడు. మాకు సోడాలు - గట్రా అందించుతూ ఉండేవాడు. కొన్నాళ్లు పోయాక వీడిని వీళ్ళవాళ్లు 'దేముడు' అన్నారు. ఆ దెబ్బతో వీడు దేముడయి పొయ్యాడు" అని నా స్నేహితుడు చెప్పాడు. దేముడి పూర్వకథ ఏమైనాగాని ఆరోజుల్లో చెన్నపట్నంలో కనీసం ఒక వెయ్యిమందికేనా అతడు తాత్కాలికరోగ నివారణ చేశాడు. కొన్ని నెలలపాటు ఒక వెలుగు వెలిగాడు. ఆ తరవాత నాటినుంచి, నేటిదాకా అతడు నాకంట బడలేదు.


ఇలాంటి "దేముళ్ళు" మనకి నెలకొకడు ప్రతీఊళ్లో కనబడతాడు. నెహ్రూగారు సెలవిచ్చినట్టు మనదేశంలో మూఢనమ్మకాలున్నాయి. అందుచేత వీళ్లు ఇలా పుట్టుకొస్తున్నారు అనుకోడం సమంజసమే గాని మూఢనమ్మకాలు లేని ప్రదేశం ఎక్కడుంది. ఏ దేశంలో ఉంది. సభ్యత, నాగరికత పెరిగిన అమెరికాలోనే ఇలాంటి దేము డొకడున్నాడు. కిందటివారం 'బ్లిట్జ్'పత్రిక అతడిగురించి ప్రచురించింది.

అతడు పూర్వాశ్రమంలో తోటమాలి - ప్రస్తుతం దేముడు. నీగ్రోవాడు. వయస్సు ఎంతైనా నలభైఏళ్ళవాడిలాగ ఉంటాడు. లక్షలకొద్దీ తెల్లా నల్లా శిష్యులున్నారు. పాతికేళ్ళాయి దేముడిలాగ ప్రాక్టీసు పెట్టాడు. తనకి కాణీ ఆస్తి లేదంటాడు. అయినా కోటీశ్వరుడు. క్షౌరశాలలు, పానశాలలు, హోటేళ్లు, బడులు, గుడులు, బళ్లు ఎన్నెన్నో ఉన్నాయి. దమ్మిడీ ఇన్‌కమ్‌టాక్సు కట్టడు. న్యూయార్కులో 'న్యూసెన్సు' గా పరిణమించేడని ఉప్పు డోకేసు పెట్టారు. జడ్జీ ఇతణ్ణి శిక్షించాడు. గాని శిక్షవేసిన మూడోరోజున అంతదాకా ఆరోగ్యంగా ఉన్న జడ్జీ చచ్చి ఊరుకొన్నాడు. దేముణ్ణి విడిచి పెట్టారు. విడిచిపెట్టక చస్తారా...? దేముడికి శిష్యవర్గం పెరిగింది. ప్రభ హెచ్చింది. అతడూ, అతడి నిజభక్తులు కలకాలం బ్రతుకుతారట. (అతడి శిష్యవర్గంలో కొంతమంది చచ్చిపోయారుగాని వాళ్ళు తన నిజభక్తులు కారని దేముడన్నాడు) అతని శత్రువులు, విరోధులు చచ్చిపోతారట. అతడి శాపాలు తిరుగులేనివి.

ఈదేముడు అమెరికాలో ఇంతగా వెలగడానికి కారణం ఏమిటి? ఒకటే కిటుకు - తాను దేముణ్ని అని అతడు నమ్మిన తొలిరోజుల్లో శిష్యవర్గానికి అతడు సుష్టుగా తిండిపెట్టాడు. అతడి బోధనలు వినడానికి వచ్చినవాళ్లు ఎంతమందైనా సరే వాళ్ళందరికీ షడ్రసోపేతంగా కడుపునిండా భోజనం పెట్టేవాడు. ఇవ్వగలిగినవారు ఎనిమిది సెంటులు దక్షిణ ఇచ్చేవాళ్ళు - లేనివాళ్లు తిండితిని, బోధ వినిపోయేవారు. శిష్యవర్గం పెరుగుతూ వచ్చేసరికి శ్రీమంతులైన శిష్యులు ఖర్చులు భరించేవారు. దేముడి సంతర్పణలు - అనాథల్ని అన్నార్తులని ఆకర్షించేవి. దేముడి ప్రబోధంకూడా ప్రజ్వరిల్లింది.

స్వాములవార్లు, 'బాబా'లు దేముళ్లు విజయవంతం కావడానికి సంతర్పణలే నిజంగా కారణంకాదు. అనేక విధాల అసంతృప్తితో ప్రజలు బాధపడుతున్నంతకాలం ఆ స్వాములవారు బాబా, దేముడు ఏదో విధంగా తృప్తిని కలిగించితే ప్రజలు నమ్మక మరేం చేస్తారు. ఆరేడేళ్ళ కిందట, ఒరిస్సాలోనే అనుకుంటా, ఎవరో సర్వరోగ నివారణంచేసే మూలికలు పంచిపెడుతున్నాడంటే లక్షలకొద్దీ కుష్టురోగులు, భీకరవ్యాధులతో బాధపడేవాళ్ళు దీర్ఘరోగాలతో వేగుతున్నవాళ్లు ఆ వూరు చేరుకోడం, ఆ మూలికలు బూటకం అని తెలియడం, ఇంతమంది రోగిష్టులు ఒక చోట చేరటంవల్ల కొన్ని అంటువ్యాధులు వ్యాపించడం జరిగింది. దీనికి ఎవరు బాధ్యులు? ఆ మూలికలు ఇచ్చేవాడా? పాపం పుచ్చుకొనేందుకు వచ్చినవాళ్ళా?

డబ్బు ఇచ్చుకోలేనివాళ్లు, డబ్బు ఖర్చుపెట్టినా బాధలు తీరనివాళ్ళు, రోగాలు పోనివాళ్లు ఎవరో ఒకరికాళ్ళు పట్టుకోక తప్పదు. వాళ్ళకి సాములార్లు బాబాలు దేముళ్ళు అందుబాటులో ఉంటారు. ఆ మహనీయుల పాదరేణువుల తలదాల్చినంతమాత్రాన జన్మ తరించుతుందని అణగారిన ఆర్తులు, అమాయకులు భావిస్తారు. ఆత్మశాంతి దొరుకుతుందనుకుంటారు మూఢనమ్మకమే. గాని దీన్ని నెహ్రూలు, టాండన్‌లు కట్జూలు చర్చించినా, మీరూ నేనూ ఖండించినా, సమర్థించినా లాభం లేదు. ఆ మూఢనమ్మకానికి మూలకారణమైన బాధలని తొలగించితేగాని సమస్య పరిష్కారం కాదు ప్రజలు దరిద్రులు కానప్పుడు, వాళ్లకి ఆకలిబాధ లేనప్పుడు, అత్యుత్తమ వైద్యసహాయం ఉచితంగా లభించినప్పుడు అనేకానేక ఇతర బాధలు లేనప్పుడు ఈ మూఢనమ్మకాలకు తావుండదు. ఈతిబాధలు లేని ఇండియాలో అయిదేళ్లకో కొత్తబాబా అవతరించడు, సంవత్సరానికో స్వాములారు దాపురించడు. అటువంటి ఇండియాను నిర్మించడానికి నెహ్రూలు, టాండన్‌లు కట్జూలు యథాశక్తి పాటుపడుతూనే ఉన్నారుగాని ఎన్ని చెంబులతో తోడితే ఈబాధాసరోవరం ఎండుతుంది? చెంబులకి బదులు బొక్కెనలు బాల్చీలు పట్టుకొంటే మట్టుకూ సాధ్యమా. ఏ యంత్రం ఉపయోగిస్తే ఈ దారిద్ర్య తటాకాన్ని ఎండబెట్టి దాన్నినిండా ఆనందజలాలని నింపవచ్చో నెహ్రూగారికి తెలియకనా? తెలుసు. ఆయన వాడటంలేదు. అలా వాడనంతసేపూ కోరికలు తీరని ప్రజలకోనేట్లో మూఢనమ్మకాల దోమలున్నాయని నెహ్రూగారు ఎంత వాపోతే ఏంలాభం? ★



# కుర్చీలో కూనిరాగం

"ఆరుద్ర"

విద్యార్థి జీవితంలో 'కాలేజీ మేగజీన్' వెలువడే రోజు మరువరాని రోజు. తన రచన అందులో అచ్చుపడ్డ విద్యార్థికే కాదు. అది చదవమని, చదివి అభిప్రాయం చెప్పమని తనని పొగడమని ఆ విద్యార్థి ఎవ రెవర్ని కలుసుకొంటాడో వాళ్ళకికూడా ఆరోజు మరువరాని రోజే. మేగజీనులో పడ్డవాళ్ళని చూసి పడనివాళ్ళు మెచ్చుకోవచ్చు, నొచ్చుకోవచ్చు - అప్పుడప్పుడు ఓ రెండు ఇచ్చుకోవచ్చు. ఏమైనా ఆ పడ్డవాడి బాధ పగవాడికైనా వద్దు. అయినా తప్పదు. ఈ తప్పనిసరితిప్పిదం ప్రతి ఒక్క రచయితా చేసి ఉంటాడు.

పది పదిహేనేళ్ళకిందట, భావకవిత్వం ఒంటికి పటించుకొని శ్రీశ్రీ ని నారాయణ బాబుని చదివి 'చెడిపోయిన' కాలేజీ కవులు ఆ పద్ధతులలో రాస్తే ఆ రాసినవి మట్టుకూ కాలేజీ మేగజీనులలో అచ్చువేయించుకోడానికి తటపటాయించుకూ ఉండేవారు. తెలుగు పండితులు ఆధునిక కవిత్వాన్ని అంటరానిదానిగా చూసేవారు. తోటి విద్యార్థులు "వీడొక్తి భావకవిరోయ్!" అని కాలేజీ కవిని భయంతో వింతతో చూసేవారు. గాని ఆధునిక రచన కాలేజీ పత్రికలలోకూడా ఎక్కింది. వ్యావహారిక భాషలో వచన రచన, గేయాలలో కవిత్వం కాలేజీ పత్రికా సంపాదకులు అచ్చు వెయ్యక తప్పలేదు. ఆంధ్రా యూనివర్సిటీ మేగజీన్లలో అబ్బూరి వరదరాజేశ్వరరావ్ రచనలు, అనిసెట్టి సుబ్బారావు సంపాదకత్వంలో గుంటూరు ఏ. సీ. కాలేజి మేగజీను ఆ రోజుల్లో ఒక విప్లవమే!

ముద్దుకృష్ణ 'జ్వాల'లాగ నవ్యసాహిత్య పరిషత్తు వాళ్ళ 'ప్రతిభ'లాగ కాలేజీ మేగజీన్లు ఉండడానికి ప్రయత్నించేవి. అది ప్రయత్నమే తప్ప మరేం కాదు. కళాశాల పత్రికలలో ఒకటి అరా తప్ప తక్కిన రచనలు పేజీలు నింపడానికి వేసేవి, సరిసమానమైన ప్రాతినిధ్యంకోసం సంపాదించేవి అని అందరికీ తెలిసినవిషయమే. అందులో ఫలానా ఫలానా విద్యార్థి థర్డ్ బియస్సి, ఫలానా ఫలానా అమ్మాయి సెకెండియరు అన్న రచయితల పేర్లు తప్ప తక్కినవి అంత ఆనందించవలసిన విషయాలు కావు. కళాశాల పత్రికలలో శిల్పగరిమ ఎంత ఉంటుందో ఎవరికి తెలియదు.

ఈమధ్య ఒక హైస్కూలు పత్రికని చూడడం పడ్డది. అందులో 'శిల్పగరిమ రమణీయంగా ఉంద'ని ఒక ప్రఖ్యాత ఆధునిక కవి ప్రశంసించారు. ఆ కవిగారిమీద నాకు గౌరవం విశేషంగా ఉండడంవల్ల ఆ పత్రికని ఆశతో చదివాను. శిల్పగరిమ మాట దేవుడెరుగును. ఆ పత్రికలోని ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రచురించిన రచనలు చూసి గుండె బాదుకొన్నా. "ఇది నిజం" అని పేరుపెట్టి ఒక విద్యార్థి చదువుకొనే ఆడపిల్లలమీద ఒక పద్యం రాశాడు. అది అచ్చువేశారు. చిత్తగించండి.

> "వీళ్లంతా వచ్చేజనరేషన్ వాళ్లకి మదర్స్
> నిజాని కీళ్ళందరూ కావాలి బ్రదర్స్
> అలా అందర్నీ పిలవడంలో లేదుబ్యూటీ
> పైకిమాత్రమే ఈ మొరాలిటీ!
> కనిపించిన మగవాడల్లా వీళ్ళ లవర్
> వాళ్లమీద ప్రయోగిస్తారు వీళ్ళ అస్త్రాల
> పవర్
> దారినిపోయే మగవాడు తనవంక జూస్తే
> ఫూల్
> మరి క్లాసులో దొంగచూపులు చూడ
> డమే నా రూల్"

ఇలాగ పోయిపోయి ఆడపిల్లల 'మనస్తత్వాన్ని' అతి ధైర్యంగా వర్ణించి వర్ణించి, ఆ కవి అంటాడు

> "ఇటువంటివాళ్లంతా సిస్టర్స్
> మగవాళ్ళంతా వీళ్ల మిస్టర్స్
> ఇటువంటివాళ్లు మాత్రం లేడీస్
> వీళ్లు కేవలం కేడీస్!"

చిత్తగించారా! ఎంత కొత్తదనం! ఎంత ఉద్రేకం. ఎంత శిల్పగరిమ! ఇది పాపం ఒక విద్యార్థి రచన మట్టుకే. అతనికంటె ఘనుడు ఆచంట మల్లన. ఒక ఉపాధ్యాయుడు సదరు హైస్కూలు పత్రికలోనే చాటువులు ప్రచురించారు. అవికూడా. చిత్తగించండి.

> ఓ పథికా! క్షణమ్ముచట నుండుము!
> గ్రంథము విప్పి చూడుమో
> యీ పెను రాజవైద్యుడవో, హెచ్చగు
> జ్యోతిష శాస్త్రవేత్తవో!
> నాపతి యూరలేదు; పయనమ్మయి
> ఎప్పుడు వచ్చు? గ్రుడ్డిదౌ
> నాపతి తల్లి కెట్లు నయనమ్ములు వచ్చు
> నెరుంగ తెల్పుమా!

అంతటితో ఆగలేదు. 'అతిరమణీయమైన' వర్ణనకూడా చేశారు అదికూడా గమనించండి.

> "జలదపథమ్మునన్ వెలయు జక్కని
> బావి ఒకండు దానిక
> వ్వల బలభిన్మణీ ఖచిత
> భర్మవినిర్మిత సౌధమార్గ మ
> వ్వలను ఘటీరలిప్త హివత్సరి
> భోగ్యము శైలయుగ్మ మ
> వ్వల నమృతమ్ము పొంద సులభమ్మట
> వారికి జంద్రసన్నిధిన్"

పద్యాలు ప్రశస్తంగా ఉన్నాయ్‌కదూ. అర్థం ఏ ఒకరిద్దరికోగాని విద్యార్థులలో బోధపడక పోవచ్చు. సహజంగా అర్థం ఏమిటని మాస్టారిని అడుగుతారు. వారు చిరునవ్వు నవ్వి రహస్యంగా అర్థం చెప్తారు. అలా అర్థం తెలుసుకొన్న విద్యార్థి ఆ పద్యాలకి తాను తెలుసుకొన్న అర్థాలని తదితర విద్యార్థులకి సగర్వంగా తెలియచేస్తాడు. 'భాషాప్రవీణ' 'విద్యాప్రవీణ' అయిన ప్రధానాంధ్రపండితుడు రచించిన చాటువులు (హోలుడికి అమాం బాపతు సంస్కృతశ్లోకాలకి మక్కీకిమక్కీ తర్జుమా అయితేనేం ఆ సంగతి బయట పెట్టక పోయినా) అత్యంత 'రమణీయం' గాఉన్నాయని న్యూలు న్యూలంతా తెలుస్తుంది. (సదరు హైస్కూల్లో ఆడపిల్లలు కూడా చదువుకొంటున్నారు పాపం. "స్త్రీకి స్వాతంత్ర్యమువచ్చె నేని ..స్త్రీ తనధర్మము నుండి చెడుటయేగాక మహాశామండలికి గళంకము దెచ్చును" అనే సదభిప్రాయాలు కూడా కలిగినవాళ్ళు! ఈ ఉన్నత పాఠశాలలో కవిత్వం,'రసం' ఎంత ఉన్నతంగా ఉన్నాయో చూశాక ఎవరుమట్టుకూ గుండెలు బాదుకోరు!

* * *

కాంగ్రెసు కుటుంబాలలో పుట్టి ఖద్దరు పొత్తిళ్ళల్లో పెరిగిన ఈ తెలంగాణకూడా చేనేతపరిశ్రమపట్ల అదోరకం అభిప్రాయం కలిగి ఉండడం దోషం కాదేమో అని ఇప్పుడు జరిగిన "చేనేత సప్తాహం"వల్ల నా అనుమానాలు మరింత గట్టిపడ్డాయి. నా మట్టుకు నేను పుట్టింది కాంగ్రెసువాదుల కుటుంబంలో. కట్టింది చాలా కాలంవరకు ఖద్దరే. నాకు బాగా జ్ఞానం వచ్చేవరకు మా ఇంట్లో రాట్నాలు ఆడుతూ ఉండేవి. రెండు పుష్కరాలకిందట విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో, వచ్చీరాని వయస్సులో నేనుకూడా షాపుల దగ్గర పికెటింగ్ చేయడం నాకు జ్ఞాపకంఉంది.

మా ఊళ్లో విదేశీ సరుకులమ్మే పేరుపడ్డ షాపుముందు - ఖద్దరు నిక్కరు, ఖద్దరు లాల్చీ గాంధీటోపీ ధరించి నాకన్నా రెండింతలు పొడుగున్న జెండా పట్టుకొని పికెట్ చేస్తున్నా. "బాబూ విదేశీ వస్తువులు కొనకండి: స్వదేశీ వస్తువులు కొనండి" అని అరుస్తున్నా. పాపం కుర్రాడు అలిసిపోతున్నాడని మావాళ్లందర్నీ బాగా ఎరిగిన షాపువాడు ఒక స్టూలుబల్ల నాకోసం వేయించాడు. దానిమీద కూర్చొని, ఎవరేనా షాపులోకి వెళుతున్నప్పుడు లేచి నిలబడి పికెట్ చేయడం ఇంకా జ్ఞాపకం ఉంది. పెద్దలు పలికిన చిలకపలుకులు పలుకుతున్నా. ఎవరో నామాటలు విని నవ్వి ముచ్చటపడి షాపులోకెళ్ళి చక్కటి చాక్లెట్లు కొని నాచేత తినిపించారు. ఎంత ఉత్సాహంతో పికెట్ చేశానో, అంత ఉత్సాహంతో అవి తిన్నాను. షాపువాడూ, చాక్లెట్లు కొని తినిపించినవాడూ విరగబడి నవ్వారు. అప్పటికి గాని నేను పాపం చేసినట్టు నాకు తెలియలేదు. షాపులోకి ఎవరో తెల్లదొర వెళుతూఉంటే అతడికి స్వదేశీ వస్తువులేగాని, విదేశీ వస్తువులు కొనవద్దని హితోపదేశం చేశాను. అతడు నా మాటలకి మెచ్చుకొని నేను చెప్పినట్టే తన స్వదేశీ వస్తువైన చాక్లెట్లుకొని నాచేత తినిపించాడు. శుద్ధ ఖద్దర్ కట్టుకొని సీమలో తయారయిన తినుబండారాన్ని తిన్నందుకు గాంధీమహాత్ముడు శపించిపోతాడేమో అని, నా కాళ్ళకింద భూమి పగిలిపోతుందేమో అని ఇప్పటికీ నాకు కలలో భయంగానే ఉంటున్నది.

అలాంటి సంప్రదాయంలో అసంఖ్యాకులు నాలాగే పెరిగిఉంటారు. అయినా అందరం ఈరోజుల్లో ఖద్దరుని ఆదరించుతున్నాం అనుకోడం ఆత్మవంచన. విదేశీ వస్తువులని బహిష్కరించిన మహా మహా వాళ్ళే విదేశీ వేషభాషలు ఆచరించక తప్పలేదు. ఖద్దరు పెంట్లాం, ఖద్దరు షర్టు ఖద్దరు కోటూ వేసుకొని కచేరీలకి వెళ్లక తప్పలేదు. ఇలాంటి జాతీయాభిమానులని చూశాక ఖద్దరుమీద ఉన్న గౌరవం కాస్తా పోయింది. పరాయి ప్రభుత్వంతో పోరాటం సాగించుతున్నప్పుడు ఖద్దరు అవసరం ఎంతైనా కావలసివచ్చింది. కాంగ్రెసు ప్రభుత్వాలు గద్దెలమీద కెక్కినప్పుడు పారిశ్రామికంగా దేశం వెనకపడినప్పుడు మిల్లునూలుతో నేసిన చేనేత బట్టలని ప్రోత్సహించడం బాగానే ఉంది. గాని ఇవాళ చేనేతబట్టలనే కట్టండనడం వాచీని వెనక్కి తిప్పడమే.

చాలామంది నిరుద్యోగు. లయిపోతారని భయపడి, చేనేత పరిశ్రమని ప్రోత్సహించడం చేతకాక సాహసంలేక చేసేపని. సహకార పద్ధతిమీద మొన్న మొన్న మరకదుళ్ళ మిల్లు స్థాపించినట్టు సహకార పద్ధతిమీద మరనేత మిల్లులుకూడా జిల్లాకొకటి ఉండేరోజులొస్తే బాగుండును. యంత్రయుగంవల్ల చేతిపనులు దెబ్బతింటాయని పూర్వంలాగే అన్నీ ఉండాలనడం మంచి లక్షణంకాదు. దేశం పారిశ్రామికం అయితే పనులు పోయేవాళ్ళకి వేరే పనులు కల్పించడం సర్కారువారికి చేతనైనప్పుడు వేరే భయాలు ఉండవు.

చేతినూలు, చేనేతపై తయారయిన వస్త్రాలు మన గొంతుకలలో పచ్చివెలక్కాయల్లాగున్నాయి. నెహ్రూ గారు దేశం పారిశ్రామికం కావాలనే వారే. ఆయన యంత్రయుగాన్ని వాంఛించే వ్యక్తే - అయితే కాంగ్రెసు సంప్రదాయంవల్ల చేనేతని ఆయన ప్రోత్సహించక తప్పదు. "చేనేత వారా"నికి సందేశమిస్తూ "చేనేత వస్త్రాల తయ్యారీలో అనుసరించే విధానాలను మార్పు చేయడానికి కూడా నిరంతరం ప్రయత్నాలు జరగాలి" అని ఆయన స్ఫుటంగా తన ఉద్దేశాలు చెప్పారు. ప్రస్తుత అసహాయ పరిస్థితుల్లో చేనేతని ప్రోత్సహించాలేమోగాని, కలకాలం ఇలాగే ఉండాలనడం అవివేకం.

* * *

"జీవకారుణ్యం" మనిషన్న ప్రతివాడిలోనూ ఉంటుంది. నోరులేని జంతువుల్ని పనిపెట్టుకొని హింసించడం ఎవరూ సహించరు. గాని మానవులకి లేని స్వేచ్ఛని జంతువులకి ఇవ్వమనడంలో 'కారుణ్యం' మరీ జాస్తీఅయి తీరుతుంది. శ్రీమతి రుక్మిణీదేవి అరండేలు కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో ఒక బిల్లు ప్రవేశపెట్టి సభవారిఅనుమతిమీద అది ఉపసంహరించుకొన్నారు. ఆ బిల్లును ప్రతిపాదిస్తూ ఆమెచేసిన ప్రసంగంలో జీవకారుణ్యం మరీ మరీగా ఉంది.

జంతు ప్రదర్శనశాలలోనూ, సర్కస్‌లోనూ జంతువులని హింసించకూడదట! పులినోట్లో తలపెట్టేవాడూ, రింగ్ మాస్టరూ, జీవకారుణ్యం కలిగి, జంతువులని హింసించలేదే అనుకోండి. ఆ పులికి జీవకారుణ్యం ఉంటుందా? ఏమో చెప్పలేం. సర్కస్‌లో జంతువులని హింసించకూడదని శాసించడం దాకానే వెళ్లేరు. అసలు సర్కసులనే నిషేధించాలని ఒక శాసనం తయారు చెయ్యలేదు. అందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.

రుక్మిణీదేవి ఈ బిల్లుని తీసుకొస్తారని తెలియగానే కజిన్సు "అహింస ఒకకళ" అని ఇంగ్లీషులో ఒక వ్యాసం రాశారు. చతుష్షష్టికళలు అంటే అరవైనాలుగుకళలనే పూర్వం చదువుకొన్నా. అందులో అహింస అనేది లేదు. మహావిష్ణువు పదకొండో అవతారం ఎత్తగాలేంది అరవై అయిదో కళకూడా ఉండకూడదా. ఉన్నా అదెలాగు కళో, నాకేం అర్థంకాలేదు. గాని యథాశక్తి జీవకారుణ్యం ప్రదర్శించడం కళాకారుల విధి అని సాధ్యమైనంతవరకూ అలా ప్రదర్శించుతూ నేఉన్నా. మా వీథిలో ఊరకుక్కలు (వాటిని మునిసిపాలిటీవాళ్లు తగలెయ్య!) రాత్రిపూట బృందగానం చేస్తున్నప్పుడుమట్టుకూ జీవకారుణ్యం ఎగిరిపోతూఉంటుంది. కుక్కలబండీవాళ్లు వీటిని పట్టుకుపోతే బాగుండుననిపిస్తుంది. మొరిగే కుక్కలు కరవవు నిజమేగాని అవి నిద్రమట్టుకూ చెడగొడతాయి. వాటిపట్ల జీవకారుణ్యం ఎలా చూపెట్టాలో రుక్మిణీ దేవిగారే చెప్పాలి. అడయారు కళాక్షేత్రం చుట్టుపక్కల ఈ బాధలేదు. అందుచేత ఇలా ఎన్నైనా చెప్తారు.

* * *

మహాత్ముడి 'ఆత్మకథ' చదువుతున్నప్పుడు అప్పుడప్పుడు ఒళ్ళు జలదరిస్తుంది. ఆయన చిన్నప్పుడు స్నేహితులతో కలసి మేకమాంసం తినడం, తిన్నాక ఆ రాత్రి కడుపులో ఆ మేక అరవడం ఆ తరవాత నుంచి ఆయన మారిపోవడం ఘట్టం చదువుతున్నప్పుడు మనస్సు వికలమవుతుంది. ఇటువంటి సంఘటనే ఒకటి నెహ్రూగారు మొన్న స్టేట్ కౌన్సిలులో చెప్పారు. 36 సంవత్సరాల కిందట నెహ్రూగారు వేటకి వెళ్లారట. అప్పుడొక ఎలుగుబంటిని చంపారట. ఆ తరవాత వేటమీద మోజు నశించి ఒక్క జంతువునికూడా చంపలేదట. స్వానుభవం అయిన ప్రతిఒక్కడూ జీవకారుణ్యం ఎందుకు చూపడు? భారతదేశంలో జంతుహింస నివారణకి బిల్లుమట్టుకు అనవసరం.

* * *

హరిజనులు దేవాలయంలో ప్రవేశించవచ్చు అని శాసనం చేశారు. ఏం జరిగింది. శాసనం కాగితాలలోనూ ఆశయం మనస్సులోనూ ఉండిపోయింది. అణుమాత్రం ప్రయోజనం లేకపోతున్నది. హరిజనులు దేవాలయ ప్రవేశం చేయబోతూఉంటే ఛాందసులు సత్యాగ్రహం చేయడం, ఆలయ ప్రాంగణంలో అత్యాచారాలు చేయడం జరుగుతూంది. నిరాశతో హరిజనులు వెనక్కి తిరిగిపోతున్నారు. ఒకవేళ చేస్తే జంతుహింస నివారణకోసం చేసే శాసనం కూడా ఇలాగే అవుతుంది. ఉబలాటం కొద్దీ శాసనాలు చెయ్యగానే సరికాదు. ఛాందసులకి కోపంవచ్చినా, వాళ్లని మెచ్చుకొని ఆరాధించేవాళ్లకి తాపంవచ్చినా ఖరాఖండీగా కచ్చితంగా వరసపెట్టి శాసనాన్ని అమలు జరపడంలోనే ప్రజ్ఞ ఉంటుంది. అలా చే. ధైర్యం మనవాళ్లకిలేదు. ★

# ముష్టిలో మోహనరాగం

"ఆరుద్ర"

ఏ మాత్రం శుభ్రమైన తెల్ల బట్టలైనా కట్టుకొని వీధు దారంట పోతూ ఉంటే చెన్నపట్నంలో గోడలు కూడా చేతులు చాచి బిచ్చమడుగుతాయి.

## విషయానుక్రమణిక

ముఖచిత్రం:— "వల్లెపడుచు" లో జి. వరలక్ష్మి.


| | |
|---|---|
| ముష్టిలో మోహనరాగం— | 2 |
| రెండో పెళ్లి— | 5 |
| మూడు మేడలు–నాలుగు కొట్లు— | 9 |
| తోటేలుబాలుడు— | 10 |
| సంబంధం–అనుబంధం— | 12 |
| దర్యాప్తు— | 28 |
| కొంటెకిష్టయ్య— | 30 |
| రాజుగారివి గాడిదచెవులు— | 31 |
| ఎందుకు...ఏమిటి!— | 34 |
| కర్పూర ద్వీపయాత్ర— | 36 |
| వంటయింట్లో వస్తుసంగ్రహం— | 43 |
| సినిమా— | 44 |
| రూపగానములు– దేవాలోకన్యలు— | 53 |
| విజ్ఞానవీథులు— | 55 |


## కాలక్షేపం

కారణాంతరాలవల్ల ఈ వారం కాలక్షేపం ప్రచురించలేకపోతున్నందుకు విచారిస్తున్నాం. పై వారంనుంచి యథాప్రకారం ప్రచురించబడుతుంది.

ముష్టివాళ్ళంటే దయాదాక్షిణ్యాలున్న వాళ్లు చెన్నపట్నానికి వొచ్చిన నాలుగు రోజుల్లో పాషాణ హృదయులుగా మారి పోవడానికి ఆస్కారముంది. విసిగెత్తించి వేధించి, ప్రాణాలు తోడేసి వాణ్ణి చంపడమో, మనం చచ్చిపోడమో జరిగేటంత తీవ్రస్థాయికి మనందరిని చెన్నపట్నంలోని బిచ్చగాళ్లు తరుముతారు. వాళ్ళని మనం గాని, పోలీసులుగాని ఎంత తరిమినా లాభం లేదు. "వదిలాడురా బాబూ!" అని బరువు తగ్గిన హృదయంతో నిట్టూర్చి తృప్తితో కన్నుమూసి తెరచేలోగా మళ్లా ఇంకో బిచ్చగాడు ప్రత్యక్షమవుతాడు.

కుంటివాళ్ళు, గుడ్డివాళ్లు, మరుగుజ్జులు మొదలైన వాళ్లు ముష్టెత్తుకోడం బాగానే ఉంది. ఈ దుర్భర దౌర్భాగ్య నగరంలో బిచ్చమెత్తడానికి ఒక రైమూ రీజను ఉన్నట్టు లేదు. కుర్రాడు ఎక్సర్సైజు పుస్తకం కొనుక్కోవాలని చెయ్యి చాపుతాడు. కొనుక్కోమని మీ రివాళ ఒక అణా ఇచ్చేరనుకోండి. మళ్లా ఎల్లుండి ఆ కుర్రాడే ఆ ఎక్సరసైజు పుస్తకమే కొనాలని ఆ చెయ్యే చాపుతాడు. సంవత్సరంలో మూడువందల అరవై అయిదు రోజులు పాపం ఆ కుర్రాడు ఎక్సరసైజు పుస్తకం ఎలా కొనడమా అన్న తేలని సమస్యలో పడతాడు. నిజమే ఎవరేనా ఆ పుస్తకం కొనుక్కోమని డబ్బు ఇచ్చినా ఆ డబ్బు అందుకోసం వినియోగించక పోవడం చేత ఆ సమస్య తేలని సమస్యగానే ఉండిపోతుంది.

రోడ్డు వార మండుటెండలో పాపం ఇంకో క్షణానికి ఆ రోడ్డువారే కనేస్తుందా అన్న జాలి పుట్టించే స్థితిలో ఒక పూర్ణ గర్భిణి ఉంటుంది. ఆ చూలాలిని ఊహించి ఇంకో అనపాయురాలైన ఆమె పురిటి ఖర్చుల కోసం – బిచ్చమెత్తుతుంది. మన హృదయం కరిగి ధర్మం చేస్తాం. అదృశ్యం చూడలేక వెళ్ళిపోతాం. గాని అమర్నాడూ ఆ తరవాత కొన్ని వారాలదాకా పాపం ఆ చూలాలు అలాగే ఉంటుంది. ఆ పేటలో కాకపోవచ్చు రోజుకోపేటలో అయితే నేం ఎన్ని నెలలయినా కనవలసిన అవసరం లేని చూలాలు అదృష్టవంతురాలు.

బిచ్చమెత్తడానికి పూర్వం ఏదో ఒక పాట వచ్చివుండడం అవసరం. విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'రైల్లో బిచ్చగాడి మాదిరిగా కనీసం దాశరథీ శతకంలోని ఒక పద్యమేనా రావడం అవసరం. ఎప్పుడూ అదే పాడినా ఇబ్బంది లేదు. ఏదో ఒక పాట మాదిరీ ధ్వనిచేస్తూ బిచ్చమెత్తడం ముష్టివాళ్ల సంప్రదాయం.

చెన్నపట్నంలోని చాలామంది బిచ్చగాళ్ళు ఈ రోజుల్లో పాటలు పాడడం మానేస్తున్నారు. పాడకపోవడమే బాగుంది, లేకపోతే అది వినలేక బిచ్చం వేయవలసి వచ్చేది.

సినిమా పాటలూ, తత్వాలూ, పల్లె పదాలు బిచ్చగాళ్ల నోళ్లలో పడి అప్పుడప్పుడు అనుకోని మెరుగులు తిరుగుతూ ఉంటాయి. రైళ్ళలో ఇది మీరు గుర్తించే ఉంటారు. రాజకపూరు బూట్ పాలిష్ అనే చిత్రంలో రైళ్లలో బిచ్చగాళ్ళకి ఒక పంజాబీ పాట పెట్టాడు. అది దివ్యంగా ఉంది. చాలా విషయాల్లో పంజాబీలు తెలుగువాళ్ళు ఒకే మాదిరిగా ఉంటారు. ఆ పంజాబీ పాటకి వచనంలో యథాశక్తి తర్జుమా చేశా. వినండి: అది తిట్టుకవిత్వంలో చాలా గొప్పది.

"కాణీ పడేయ్ దాతా
కాణీ పడేయ్."

ఇంతదాకా బాగానే ఉంది. ఆ దాత కాణీ పడెయ్యడు. బిచ్చగాడు కాణీ పడెయ్యకపోతే ఆ దాతకి జరిగే కష్టాలు మొదలెడతాడు., "కాణీ పడెయ్యకపోతే, మీ యింట్లో దొంగలు పడతారు. దొంగలు పడితే మీరు పోలీసుస్టేషను కెళ్లాలి. వెళితే అక్కడ థానేదార్ మిమ్మల్ని చిక్కుల్లో పెడతాడు. మీ కాళ్లు అరిగిపోతాయి. పోయిన వస్తువులు మీకు దొరకవు. ఈ బాధలన్నీ పడడం ఎందుకు నాకు కాణీ పడేయ్ దాతా, కాణీ పడేయ్" ఇది ముష్టివాడి నయబోధ. ఇది ఆ దాత వినిపించుకోకపోతే ముష్టివాడు దాతకి రాబోయే మరో కష్టం చెప్తాడు.

"కాణీ పడెయ్యకపోతే మీ ముసిల్ది చస్తుంది. మీ ముసిల్ది చస్తే అస్తికలు పట్టుకొని మీరు ప్రయాగ వెళ్ళాలి. ఎంతో డబ్బు ఖర్చవుతుంది. నానాకష్టాలు పడాలి. ఆ బాధలు పడడం ఎందుకూ నాకు కాణీ పడేయ్ దాతా – కాణీ పడేయ్" ఇలాంటి చరణాలు చాలా ఉన్నాయి.

మన అభ్యుదయ కవులు చాలామంది బిచ్చగాళ్ల పాటలు రాశారు. గాని ఏదీ ఇలాంటి పాట! ఇలా రాయడం పంజాబీ

వాడికే చెల్లింది. సభ్యంగా గానైనా అసభ్యంగానైనా గంటకుపైగా తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టడంలో పంజాబీలు తెలుగువాళ్ళు దొందుకు దొందే. గాని బిచ్చగాళ్ల పాటల్లో మట్టుకూ పంజాబీలదే పైచెయ్యి.

ఇప్పుడు నేను మనవిచేసిన పాటలో మాదిరిగా తిట్లు తిట్టడంలో చెన్నపట్నం బిచ్చగాళ్లు పండిపొయ్యారు అయితే పాటల్లో తిట్టరు. చాలా ఉత్తేజవంతంగా ఉద్రేకపూరితంగా నల్లచొక్కా భాషలో గొప్పవాళ్ళ దౌర్జన్యాలు పేదవాళ్ళ కష్టాలు వివరించి తమిళ చిత్రాలలోని సంభాషణల ధోరణిలో చెవి చిల్లుపడేటట్టు తిడతారు.

చెన్నపట్నంలోని అసంఖ్యాకుల మాదిరిగా నేనూ బిచ్చగాళ్ల బాధితుణ్ణి. వీధిలో అడుగుపెట్టడానికి భయపడుతూ ఉంటాను–గాని రెండురోజుల కిందట పొద్దున్నే పేపరు విప్పేసరికి నాపాలిటి పెన్నిధిలాంటి వార్త కనబడ్డాది. మేల్‌పాక్కం అనే శివారులో పోలీసువాళ్ళు నగరంలోని బిచ్చగాళ్ల సంరక్షణా శిబిరం స్థాపించారు. దానికి ముఖ్యమంత్రి రాజగోపాలాచారి గారు ప్రారంభోత్సవం చేశారు. నగరంలోని బిచ్చగాళ్ళని పట్టుకొని దానిలో పెడతారట. అప్పుడే కొంతమందిని పెట్టారట.

ఈ వార చదవగానే చాలా సంతోషించాను – "హమ్మయ్య రోడ్డుమీద కాలు పెట్టేసరికల్లా వేధించి ప్రాణాలు తోడే బిచ్చగాళ్ళ బాధ తప్పింది కదా" అని. చాలా సంతోషించాను. ఆఫీసుకుపోతూ బస్సుకోసం నిలబడి పేపరు చాలా ఆనందంగా చదువుతున్నా. రాజగోపాలాచారిగారి ఉపన్యాసం ఆపురావురుమని పఠిస్తున్నా. బిచ్చగాళ్ళబాధ తప్పించినందుకు పోలీసువాళ్ళకి వెయ్యి దండాలు పెట్టాను. గాని "అప్పా ఒరు కాలణా కుడప్పా" అని ముష్టివాడు చెయ్యిచాపాడు. ముచ్చెమటలుపోసి మూడు చెరువుల నీళ్ళు తాగేందుకు అక్కడనుంచి పారిపొయ్యాను.

*   *   *

సదరు బిచ్చగాళ్ల సంరక్షణ శిబిరం "ప్రారంభోత్సవం సందర్భంలో దేవసహాయంగారు కొన్ని అంకెలిచ్చారు. చెన్నపట్నంలో సుమారు ఏడు వేల అయిదువందల మంది బిచ్చగాళ్ళున్నారట! అందులో రెండు వేలమంది కుర్ర బిచ్చగాళ్ళట... ఈ ఏడు వేలమందిబిచ్చగాళ్ళలో ఎనభైముగ్గుర్ని పట్టి మార్చి ఒకటవ తారీఖునుంచి ఆ శిబిరం ప్రారంభించారట. ప్రస్తుతం శిబిరంలోని బిచ్చగాళ్ళ సంఖ్య పెరిగింది. రెండువందల ఇరవైతొమ్మిదిమంది మగాళ్ళు, ఎనభై నలుగురు ఆడవాళ్ళు ఇరవైమంది పిల్లవాళ్ళూ అందులో ఉన్నారు. అంటే మూడు వందల ముప్ఫయిముగ్గురికే ప్రస్తుతం ఆశ్రయం దొరికిందన్నమాట. పోతే సుమారు ఏడువేల నూటరవై ఏడుమంది బిచ్చగాళ్ళింకా పట్నంలో విచ్చలవిడిగా బిచ్చమెత్తుకొంటున్నారు. బాగానే ఉంది. గుడ్డిలో మెల్ల. కొంతమందైనా తగ్గారు. అదికూడా సంతోషించదగ్గ విషయమే!

*   *   *

"ఈ రైళ్ళు వేదాల్లో ఉన్నాయివ!" అన్నాడు అగ్నిహోత్రావధాను నిజమే. అనిపిస్తుంది. ఈ రోజుల్లో ఏ సరికొత్త విడ్డూరం గురించిచదివినా, అలాంటివిడ్డూరం మన పురాణాల్లో కనబడుతూనే ఉంటుంది. కావలిస్తే చూడండి.

ఈమధ్య అతి చక్కని విడ్డూరం గురించి చదివాం. ముప్ఫయి మూడేళ్లవాడూ ఇద్దరు పిల్లలతండ్రీ అయిన ఒక మాజీ విమానం పైలెట్ మాజీ మొగాడిగా మారి అందమైన సుందరిగా తయారవడం జరిగింది ఈ వార్త అగ్నిహోత్రావధాన్లులాంటివాళ్లకి చదివి వినిపించాం అనుకోండి. మన పురాణాలు

# రోడ్డుచరిత్ర

## కొనకళ్ల వెంకటరత్నం

లాగరా అయిలెస్స
లాగరా...
రోడ్డురోలరు ముందడుగై
సాగరా...
నడినెత్తిన సూరేడూ
నకనకలాడే డొక్కలు
కంకర రస్తాలో నగ
మింకా మిగిలున్నదిరా
లాగరా...
రోల్సురోయి మోటార్ల షి
కార్లకు కుదుపొచ్చిందట
పూలపానుపల్లె తోవ
పొడుగున మలసాలంట
లాగరా...
గోదావరి వరదలొచ్చి
గోలగున్నదంట యీడ
కట్టసుకాలింటానికి
గవినే రొస్తాడంట
లాగరా...
మండే ఆకలికడుపుల
మాయదారి బతుకుకంటె
బరువా యింతోటిపెద్ద
బండరాయి మామయ్యా
లాగరా...

అప్పులున్న సాహుకారు
లాబాలను మోసిందుకు
బారీ యాపారములో
లారీ కొన్నాడంట
లాగరా...
మర్రిచెట్టు పూడనీడ
మడిసిపురుగులేని కాడ
సనుబాలకు కక్కటిల్లి
నంతో డేడుస్తుండడు
లాగరా...
...............
మెతుకు విదిపితేనే తను
బతుకుపోయె ననుకొంటరు
మాదాకవళం మల్లన
మడిసిపోయిండీ పక్కనె
లాగరా...
...............
పొలము పుట్ట అమ్ముకొని
పొట్టసేత బట్టుకొని
వలస పోయిండీ దారినె
పంటకాపు పట్నానికి
లాగరా...

# త్వరలో కొత్త సీరియల్

# "మంచీ - చెడూ"

## రచన: శ్రీ "శారద"

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు త్వరలోనే ఒక కొత్త సీరియల్ నవలను అందించగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము.

ఆర్థిక స్తోమతు లోపమైనప్పుడు సమాజంలో జీవనం ఎంత యాతనామయమౌతుందో, ముఖ్యంగా స్త్రీలకు అట్టి పరిస్థితులలో ఎంతటి ఘోరపతనం సంభవిస్తుందో ఈ చిన్న నవల యధాతధంగా చిత్రిస్తుంది. అయితే అమానుషమైన ఈ దుఃఖాంధకారంలో సహజ మానవ సౌశీల్యం, ప్రేమార్ద్రతలు వెలుగుదారులు చూపగలవు. నేటి సామాజిక జీవనాన్ని వాస్తవికంగా చిత్రించడానికి రచయిత శ్రీ 'శారద'గారు చేసిన కృషి పాఠకులలో ఔత్సుక్యం రేకెత్తించగలదని ఆశిస్తున్నాము - సంపాదకుడు.

చూసుకోమంటాడు.

అర్జునుడు బృహన్నలగా మారాడు. ఆడారితనమే గాని ఆడతనం కాదనిమనం దీన్ని నిరాకరించవచ్చుగాని నారదుడు ఆడదానిగామారి పిల్లల్ని కూడా కన్నాడు. ఇంకా పురాణగాథల్ని గాలిస్తే ఇలాంటి కేసులు కనబడతాయి

పురాణాల గొడవ అలా ఉంచండిగాని ఈరోజుల్లో జరుగుతున్న ఈ లింగభేద పరిణామాలు ముచ్చటగా ఉన్నాయి. ఆమధ్య ఒకటిరెండు ఇలాంటి కేసులగురించిచదివాం. ఏదో అనుకొన్నాం, పరిపోయింది గాని మాజీ పైలట్ కేసు వింతగా ఉంది. ఇద్దరు పిల్లల తండ్రి ఆడదానిగా మారడం వైద్యచరిత్రలోనే కొత్తట! ఇది నన్నేం బాధించడంలేదు. నాకు వచ్చిన అనుమానమల్లా ఆ పిల్లల మాజీ మగాణ్ణి నాన్నా అంటారా అమ్మా అంటారా లేకపోతే పిన్నీ అని పిలుస్తారా అన్నదే సమస్య. ఏమైనా వాళ్ళు ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డలు.

* * *

ఇంతకన్నా విడ్డూరం మనదేశంలోనే మరొకటి జరిగింది. ఒక యువకుడి కడుపులో ఆ యువకుడంత వయస్సుగల కవ ఉండటం. దాన్ని చూడడానికి తండోపతండాలుగా ప్రజలు వెళుతున్నారట.


ఇటువంటి విడ్డూరాలు రోజుకొకటి పేపర్లలో పడుతున్నాయి. ఇవన్ని చూసి "కలికాలం కలికాలం" అని కొంతమంది అబ్బురపడినా పెదవి విరచవచ్చు. అయినా అగ్నిహోత్రావధాన్లు ఇవి పూర్వంనుండీ ఉన్నవే అంటారు.

* * *

ఈ విడ్డూరాలను మించిన విడ్డూరాలు రాజకీయాలలో కనబడుతున్నాయి. ప్రజాసోషలిస్టుల చర్యలు వెయ్యిమంది మగాళ్లు ఆడవాళ్లగామారిన వార్తకన్నా - వింతగా ఉంటాయి.

తిరుకొచ్చిలో ఇటీవల జరిగిన ఎన్నికల ముందు కాంగ్రెసుని ఓడించాలనే ఏకైక మహదాశయంతో ప్రసోషలిస్టులు వామపక్ష సమాఖ్యవాళ్లతో చేతులు కలిపారు. ఇలా చేతులు కలపడంవల్ల పూర్వం శాసనసభలో వాళ్లకి పన్నెండు సీట్లే ఉంటే, అవి కాస్తా పందొమ్మిది సీట్లుగా పెరిగాయి. బలం సగానికి సగం ఎక్కువవడం వల్లనేమో తెలియదుగాని వాళ్ళ వాదనలలోని విడ్డూరంకూడా ఆ నిష్పత్తిలోనే పెరిగింది. శాసనసభలో వాళ్ల సంఖ్య పంధొమ్మిదే ఉన్నా వాళ్లనే మంత్రివర్గం స్థాపించడానికి రాజప్రముఖు పిలిస్తే .బాగుండునని వాళ్లు ఊహాగానం చేశారు. ఆ ఊహాగానం విడ్డూరంగానే ఉండవచ్చుగాని అది ఉన్నట్టుండి తప్పకున నిజమయి ఊరుకొంది. ముఖ్యమంత్రిగా పట్టం తాను పిళ్లై తాను పట్టం కట్టుకొన్నాడు.

కట్టుకోమనండి మనకేం అభ్యంతరం లేదు. ఎటొచ్చీ ఎన్నికలు అయిపోయిన నాటినుండి, అధికారంలోకి రావడందాకా మధ్య జరిగినవే కొంచెం కొట్టొచ్చేటట్టు కనబడ్డాయి. ఈ ప్రజాసోషలిస్టులు ఎన్నికలు తీరిపొయ్యాక అంతదాకా తాము చేతులు కలిపిన వామపక్ష సమాఖ్య వాళ్ళతో మరి పొత్తు లేదన్నారు. ఏదో మహత్తర ఆశయాలతో వాళ్ళు వాళ్ళూ కలిశారనుకొంటే ఇంతా చేసి ఈ కలయిక ఎన్నికల ఖర్చులు తగ్గించడానికే నట! అందుకే ఎన్నికల ఏరుదాటిన తరవాత ఎన్నికలముందు కట్టిన నేస్తం అనే తెప్పని తగలెయ్యడం దివ్యంగా ఉంది. ఏరుదాటగానే తెప్ప తగలెట్టేస్తాం అని ముందే చెప్పేంకదా అని అనడంలోనే విడ్డూరం ఉంది. "కొండ తవ్వి ఎలకని పట్టాం చరిత్రని నిర్మిస్తునాం" అని తమ తీర్మానం మీద తామే వ్యాఖ్యానంచేసే అధిష్టానవర్గం వాళ్ళున్న పార్టీలో ఈమాత్రం విడ్డూరం జరక్కపోతేనే విడ్డూరంగా ఉంటుందేమో! ఏమైనా చరిత్రని నిర్మించడానికి ఈ "ఎలకల్ని పట్టేవాళ్ళకి" అవకాశం ఇస్తూ రాజప్రముఖ్ చరిత్రని నిర్మించడమే చెప్పుకోదగ్గ సంగతి! ★



# కుర్చీలో కూనిరాగం

"ఆరుద్ర"

వారం వారం వెలువడుతున్న ఈ కూనిరాగాలని, ఆసక్తితో ప్రతి వారం చదువుతున్న వాళ్ళలో ఒకరైన యడవల్లి రాధాకృష్ణమూర్తిగారు తెనాలినుండి ఇలా వ్రాస్తున్నారు:

"ఆరుద్రగారిని ఆరేళ్ళ క్రిందట వారి ఇంటావిడ - పొరపాటు — ఇంటిగలావిడ పాడవద్దని షరతు పెట్టినట్లుగా, వారి కూనిరాగానికి అభ్యంతరం చెప్పడం కాదనుకోండి. ప్రారంభంలో వారి కూనిరాగం చిత్రవిచిత్రగతుల లయబద్ధంగా నడిచింది "సంస్కృతి" నిర్వచనం దొరకక ప్రస్తుత సమాజ మెట్లు తికమకపడుచున్నదీ తమ కూనిరాగంలో సువ్యక్తం చేశారు, ఇలాగే మరికొన్ని సమస్యలను చమత్కారంతో చిత్రిస్తూ నిరాఘాటంగా ధారావాహికంగా సాగిపోతున్న కూనిరాగానికి ఈమధ్య అపశ్రుతి పడ్డదని చెప్తే, వారు ఆగ్రహించరనుకొంటా."

ఎంత మాట! ఆగ్రహం ఎందుకండీ రాధాకృష్ణమూర్తిగారూ! ఏదేనా అపశ్రుతి వచ్చిందంటే మీరు చెప్పవలసినదే నిజంగా తప్పుచేస్తే అందుకు క్షమార్పణ నేను కోరుకోవలసినదే. అదీకాక మర్యాద పుట్టిపడే మీ శైలీ, స్నేహపూర్వకమైన మీ ఉద్దేశాలు, మాకు ఆగ్రహం కలుగుతుందా! ఆనందం కలగాలి గానీ - సరే మీరు ఎత్తి చూపిన అపశ్రుతికి సంజాయిషీ చెప్పుకొంటాను.

మందహాసం చేస్తూ కప్పూ సాసరూ అందిస్తున్న (ఆ కప్పులో కాఫీ ఉందో లేదో నాకుగాని, మీకుగాని ఆమెకుగాని తెలియదు. కాఫీ అయితే బహుశా అది చల్లారి పోయిన కాఫీ అవాలి. లేకపోతే ఆవిర్లు కక్కాలి) చల్లని చూపులతో అల్లరి నవ్వులతో చల్లారిపోయిన కాఫీ అందిస్తున్న అభినేత్రి భానుమతి ముఖపత్ర సుందరిగా ఉన్న ఆంధ్ర 'హిందు' పత్రికలో విద్యార్థి 'మేగజీను'లమీద నేను ఏదో ఆలాపించాను. అందులో అపశ్రుతి ఉందని రాధాకృష్ణమూర్తిగారి అభిప్రాయం.

"తమ కూనిరాగంలో... కాలేజీ మాగజీన్లలో చదువదగ్గవి రెండుమూడు వ్యాసాలేనని, హైస్కూలు మాగజీన్లు మరీ అధ్వాన్నమన్నట్లును వ్రాశారు. అది విద్యార్థిలోకానికి అపచారమేమో ననుకొంటాను" అని సహృదయులైన రాధాకృష్ణమూర్తిగారు భావిస్తున్నారు. అపచారమో కాదో తరవాత చూద్దాంగాని, అసలు కాలేజీ మాగజీన్లలో చదువదగ్గవి రెండుమూడు వ్యాసాలేనని రాధాకృష్ణమూర్తిగారు కూడా అంగీకరించుతున్నట్లు కనబడుతున్నది. అందుకు సమర్థనీయమైన కారణాలు కూడా చెప్పారనిపిస్తుంది.

"జీవితాన్ని కాచి వడబోసి జీవిత సత్యాన్ని చవిచూచిన వ్యక్తివలె రచనలు చేయలేరని విద్యార్థులపై నిందమోపుట శోచనీయం. అలాగైతే చిన్ననోటికి పెద్ద శోకం అన్నట్లుంటుంది." అని చెపుతూ విద్యార్థి రచనలలోని "శిల్పమును నిర్ణయించి అవగతము చేసుకొనవలసినవారు వారి సహాధ్యాయులైన విద్యార్థులు వారి కర్థమగునటుల వారికి తగినట్లు రచనలున్న చాలును" అని విద్యార్థి రచనకి ప్రయోజనం ఏమిటో ప్రతిపాదించారు.

నేను చెప్పేదికూడా ఇంతే. కళాశాల మాగజీన్లు కళాశాలల నిమిత్తమే అందులోని ప్రతి అక్షరం, రాసినవాళ్ళకీ ఆ రాసినవాళ్ళ సహాధ్యాయులకీ శిల్ప సమన్వితంగానే ఉంటుంది వాళ్ళ సహాధ్యాయులం కాని మనలాంటివాళ్ళు చదివి ఆనందించదగ్గవి రెండుమూడు ఉంటే ఉండొచ్చు ఉండాలన్న నియమం లేదు ఉంటే మంచిదే కానీ విద్యార్థులు కూడా చదువకూడనివీ రాయకూడనివి ఉంటేమట్టుకు అది 'శోచనీయం' పైగా అది 'విద్యార్థి లోకానికి అపచారం'

నేను నా కూనిరాగంలో ఒకానొక హైస్కూలు పత్రికలోని రచనలని ఎత్తి చూపాను. వాటిని రాధాకృష్ణమూర్తిగారు చాలా శ్రద్ధగా చదివే ఉంటారు. అయినా ఆ రచనలు విద్యార్థిలోకానికి అపచారం అని వారికి ఎందుకు తట్టలేదో! బహుశా విద్యార్థులపై వారికిగల సానుభూతి, అనురాగం ఆ రచనలలో ఉన్న 'అసభ్యతని' మన్నించి ఉండవచ్చు ఆ రచనలలో ఎలాంటి 'నీతు'లున్నాయో చిత్తగించండి

ఆ పత్రికలో ఒక విద్యార్థి చదువుకొనే ఆడపిల్లలమీద పద్యం రాశాడన్నానే. ఆ పద్యపాదాలు చూడండి, వాటి అర్థం చూడండి. "హైస్కూలులలో చదువుకొనే ఆడపిల్లలు రాబోయే తరంవాళ్ళకి మదర్స్ అంటే మాతృదేవతలు" బాగానే ఉంది. "ఈ మాతృదేవతలకి, ఆ హైస్కూల్లో చదువుకొనే మగపిల్లలంతా నిజానికి బ్రదర్స్ అనగా భ్రాతలు కావాలిగాని అలా అందర్నీ పిలవడంలో అందం లేదట! అందుచేత పైపైకిమాత్రం మడికట్టుకొని ఆడపిల్లలు నీతిగా ప్రవర్తిస్తారట., కనిపించిన మగవాడల్లా ఆ ఆడపిల్లల లవర్ అనగా ప్రియుడట!" ఇంతకన్న శోచనీయంగాని విద్యార్థిలోకానికి అపచారంగాని ఉందేమో ఆలోచించండి ఆ విద్యార్థి కవి అంతటితో ఆగలేదు. "ఆ చదువుకొనే ఆడపిల్లలు కనిపించిన ప్రతి మగవాడిమీద తమ అస్త్రాల పవర్ అంటే శక్తి ప్రయోగిస్తారట క్లాసులో దొంగచూపులు చూస్తారట పెళ్ళి చేసుకొన్నాక స్వేచ్ఛ పేరిట మగాళ్ళ నెత్తిమీద జిల్లేడాకులు పెట్టించి విడాకు లిచ్చేస్తారట" రామ! రామ!

స్త్రీవిద్య రోజు రోజుకి పెరుగుతున్న ఈరోజుల్లో కూడా చదువుకొన్న ఆడదంటే కొంతమందికి చులకనగా నే ఉంది. ఆ ఆడపిల్లలంతా చెడిపోయినట్టే భావిస్తారుకొంతమంది. చదువుకొన్న ఆడదాన్ని హేళనచేస్తే సమాజం ఇట్టే హర్షించి నవ్వుతుంది సమాజాన్ని నవ్వించడానికి ఇంత నీచానికి మన సినిమా డైరెక్టర్లలో, కళాకారులలో మహామేధావిగా చెలామణీ అయిపోతున్న శాంతారామే దిగాడు. శాంతారాం "తీన్ బత్తీ చార్ రస్తా" అనే చిత్రం ఒకటి తీశాడు. గమనించారో లేదో అందులో ఒక చదువుకొన్న ఆడది కథానాయకుడిని తొలిసారి కలుసుకొన్న ఘట్టంలో - ఆ చదువుకొన్న ఆడది "హలో!" అంటూ షేక్ హేండ్ ఇవ్వడానికి చెయ్యి చాస్తుంది. కథానాయకుడు మట్టుకూ ఆ చాపిన చెయ్యి అందుకోకుండా పరమ పవిత్రంగా తన రెండు చేతులు జోడించి 'నమస్తే' అంటాడు. ఆ ఆడదాని 'చెడ్డతనా'న్నీ అందుచేత ఆవిడకి కలిగిన ఈ 'పరాభవా'న్ని చూసి ప్రేక్షకులు ఘొల్లున నవ్వారు

సరే అదలా ఉంచండి ఈ విద్యార్థి రచననే చూడండి చదువుకొనే ఆడపిల్లలమీద నీచాభిప్రాయాలు వెలిబుచ్చిన ఆ రచన ఆ కుర్రాడు ఎందుకు చేశాడో మనం ఊహించవచ్చు ఆ విద్యార్థి స్కూలుఫైనలు క్లాసు చదువుతున్నాడు. అంటే మహా అయితే పద్దెనిమిదేళ్ళు కూడా ఉండకపోవచ్చు. ఈ వయస్సులోనే "లైంగిక కాతూహలం" ఏర్పడుతుంది. బాల్యంలోనుండి యౌవనంలోకి అడుగుపెట్టే వయస్సు అదే. ఈ పరి

# కుర్చీలో కూనిరాగం

కాము వయస్సులో ప్రాథమిక మోహం రకరకాల విజృంభించే అవకాశా లున్నాయి. ఆడపిల్లల నవవయో విలాసాలు మగపిల్లలలో రకరకాల కోరికలు రేకెత్తించ వచ్చు. జ్వరంలాంటి మోహంతో ఉడుకె త్తించే భావాలు కలుగవచ్చు ఆశలు రావచ్చు. ఈ కోరికలను తీర్చుకొనడానికి సవాలక్షమార్గా లున్నాయి అందులో సవ్య మైనది పవిత్ర ప్రేమ - లక్షణమైన పెళ్ళి. ప్రేమపెళ్లి సంభవించనప్పుడు అపసవ్య మైనవి అనేకం జరుగుతాయి కోరికలు తీరని కోరికలుగా ఉండిపోతాయి

మన సత్వ శాస్త్రరీత్యా తీరని కోరికలని ఎలా సబ్లిమేట్ చేసుకొంటామో చూడ వచ్చు. మామూలుగా మన తీరని కోరికలని మనం కలలలో తీర్చుకొంటాం అలాగే కళలలోకూడా తీర్చుకోవచ్చు రాయడం చేతనైనవాడు, రచనలలో తన కోరికలు తీర్చుకుంటాడు నేను ఉటంకించిన విద్యార్థి రాయడం చేతనవుమ ఆ విద్యార్థి తన అక్కసుని రచనలో వెళ్ళ కక్కుకున్నాడు. లైంగిక కాతూహలం అంకురిస్తున్న సున్నితమైన వయస్సులో సుకుమారమైన మనస్సులలో ఆడదానిమీద రాగానికి బదులుగా ఒకప్పుడు ద్వేషంకూడా కలుగవచ్చు. అలా కలిగిన ద్వేషంచేత బహూశా ఆ విద్యార్థి అలాంటి రచన చేసేదేమో. దాన్ని మనం అర్థం చేసుకోగలం గాని దాన్ని పాఠశాలల పత్రికలో అచ్చువేసిన అయ్యవార్ల నేమనాలి? ఔచిత్యం తెలియని అయ్యవార్లుంటే అనర్థాలు జరుగుతాయి నేను ఉదహరిస్తున్న పాఠశాల పత్రికలో ప్రధానాంధ్ర పండితుడి 'చాటువులు' కూడా కొన్ని చూపెట్టాను. అవి ఆయన రాయకూడదని నేననను అవి పాఠశాల పత్రికలో 'అచ్చు వెయ్యవచ్చా? అలా అచ్చువేస్తే విద్యార్థి లోకానికి అంతకన్నా అపచారం ఉంటుందా? అందులో ఒక పద్యం అర్థంని చూడండి '

"ఓ దారంట పోయేవాడా? ఉండుండు వెళ్లిపోకు! నువ్వు రాజవైద్యుడవో, జ్యోతిష్యుడవో, మా అత్తగారు గుడ్డిది, మా ఆయన ఊళ్ళో లేరు. ఆవిడకి కళ్ళెలా వస్తాయి. ఆయన ఊరినుండి ఎప్పుడొస్తారు కాస్తా చెపుదూ" అని ఆ పద్యానికి ప్రతిపదార్థం చెప్పుకోవాలి. గాని దాని భావం మట్టుకూ వేరు. అస లర్థం చెప్పమంటే ఆ ప్రధానాంధ్ర పండితుళ్ళే చెప్తారు. "ఓయి దారంట పోయేవాడా! నువ్వంటే నాకు ముక్కువ కలిగింది. మా అత్తగారికి కళ్ళు లేవు. మా ఆయన ఊళ్ళో లేడు. మనకి మరేం అడ్డు లేదు కాబట్టి నువ్వు వెళ్ళి పోకు" ఇదీ దాని తాత్పర్యం.

ఇలాంటి పద్యాలు ఒకటా రెండా. ఆ ప్రధానాంధ్ర పండితుడుగారు అచ్చు వేసిన అన్ని పద్యాలలోనూ ఇంత దివ్యమైన వ్యంగ్యం ధ్వని ఉన్నాయి ఈ పద్యాలని వేరే అచ్చువేసుకోడానికి అవకాశం రాకో, ఇష్టం లేకో, లేకపోతే అచ్చు వేసుకొనే అవకాశం వచ్చిందనో ఆ పండితులు పాఠశాలా పత్రికలో వాటిని అచ్చువేశారు. అది తగునా అన్నదే నా ప్రశ్న!?

ఏమండీ రాధాకృష్ణమూర్తిగారూ! విద్యార్థి రచనలను "అవగతము చేసుకొన వలసినవారు, వారి సహాధ్యాయులైన విద్యార్థులు." "వారికి తగినట్లు రచనలున్న చాలును" అని మీరు కూడా అభిప్రాయ పడుతున్నారుగదా నేను చూపెట్టిన ఈ రెండు రచనలు విద్యార్థులకి తగినట్లు ఉన్నాయో? మీరే చెప్పండి

కళాశాల పత్రికలలో, హైస్కూలు మేగజీన్లలో అధ్యాపకులు, పండితులు వ్యాసాలు రాయవలసిందే పద్యాలు అచ్చు వెయ్యవలసినదే విద్యార్థులకి మార్గదర్శకమైన రచనలను ప్రచురించాలి. హైద్రాబాద్ ఉస్మానియా కళాశాల వాళ్ళ పత్రిక 'శోధ' అనేది వస్తూఉంటుంది. అందులో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారూ, ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారూ వ్యాసాలు వ్రాస్తూఉంటారు. వాటి ప్రయోజనం ఎంతైనా ఉంది. తక్కిన కళాశాల పత్రికలలో తక్కినపండితులు ఎన్నిరచనలు అచ్చు వెయ్యటం లేదు వాళ్ళందరూ ఈ మాత్రం చాటువులు చెప్పలేకనా, తలచుకొంటే హాలుడికీ కాళిదాసుకీ అంతకన్నా రమ్యమైన తర్జుమాలు చేయలేకనా, ఔచిత్యం పాటించి కళాశాల పత్రికలలో అచ్చు వెయ్యటం లేదుగాని.

కాబట్టి, రాధాకృష్ణమూర్తిగారూ! పాఠశాల పత్రికలలోని రచనలన్నీ బాగుండవు అని మనం మనస్సులలో అనుకొన్న విషయాన్ని బయటకు చెప్పడంలో విద్యార్థి లోకానికి మనమేమీ అపచారం చెయ్యడం లేదనుకొంటా. ఆ విద్యార్థులని హీనంగా చిత్రించే రచనలూ, ఆ విద్యార్థులకి 'తగినట్లు' లేని రచనలూ ఆ పత్రికలలో పడి, విద్యార్థిలోకానికి అపచారం అపకారం చేస్తున్నప్పుడు వాటిని గర్హించకపోతేనే అపచారం అనుకొంటాను. అందుచేత కూనిరాగంలో అప్రస్తుతి లేదని నానమ్మకం

* * *

మనలో కొంతమందిమి మాట్లాడేటప్పుడు ఇంగ్లీషుపదాలు తరచుగా వాడుతూ ఉంటాం. మనం మాట్లాడేటట్టే పద్యాలు రాస్తే బాగుంటుంది అనుకొని నేను ఇంగ్లీషు పదాలు వాడుతూ కొన్ని రాశాను. అలా రాసినవాటిలో

"బ్రెయిన్‌లో బ్రెన్‌గన్
రైయిన్‌లా ఆలోచనల బ్రెయిన్
స్పయినల్ కార్డులో స్ప్రెయిన్."

అనే 'త్వమేవాఽహం'లోని రచన లున్నాయి ఈ రచన చాలామందికి అర్థం కాలేదు అన్న సంగతి నాకు క్రమేణా అవగతం అయింది ఆ పద్ధతి రచనలు అట్టే ప్రయోజనకారులు కావు అన్న సంగతి నా పరిశోధన అనుకొన్నంత సఫలీకృతం కాకపోయిన తరవాతిగాని నాకు తెలియక పోవడంలో తప్పేం లేదు.

"బ్రెయిన్‌లో బ్రెన్‌గన్" లాంటి నా రచనలే నేను విమర్శించిన పాఠశాల విద్యార్థి రచనకి కారణం అని ఆ బాధ్యత నాదే అని యడవల్లి రాధాకృష్ణమూర్తిగారు ఇలా వ్రాసేరు.

"అసలు ఆరుద్రగారి విమర్శకు గురియైన ఆ విద్యార్థి రచన

పీల్లంతా వచ్చే జనరేషన్ వాళ్ళకి
మదర్స్
నిజానికీళ్ళందరూ కావాల్సి బ్రదర్స్
*Etc.*

పై రచనల అనుకరణ అని చెప్పవచ్చు. అందులో అతని బాధ్యత అంతగా లేదనుకొంటాను. అట్టి పరిస్థితులలో వారి సోదర తుల్యుడైన ఒక వ్యక్తిపైన కినుకబూనటము సమంజసము కాదేమో"

బాగానే ఉంది! రాసే పద్ధతిని కాదు నేను విమర్శించినది, రాసిన విషయాన్నే. పద్యానికి టెక్నిక్కు ముఖ్యమే గాని విషయం మంచిదికానప్పుడు ఆ టెక్నిక్కు అడవిగాచిన వెన్నెల. "త్వమేవాహం" టెక్నిక్కుని అనుసరించిన విద్యార్థి ఇంత అనౌచిత్యంగా ఆడపిల్లలకి అపచారం చేసే రచన చేశాడే అని అతడి ఆలోచనలు సక్రమంగా మారతాయేమో అన్న సదుద్దేశంతోనే ఈ విమర్శ చేశాను సోదరతుల్యుడు కొట్టే చెయవలసివచ్చింది చాకుతో పెన్సిలు చెక్కుకోవచ్చు - గొంతుక కోసుకోనూ వచ్చు విద్యార్థి పెన్సిలు చెక్కుకోడమే మంచిది పదునైన టెక్నిక్‌తో స్త్రీజాతిని మెచ్చు

(56-వ పేజీ చూడండి)

# కుర్చీతో కూనిరాగం

(8-వ పేజీ తరువాయి)

కొన్నావచ్చు, తిట్టావచ్చు, ఆడపిల్లలని అగౌరవించే రచనలని మట్టుకూ నేను మెచ్చుకోలేను,

"ఇకనుంచి 'కూనిరాగం'లో అపస్వరాలు పడకుండా ముందుకు సాగిపోతుందని ఆశిస్తున్నాను" అని రాధాకృష్ణమూర్తి గారు, ఆశించినందుకు కృతజ్ఞుణ్ణి, అపస్వరాలూ, 'అపశ్రుతులు' రాకుండా ఉండా అని ప్రయత్నిస్తాం

తాజాకలం: "ఇవాళే పోస్టులో వచ్చింది" అని వారపత్రిక సంపాదకులు 'శ్రీ రాహిణేయ' అనేవారు "శ్రీ ఆరుద్ర గారి కూనిరాగాలాపనలో అపశ్రుతి" అనే వ్యాసాన్ని అందచేశారు 'శ్రీ రాహిణేయ' గారు వారి పూర్తి నామాన్ని చిరునామాని వ్రాయకపోయినా సర్కారువారి పోస్టు ముద్రమట్టుకు వదరువ్యాసంలో ఆ పైనున్నాలు ఉన్న ఊరిలో నే పోస్టు చేసినట్టు తెలుపుతున్నది ఆ ఊరివారికి కావలసిన చేతకబోలు వారు ఆ పైనున్నాలు పత్రికని కూలంకషంగా చదివినట్టుకూడా వారి వ్యాసంలో విదర్శనాలు కనబడుతున్నవి

'శ్రీ రాహిణేయ' గారు ముద్రణలో జరిగిన ప్రమాదంవల్ల నేను ఉదహరించిన విద్యార్థి పద్యంలో ఏర్పడిన మార్పులు చూపారు

గాలించండి!" అని అందుకున్నాను

"అదేవిట్రా నన్ను ఫూల్‌ని చేస్తున్నావ్? నేకన్నది కలగాదురా నాయనా—నిజమే పర్సు వాడి చేతిలోంచి జారిపడితే చప్పుడుకి మెలకువొచ్చింది. వాడు తీసిందీ నిజమే—నేను చూచిందీ నిజమే" అని, నిట్టూర్చారు మాస్టారు

ఇలా అంటుండగానే పిల్లలు మాస్టారి పెట్టెలు అన్నీ గాలించి, అడుగు పెట్టెలో నున్న పర్సుని బయటికి తీశారు

పర్సుని చూడగానే మాస్టారూ, రాత్రి ఆ ఘనకార్యం చేసిన ప్రబుద్ధుడూ, యిద్దరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

"బహుశా, యిదంతా దేవీ మహిమ అయివుంటుంది" అన్ని, ఫక్కున నవ్వేశాను ★

అందుకు కృతజ్ఞుణ్ణి అచ్చు తప్పుపడ్డందుకు విచారిస్తున్నాను (అచ్చు తప్పుకి మేము కూడా విచారిస్తున్నాం - సంపాదకుడు)

"ఇటువంటివాళ్లు మాత్రం కాదు లేడీస్ వాళ్లు కేవలం కేడీస్"

అని ఉండవలసిన పంక్తులలో "కాదు" అనే మాట అచ్చులో ఎగిరిపోయింది ఈ లోపాన్ని చూపెట్టి 'శ్రీ రాహిణేయ' గారు ఇలా వ్రాస్తున్నారు

"ప్రతి శీర్షికకూ మకుటంగా నీతి అనేది ఉండాలి విద్యార్థి ఆడపిల్లల మనస్తత్వాన్ని అంత ధైర్యంగా వర్ణించినా, (అంటే కేవలం వాళ్లమీద దండెత్తడం తప్పే అనాలి) చివరికి తన ఉద్దేశంలో - పైని చెప్పినటువంటి ఆడవాళ్ళు మాత్రం లేడీస్ కాదని వాళ్లు కేడీస్ అని - అట్లా వుండటానికి ప్రయత్నించవద్దనీ ఏదో తోచిన సలహా ఇస్తాడు"

ఇది హాలీవుడ్ చిత్రాల పద్ధతిలో ఉంది చిత్రం పొడుగునా దొంగల నాయకులు, హంతకులు చేసే ఘోరాలని వివరంగా చిత్రించి, వాళ్ళని అమరవీరుల మాదిరిగా చూపించి కొసనిమట్టుకూ "క్రైమ్ డజ్ నాట్ పే" అంటే "నేరం లాభసాటి కాదు" అని హాలీవుడ్ చిత్రాలు ప్రబోధం చేస్తాయి అదేవిధంగా ఆడపిల్లలు చెడ్డవాళ్ళని పాతిక పాదాలు పైగా రాసి వీళ్లు 'లేడీస్' కాదు అని చెప్తే సరిపోతుందా? 'శ్రీ రాహిణేయ' గారు సరిపెట్టుకోమన్నా నేను సరిపెట్టుకోలేను

"అసలు పాఠశాలపత్రికలు రసపుష్టిమై ఉండాలంటే కేవల విద్యార్థులరచనలేగాక ఉపాధ్యాయ పండిత వర్గాలవారివి కూడా వుండాలని చాలామంది నమ్మకం. మొదట్లోగా వున్న 'శుభోదయం' అనే శీర్షికలోని సంస్కృత శ్లోకాల భావాన్ని కొద్దిగానో గొప్పగానో చదివి అర్థం చేసుకోనేవారికి ఈ చాటువులంత అర్థంకాని పరిస్థితిలో, ఉపాధ్యాయులే అర్థం చెప్పాల్సినంత అవస్థలో ఉన్నాయంటే అంతగా నమ్మలేకుండా ఉన్నాను విశిష్య భాషాప్రవీణులు విద్యాప్రవీణులు ప్రధానాంధ్ర పండితులు అయిన వారి చాటువులు వారికి తగినట్లుగానే పాండితీ గరిమతో ఒప్పుతయి గాని తద్రప్రవీణులు అపండితులు అయినవారికి తలనొప్పిగానూ వుండవచ్చు సినిమా కవిత్వంవలె సర్వజన సామాన్యమైందిగా వుండకపోనూవచ్చు దాని కేవలం చేస్తారు కష్టే ఫలీ" అనీ కూడా 'శ్రీ రాహిణేయ' గారు వ్రాశారు

నేను ఈవారం కూనిరాగంలో మొదట మనవిచేసినట్టు కళాశాల పత్రికలలో అధ్యాపకులు కూడా రచనలు చెయాలి గాని ఔచిత్యం మట్టుకూ అవసరం అదీ నా విజ్ఞాపన 'శ్రీ రాహిణేయ' [illegible] కంలో ఆ పైనున్నాలు [illegible] సంస్కృత శ్లోకాలూ, చాటువు విద్యార్థులకి సులభంగా బోధపడ ఉన్నవి అనే అర్థం స్ఫురిస్తున్న తెలుగు పద్యాలకి అర్థం ఉపాధ్యాయ చెప్పవలసినంత అవస్థ లేదంటున్నా, విద్యార్థులందరికి అంత కావ్యానుభవ ఉంటే నేననుకొన్నంత ప్రమాదం దన్నమాటే!! ఆ చాటువులలోని విద్యార్థులకి బోధపడితే 'అమంగళం ప్రతిహతమగుగాక!'

ఆ ఉన్నతపాఠశాలపత్రికలోని రసం ఎంత ఉన్నతంగా ఉన్నా చూశాక "శ్రీ ఆరుద్ర గారు గుండెలు కొనేఅంత పరిస్థితి ఏర్పడ్డందుకు ఆశ్చర్యం విచారమూ కలిగింది" 'శ్రీ రాహిణేయ' గారు అంటున్నా, చెయ్యమన్నారు చెప్పండి అన్ జరుగుతున్నప్పుడు గుండెలు బ[illegible] కుండా ఉండలేను ఆ రచనలు పద్ధ పాఠశాల పత్రిక కాకపోతే నాకు ఇంత ఆశ్చర్యం విచారం కలిగి[illegible] కావు

"విమర్శించాలంటే సాహితీ [illegible] కాదు ఏ రంగంలోనన్నా ఏదో [illegible] దొరక్కపోవు కాని ఆ విమర్శ సార్థ[illegible] సవ్యంగావుంటేనే సురభి కుసుమ[illegible] హృదయాల్ని ఆకర్షిస్తుంది లేకపో[illegible] లేని గడ్డిపూవే అంటూ ఇంకటి[illegible] మిస్తా" అని శ్రీ రాహిణేయ గారు [illegible] న్న ముగించారు! నిజమే [illegible] ఉండాలనే విమర్శించాను నా[illegible] చదివి ఇకమీదటైనా విద్యార్థులు [illegible] రచనలు చేస్తే అధ్యాపకులు వాటిని [illegible] మెచ్చుకోన్నా, వాటివిషయాన్ని [illegible] విద్యార్థులని మంచిమార్గంలో పె[illegible] ఆశించాను. తమ 'పాండితీగరి[illegible] ఒప్పే శుద్ధశృంగార రసమయ పద్యాల[illegible] శాల పత్రికలో ప్రచురించరని [illegible] తున్నాను

'శ్రీ రాహిణేయ' గారు ఆ ఊరు[illegible] కాబట్టి దయచేసి నా తరఫున ఆ విద్యా[illegible] ఆ ప్రధానాంధ్ర పండితుడికి ఈ వి[illegible] చెప్పి నా విమర్శని సార్థకం చే[illegible] తున్నా

[శ్రీ యడవల్లి రాధాకృష్ణమూర్తి పంపిన "కూనిరాగ ప్రతిరాగం" వ్యాసాన్ని, 'శ్రీ రాహిణేయ' గారు "ఆరుద్రగారి కూనిరాగాలాపనలో శ్రుతి" అన్న వ్యాసాన్ని స్థలాభావం ముద్రించలేదు వానిలోని ముఖ్య [illegible] లను ఆరుద్రగారు ఈవారం 'కూనిరాగ[ం]'లో ఉదహరించారు —సంపాదక

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Ma[dras]



# మర్చిపోలేని త్యాగం

"అరుద్ర"

దుష్టుడికి దూరంగా ఉండమన్నారని నిన్నటిదాకా మన దేశం యావత్తూ సోల్జరన్న పేరు వినగానే ఆ పేరుని కూడా అభారతీయంగా చూసి దాన్నీ, ఆ పేరుగలవాడినీ దూరంగా అట్టే పెట్టేవారు. పరాయి ప్రభుత్వం ఇచ్చే జీతం డబ్బులకి ఆశపడి నిన్నటిదాకా ఎంత మంది ఉద్యోగాలు చెయ్యలేదు? గాని వాళ్లందరిలోకీ చెడ్డవాడుగా సిపాయివాడే కనబడేవాడు. యుద్ధంరోజుల్లో మరీని.

మిలటరీ లారీ నడక ఎంత విచ్చలవిడిగా ఉంటుందో చూసిన దానితోనే మిలటరీ వాడి నడతని కూడా సరిపోల్చుకుని రోడ్డు మీద ఆ రెండింటిలో ఏ ఒక్కటి కనబడ్డా, లేక రెండూ కలిసి కనబడ్డా పురజనులు దూరదూరంగా తప్పుకొనేవారు. "ఖాకీ యూనిఫారం కట్టుకోనడమే కాపురుషుల లక్షణం" అన్నట్టు చిన్నా పెద్దా ఆడా మగా అంతా భావించేవారు. ఆడవాళ్లు ఆమడదూరంలో మిలటరీవాడు కనబడగానే ఇంట్లోకిపోయి తలుపులు బిడాయించుకొనేవారు.

ఇండియన్ విమానదళం యూనిఫారం కట్టుకొని కొన్ని సంవత్సరాలు ఇండియాలోని కొన్నికొన్ని పట్టణాలలో సంచరించే భాగ్యం నాకు కలిగింది. ఆ రోజుల్లో, నన్నూ నేను కట్టుకొన్న ఖాకీబట్టలనీ చూసి నా దేశం గర్వపడాలని నేను ఆశించలేదు గాని చీదరించుకోకుండా ఉంటే చాలు అనిపించేది. దేశానికి స్వతంత్రం వచ్చాక మన సైనికులంటే మనం గర్వపడుతున్నాం. వాళ్లకి మర్యాదలు చేస్తున్నాం సదుపాయాలు కలిగిస్తున్నాంగాని దేశానికి స్వతంత్రం రాకముందూ మన సైనికుల్ని చూసి మనదేశమంతా గర్వపడినరోజు ఒకటి లేకపోలేదు.

ఆరోజుని దేశమంతా మరచిపోవచ్చు గాని, సైనికులూ మాజీసైనికులు మాత్రం మరచిపోలేరు. మన నావికులు తిరుగుబాటు చేసినరోజు వాళ్ళు తిరుగుబాటు చేస్తున్నారని తెలిసీ తెలియగానే తదితర సైనిక దళాలలో ఉన్నవాళ్లు ఒక్కసారి కళ్ళు తెరిచారు. అలా కళ్ళు తెరచీ తెరవగానే నావికులతో చెయ్యి కలిపి పోరాడడానికి నిశ్చయించారు.

ఆ రోజు నేను మరచిపోలేను. అంబాలాలో ఉంటున్నాను. ఆనాటి సాయంత్రం చీకటి పడుతూ ఉంటే మాకు కొత్త వెలుతురు కనబడుతూ ఉంది. రాత్రి ఎనిమిది గంటలు అయేసరికి మా కేంపులోని దేశభక్తులలో కొందరు వాళ్లంతట వాళ్లు నాయకత్వానికి ముందుకొచ్చారు. దాని అర్థం, దానివల్ల వచ్చే అనర్థంకూడా వాళ్లకి తెలుసు. అందుకే అనర్థాలు రాకుండా ఏర్పాట్లు చేసుకొని రాత్రిపూట భోజనాలయ్యాక విశాలమైన భోజనశాలలో భారతీయుడు ప్రతి ఒక్కడూ కూర్చొనే ఉన్నాడు. కాంతివంతమైన ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి అంతకన్నా కాంతివంతంగా మా ముఖాలు ఉజ్జ్వలంగా ప్రజ్వరిల్లుతున్నాయి.

ఇంతలోనే ఉన్నట్టుండి ఎలక్ట్రిక్ దీపాలు ఆరిపోయాయి అవసరమైన చీకటి అలుముకొంది. ఆ చీకటిలో ఒక కంచు కంఠం "కామ్రేడ్స్! మన సోదరులు నావికులు తిరుగుబాటు చేస్తున్నారని మీకు తెలుసు!" అని ఉపన్యాసం మొదలెట్టింది 'కామ్రేడ్స్' అనే మాటకి పవిత్రమైన అర్థం ఆ చీకటిలో ప్రతిఒక్కడికి బోధపడింది నావికుల తిరుగుబాటుకి వైమానికులు ఎలా సహాయం చేయాలో ఈ తిరుగుబాటుని స్వాతంత్ర్య సమరంగా ఎలా మార్చాలో ఆ కంచుకంఠం విపులంగా కాకపోయినా విశదీకరించింది. ప్రతి ఒక్కడూ ఈ పోరాటంలో పాల్గొంటామని శపథం తీసుకోవాలని హెచ్చరించింది.

వెయ్యిగొంతుకలు ఒక్కసారి 'ఇంకిలాబ్ జిందాబాద్' అని ఎలుగెత్తాయి. శపథం తీసుకొన్నాయి మర్నాడు నుంచీ మా పోరాటం. ఇంకా ఎలక్ట్రిక్ దీపాలు వెలగలేదు నాయకులెవరో ప్రచ్ఛన్నంగానే ఉండాలి లేకపోతే ఆదిలోనే ప్రమాదం. చీకటిలోనే భోజనశాలనుండి బయట కొచ్చాం. బయటకివచ్చి రావడంతోనే మాకు కనబడినది మా బ్రిటిష్ కమాండింగ్ ఆఫీసరు!!!

"మీ ఉపన్యాసాలు విన్నాను. మీరు చేస్తున్నది చాలా తప్పు! మీ నాయకులెవరో నా ముందుకొస్తే వాళ్ళకి నచ్చచెప్తా" అన్నాడు మా సర్వాధికారి అతడు ఆశించిన అవివేకులు మాలో ఎవరూ లేరు "సరే జాగ్రత్తా! చూసుకోండి" అని సర్వాధికారి వెళ్ళిపోయాడు

ఆ రాత్రి మాకు నిద్దర్లు లేవు. ఆయుధశాలలో, వైర్ లెస్ యంత్రాలదగ్గర డ్యూటీలో ఉన్న భారతీయులని కమాండింగ్ ఆఫీసరు వెంటనే ఆ రాత్రి డ్యూటీలోంచి తొలగించాడు. అయినా బొంబాయిలో కరాచీలో జరుగుతున్న విషయాలు ఏ నిముషాని కా నిముషం మా నాయకులకి వార్తలు వస్తూనే ఉన్నాయి! రహస్యంగా తెలియవలసినవాళ్లకి మాత్రం తెలుస్తూనే ఉన్నాయి.

---

(ఒక సభలో)

ఒకరు:— ఆ అధ్యక్షులు గారు మాటిమాటికీ బల్లగుద్ది మాట్లాడుతున్నారేమండీ!

ఇంకొకరు:—ఆయనగారికి ముందెప్పుడో పోస్టాఫీసులో ముద్రలు గొట్టేపని కాబోలు.

—యల్. వి. సరోజ, చిత్తూరు.

* * *

కొత్త ముఖాలకోసం అన్వేషిస్తున్న ఓ చిత్రనిర్మాత ఓ నాడు సముద్రపొడ్డున ఓ దంపతిద్వయాన్ని చూసి భర్తని అడిగాడు!

"తమకు అనుమతిస్తే తమ అర్ధాంగిని చిత్రాల్లో ప్రవేశపెట్టాలని వుంది"

భర్త ఎగిరిగంతేసి పరవశత్వంతో అడిగాడు: "మరి ప్రతిఫలంగా నాకేం యిప్పిస్తారండీ?" అని.

"విడాకుల నోటీసు" అన్నాడు నిర్మాత క్లుప్తంగా.

—యస్ ఆర్. నంది.

# ఏప్రిల్ ఫూల్

## భాస్కరం ప్రభాకరం

పంతులయ్యగారి కొక్క
పార్సెలు అందింది, చాల
షోకైనది ఆపార్సెలు
పైకి చాల బాగున్నది.
పెట్టె మూత తీయగానె
వట్టి గడ్డి కనబడింది
వట్టి గడ్డి తీసేస్తే
వున్నదొక్క గమ్మత్తు.
ఏమిటి ఆ గమ్మత్తు?
ఏప్రిల్ ఫూల్! ఏప్రిల్ ఫూల్!

* * *

అట్టెండె న్సేసుకుంటు
అడిగినాడు పంతులయ్య
"ఇంకులేదు పెన్నులోన
ఇవ్వండ్రా వొకపెన్" అని
కుర్రవాళ్లు పెన్నిస్తే
క్యాపుతీసి చూడగానె
పాళిలేదు, ఇంకులేదు
నాలికేది? ఇదియేమిటి?
ఏమిటి ఆగమ్మత్తు?
ఏప్రిల్ ఫూల్! ఏప్రిల్ ఫూల్!

* * *

మంత్రిగారు వస్తారని
తంతివార్త అందగానె
ఎవ్వరితోనూ చెప్పక
ఇల్లు వదలి వచ్చినారు
కౌన్సిలర్లు, కోమట్లూ
కామ్రేడ్లూ, కార్మికులూ
మెయిలువచ్చి వెళ్లిపోయె
మంత్రియేడి? మంత్రియేడి?
ఏమిటి ఆగమ్మత్తు?
ఏప్రిల్ ఫూల్! ఏప్రిల్ ఫూల్!

* * *

ఎరుపు నలుపు ఆకుపచ్చ
ఎన్నోరంగుల సిరాలు
చొక్కాపై పోద్దామని
సిరాబుడ్డి ఎత్తుసరికి
పొరపాటున చేయిజారి
సిరావొలికె తనమీదనె
జనమంతా నవ్వినారు
తనుకూడా నవ్వినాడు
ఏమిటి ఆగమ్మత్తు?
ఏప్రిల్ ఫూల్! ఏప్రిల్ ఫూల్!

* * *

పెన్నులోన మంచినీళ్లు!
అగ్గిపెట్లో తేలుపిల్ల!
చింతగింజ లుప్మాలో!
సున్నం స్నో సీసాలో!
ఫౌంటెన్ పెన్ రాయదేమి?
అగ్గిపెట్లో అయ్ బాబోయ్!
ఉప్మాలో ఇది ఏమిటి?
ఇది ఎక్కడి స్నో అయ్యో?
ఏమిటి ఈగమ్మత్తు?
ఏప్రిల్ ఫూల్! ఏప్రిల్ ఫూల్!

# ★ కుర్చీలో కూనిరాగం ★

ఆ మర్నాడు అంబాలా పురవీధులలో పెద్ద ఊరేగింపు చేశాం. అందులో విమానదళంలోని ప్రతిఒక్క భారత సైనికుడు పాల్గొన్నాడు. నినాదాలు ఇచ్చుకుంటూ సాగాము. మమ్మల్ని చూసి వీథిలో ప్రతి ఒక్క పౌరుడూ గర్వించాడు. ఆడవాళ్ళు మమ్మల్ని చూసి ఆనందబాష్పాలు రాల్చారు. వృద్ధులు మమ్మల్ని దీవించారు.

బొంబాయిలో మా విమానదళం కేంపుని బ్రిటిష్‌దళం చుట్టుముట్టినప్పుడు మరికొన్ని స్థావరాలలో తిండికూడా దొరకనివ్వనప్పుడు పౌరులు వైమానికులకి, నావికులకి ఇచ్చిన ప్రోత్సాహం, చేసిన సహాయం ఇంతా అంతా కాదు.

సర్దార్ పటేలు పుణ్యం కట్టుకోకుండా ఉంటే స్వాతంత్ర్యాన్ని సంపాదించిన ఘనత ప్రత్యక్షంగా మన సైనికదళాలకే దక్కేది ఏమైతేనేం మనకి స్వతంత్రం వచ్చింది. అది కాంగ్రెసువాళ్ళు చేసిన ఘన కార్యాలవల్లే సిద్ధించిందనుకోమనండి. రాజకీయబాధ లనుభవించి స్వతంత్రాన్ని తెచ్చినందుకు భూములు పుచ్చుకోమనండి. నావికుల తిరుగుబాటులో పాల్గొని బ్రిటిష్ వాళ్లకి దొరికిపోయిన సైనిక నాయకులువిమైతే నేం? వాళ్లమీద నేరాలుమోపి, వాళ్లని శిక్షించి జైళ్లలో వేస్తే నేం? కఠినశిక్షలు అనుభవించి విడుదలపొంది వాళ్ళు పౌరజీవితంలో భావిభీతిలేని ఉద్యోగాలు దొరక్క అఘోరిస్తూ ఉంటే నేం? అది దేశం అంతగా పట్టించుకోదు. అందుకు వాళ్ళూ ఏమనుకోరు. ఆ తిరుగుబాటురోజుల్లో "మీతోనే ఉన్నాం" అని దేశం అన్నందుకు మాజీ సైనికులు జన్మజన్మలంత సంతోషిస్తారు.

* * *

కేంద్రబడ్జెట్ రక్షణశాఖ డిమాండుపై చర్చ, ఇండియన్ విమానదళం ఇరవై రెండవ జన్మదినంలో జరిగిన వేడుకల వార్తలు చదువుతూఉంటే పై విషయాలు జ్ఞాపకం వచ్చాయి.

* * *

పౌరులకి రైఫిల్ శిక్షణ ఇవ్వడానికి మహావీరత్యాగిగారు ఏర్పాట్లు చేస్తున్నారట. పూర్వం మిలటరీలో చేరమంటూ బ్రిటిష్‌వాళ్ళు భారతీయులకి ఒకరకం ఆశపెట్టేవారు "ఎర్న్ వైల్ యు లెర్న్" "నేర్చుకొంటూనే డబ్బు కూర్చుకోనండి" అని. అతి చక్కని సలహా అది. మనకి స్వతంత్రం వచ్చాక అది మార్చకపోతే బాగుండదని కబోలు త్యాగిగారు. "మీ జేబులో డబ్బులు త్యాగం చేసి నేర్చుకోనండి" అని పౌరులకి ఉద్బోధ చేసేటట్లు ఉన్నారు.

"భారత పౌరులలో ఎవరైనా సరే తగు ఏర్పాట్లు ఉన్న పోలీసులైనుకు వెళ్ళి బాకు ఒక్కొంటికి ఒక అణా చొప్పున మందుగుండు ఖరీదు చెల్లించి రైఫిల్ కాల్చడం నేర్చుకోవచ్చు" అని త్యాగిగారి స్కీము. ప్రజలలో ప్రతిఘటనా శక్తి పెంపొందచేయడంద్వారానే దురాక్రమణను నిరోధించగలమని త్యాగిగారి విశ్వాసం. దురాక్రమణని ప్రతిఘటించినా ప్రతిఘటించక

> తల్లి — ఒరే రాముడూ! నువ్వు మేడమీాద అలా గెంతుతూంటే క్రింద ఎంత చప్పుడవుతోందో ఒక్కసారి యిలా వచ్చి విను.
>
> —సి. వి. జగన్నాధరావు, కాకినాడ.

పోయినా "మీా డబ్బుతో నేతు పాకి పేల్చడం నేర్చుకోనండి" అనే స్కీముని ప్రజలు ప్రతిఘటిస్తారేమో అన్నది నా అనుమానం.

దేశాన్ని రక్షించుకొనే బాధ్యత పౌరులకి లేకపోలేదు. అందుకోసం అంతా మహా వీరత్యాగాలు చేయాలి నిజమే. గాని కష్టాలు ఈషణ్మాత్రం తీర్చటం లేని ప్రభుత్వానికి పన్నులు కట్టడమే మహా త్యాగంగా ఉంటున్నప్పుడు బారుకో అణా తగలెట్టి మందుగుండు తగలెట్టడానికి ఏ పౌరుడు ముందుకొస్తాడు? చెప్పుల మీాదా, వక్కలమీాదా పన్నులు వేస్తున్నారే. అలాగే ఏదోదానిమీాద పన్ను వేసి ఆ డబ్బుతో నిర్బంధ ఉచిత ఆయుధశిక్షణ ఇస్తే పౌరులు సంతోషిస్తారు.

*　　　*　　　*

ఏ కొత్తపన్నులు వెయ్యాలో దేశముఖుగారికి తెలియకపోతే ఆయన కుగ్రామాలలోని పంచాయితీ అధికారుల దగ్గర రెండు రోజులు శిష్యరికం చేస్తే చాలు. అస్సాంలో డిబ్రుఘుర్ సబ్ డివిజన్‌లో చాగువా అనే గ్రామం ఉందట ఆ ఊరి పంచాయితీ అధికారులు పెళ్లిళ్ళమీాద పన్ను వేశారట.

"బహిరంగంగా జరుపుతున్న ప్రతి వివాహానికి అయిదు రూపాయల పన్ను. కాని గాంధర్వ వివాహానికిమాత్రం రెండున్నర రూపాయలు మాత్రమే!"

ఇలా పన్ను వేయడం బాగుంటుం దని ఏ మహానుభావుడికితట్టిందో అతణ్ణి ఒక్కరోజు ఆంధ్రరాష్ట్రానికి ఆర్థికమంత్రిగా పెడితే చాలు. లోటుబడ్జెట్లు అన్నవి ఉండవ్. తెన్నేటి విశ్వనాధంగారు కొత్తపన్నులు దేనిమీాద వెయ్యాలో చెప్పడానికి మొహమాట పడుతున్నారుగాని ఈ పంచాయితీ వాళ్లనుంచి ఆయన నేర్చుకోవలసినది చాలా ఉన్నట్టు కనబడుతోంది.


*　　　*　　　*

ఆంధ్రా ఆర్థికమంత్రి చేసిన బడ్జెటు విందులో గవర్నర్ త్రివేదిగారు పత్రికా విలేఖర్లను కలుసుకొని "ఆశ్చర్యకరమైన వార్తలేమీా లేవు" అని చిరునవ్వుతో అన్నారట! పాపం! గవర్నర్ గారికి పాత్రికేయుల సత్తా తెలియదా! "ఆశ్చర్యకరమైనవార్తలు లేవు"అన్న వార్తనే చాలా ఆశ్చర్యకరమైన వార్తగా ప్రకటించ గల చాకచక్యం తలచుకొంటే పాత్రికేయులకి లేకపోలేదు చూడండి. మన విమానదళం ఇరవైరెండో జన్మదినం వేడుకలు ఢిల్లీకి పధ్నాలుగుమైళ్ల దూరంలో జరిగేయి. అక్కడికి ఢిల్లీనుంచి వెళ్ళడానికి ఆ స్పెషల్ బస్సు పట్టదుగాని ఊరు ఊరంతా అక్కడికే ఎగబడడంచేత తొడతొక్కిడి ఏర్పడి కొంతమంది పాత్రికేయులు అక్కడికి చేరుకొనడానికి వీల్లేకపోయింది. అయితే వాళ్ళు "అయ్యో అది చూడలేకపోయామే!" అని విచారించి కాగితాలు జేబులో పెట్టుకొని కూర్చున్నారా? అబ్బే! ఆ తొడతొక్కిడి రాకపోకల రద్దీనే వర్ణించి అదొక పెద్ద వార్తగా రెండుమూడు కాలమ్సు రాశారు! పాత్రికేయుడు తలచుకొంటే పుట్టించలేని వార్తంటూ లేదు.

*　　　*　　　*

కొసమెరుపు:—ఆశావాదికి నిర్వచనం! పొడుగాటి 'క్యూ' లో ఆఖరున నిలబడ్డ వాడివెనక నిలబడేవాడు. ★


దినదినమునకు ఇంక స్వచ్ఛమైనటువంటియు, ఇంక మనోహరమైనటువంటియునైన చర్మము




కేడిల్‌తోగూడిన రెక్సోనాతో ఈ అద్భుతమైన మార్పును మీరు మెచ్చుకొంటారు

రెక్సోనాయొక్క కేడిల్‌తోగూడుకొన్న నురగను మీ చర్మముమీద మెల్లగా రుద్ది తరువాత కడిగివేయండి. మీ చర్మము దిన దినమునకు ఇంక మృదువుగాను, ఇంక మెత్తగాను అగుటను మీరు చూస్తారు మరియు మీరు క్రొత్త ఆకర్షతను మెచ్చుకొంటారు.

రెక్సోనా*

ఇది ఒక్కటే కేడిల్‌తో గూడిన సబ్బు

★ చర్మమును పోషించేటటువంటియు, చర్మమును మెత్తగాచేయునటువంటియునైన నూనెల ఒక ప్రత్యేక మిశ్రమమునకు రిజిస్టర్డ్ పేరు.

R.P. 217-50 TL

రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ వారి తరఫున ఇండియాలో తయారుచేయబడినది




"తమరు 'పాఠశాల పత్రికలు, వాని రచనలు' పై వ్రాసిన విమర్శలు చదివాను. అవి, నా దృష్టిలో, పాఠశాల పత్రికలు నడిపెడివారికి ఎంతో వుపకరిస్తవని నమ్మకం. ఇందువెంట మా పాఠశాల పత్రికలు కూడా పంపుతున్నాను... తాము మాకు సలహా ఇస్తారని నమ్మిక"

అని ఒక సెకండరీ స్కూలు పత్రికని ఒకరు నాకు ఆదరంతో పంపించారు. నాతో ఏకీభవించే వారి పత్రిక కదా అని ఏమి లేమిటో, ఎంతెంతో ఆశించి ఆ పత్రిక విప్పాను. ఆదిలోనే హంసపాదు 'మామాట' అని వారు వ్రాసిన తొలిపలుకు చదవగానే నిలువునా నీరవకపోయినా, అడ్డంగా వాడలి పోకపోయినా, కొద్దిగా బాధ పడ్డాను.

ఏమంటే గిడుగు రామ్మూర్తి పంతులు గారు పెట్టిన భిక్ష అక్షయం. వారి ధర్మమా అని వ్యావహారిక భాషాధ్వజం ఎదురు లేకుండా ఎగురుతూంది. ఇవాళ ఎక్కడ చూసినా వాడుక భాషే. (పాఠ్యగ్రంథాలలో పరీక్షా పత్రాలలో తప్ప) పాఠశాలలలో, కళాశాలలో అధికారరీత్యా గ్రాంధిక భాషే చెలామణీ అవుతున్నా చాలామంది వాడుక భాషనే ఆదరిస్తున్నారనిపిస్తోంది. ఆధునికులు నమ్మకం లేకపోయినా తద్దినాలు పెడుతున్నట్టు, యజ్ఞోపవీతాలు వేసుకొంటున్నట్టు, ఇష్టంలేకపోయినా పరీక్షలలో విద్యార్థులు వచ్చీరాని గ్రాంధిక భాషలో సమాధానాలు రాస్తున్నారు. పండితులుకూడా ఉదారంగా ఉంటున్నారు. విశ్వవిద్యాలయంవారు ఇవాళ కాకపోతే రేపైనా గ్రాంధికభాషకి స్వస్తి చెప్తారని అంతా ఎదురుచూస్తున్నారు.

గాని నాకు ఆదరంతో ప్రతిని పంపించిన సెకండరీ స్కూలు పత్రికవాళ్లు మట్టుకూ ఇంకా గ్రాంధికవాదులే. వారు ఆ పత్రిక తొలిపలుకులో ఇలా వ్రాస్తున్నారు.

"మన దౌర్భాగ్యమున నాంధ్రమున అందరు వ్యాకర్తలే! 'వాడువస్తాడు' 'వచ్చేను' 'వస్తా' అన్నియు రూపములే. ఇటువి బాలుర కలవఱుటయే పరీక్షలలోఁ దప్పుటకుఁ గారణము. విద్యార్థులీ త్రోవను బట్టనిసాఁజే భాషావికాసమున కర్థమున్నది."

గాని (పాపం!) విద్యార్థులీ త్రోవని పట్టేస్తున్నారు. అందుకు కారణం అందరికి తెలిసిందే. షెర్లాక్ హోమ్సు మాటల్లో చెప్పాలంటే 'ఈ కారణం బొత్తిగా ప్రాథమికం.' నిత్యం వ్యవహారంలో ఉండే మాటలు పొమ్మన్నా పోవు. వ్యవహారంలో లేని రూపాలు రమ్మన్నా రావు. మాటలాడడం మొదలెట్టిన దగ్గర్నుంచి పిల్లలు వాళ్ళ చుట్టుపక్కల నలుగురూ ఎలా మాట్లాడుతున్నారో ఆ రూపాలనే అలవర్చుకొంటారు. విద్యార్థులీ (చెడ) త్రోవను బట్టడానికి ఈ సెకండరీ స్కూలు వారు మట్టుకూ వేరే కారణాలు చూపిస్తున్నారు. వాళ్ల ఉద్దేశంలో అవి ఏమిటంటే–

"...కారణము, నేటి అభ్యుదయ రచనలు, పత్రికలు. బాలురకు బారశాలా వాతావరణము వేరు. పాఠశాలలలో గట్టుబాటుతో రచనాపద్ధతులు నేర్పబడుచున్నను బైట వాతావరణము కబంధునివలె నప్పళించుచున్నది. దీనిలోబడి బాలురు తెలియక చెడుచున్నారు."

నేటి అభ్యుదయ రచనలు, పత్రికలు బాలుర్ని ఎంతవరకు చెడగొడుతున్నాయో అసలు, చెడగొడుతున్నాయో లేక బాగు చేస్తున్నాయో ఒక ప్రవీణుల సంఘం విచారించవలసిన విషయం. పాఠశాల ఉపాధ్యాయులు సాధికారంగా ఇలా ప్రకటిస్తూ ఉండడంచేత దీన్ని కొంచెం గమనించాలి. 'వాడు వస్తాడు' 'వచ్చేను' 'వస్తా' అనే రూపాలు రాయడమే చెడగొట్టడం అంటే మట్టుకూ సహృదయులెవరూ సమ్మతించి 'సై' అనలేరు. ఈ సెకండరీస్కూలు వాళ్ల ఉద్దేశంలో ఇదే ఆ చెడగొట్టడం అయి ఉంటుంది ఏమంటే వారు "ఆ దుమారము కొంతవర కిచట నడఁచఁబడినది" అని చెప్పుకొంటున్నారు. అందుకు తగినట్టుగానే వారు "కట్టుబాటుతో నేర్పిన రచనా పద్ధతుల"లోనే పత్రికలోని రచనలన్నీ ఉన్నాయి.

ఎంత అణచివేసినా, ఎన్ని కట్టుబాట్లలలో పెట్టినా ఏంలాభం! సహజంగావచ్చే వ్యవహారికభాష ఎలా పోతుంది? ఆ పత్రికలోనే "పిలుస్తుంటారు" "అంటూంటారు" అనే రూపాలు దొర్లాయి. ఒక తప్పు లేకుండా గ్రాంధికభాష రాయడం బ్రహ్మదేవుడితరంకూడా కాదు. గిడుగు రామ్మూర్తి పంతులు గారు 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం' ప్రస్తావనలో ఇలాఅన్నారు. "గ్రంథకర్తలకు రాదు, గ్రంథవిమర్శకులకు రాదు, గ్రంథపాఠకులకు, మరి ఈ గ్రాంధిక భాష వచ్చినవారు ఎవరున్నారో, ఎక్కడ నున్నారో నాకు తెలియదు"

గ్రాంధిక భాషావాదులకన్నా ఎక్కువగా ఆభాష వచ్చిన రామ్మూర్తి పంతులుగారే "నాకు గ్రాంధికాంధ్రము పూర్తిగా రాదండీ. వచ్చీరాని భాషలో స్వేచ్ఛగా రచన సాగదు. భావాలు స్పష్టంగా తెలియ చెప్పడం కష్టము. ఎంత జాగ్రత్తగాఉన్నా


## రాజామలక తైలము

అతిజాగ్రత్తతో తయారైన యీ అభ్యంగన తైలం, మృదువైన ద్రవ్యములద్వారా పరిమళవంతముచేయబడినది ఇది మెదడుకు చలువచేయుటేకాకుండా, చర్మమునకు మృదుత్వము యిచ్చును. చర్మముమంటలు, తలలోచుండు యితర చర్మవ్యాధులు, పోగొట్టును. జ్ఞాపక శక్తి వృద్ధి చేయును. శరీరంలోని వేడి తగ్గించును. విద్యార్థులకు, ఆలోచనాపరులకు చాలా మంచిది. ఇతరులు స్నానానికి, తలకు వాడవచ్చును.

ఆయుర్వేదాచార్య ఎ. మాధవ మేనన్, AMAC's

మలబార్ ఆయుర్వేదిక్ స్టోర్సు
107-108, బ్రాడ్వే
మదరాసు-1

ఫోన్: 4116



## తోడుదొంగలు

—ఫోటో: వి. తంబి (కర్నూలు)

తప్పులు పడవచ్చును" అన్నారు. అంతతో వారు ఊరుకోలేదు "సిగ్గు లజ్జా ఉన్నవాళ్లయితే మనవంటివాళ్లు 'గ్రాంథికభాషలో' గ్రంథాలు రచించకూడదండీ అపరిచితమైనభాష వాడినప్పుడు ప్రమాదము సంభవించక మానదు.. నిత్యమూ వాడుకలో నే భాషలోనైనా చక్కగా అభ్యాసము చేసుకొంటేనేగాని వాక్యవిన్యాసము కుదురుగా ఉండదు. ఔచిత్యము అనౌచిత్యము లోకమునుపట్టి తెలుసుకోవలెను." ఇది పంతులుగారు చెప్పిన సత్యం.

ఈ సెకెండరీ స్కూలువారుకూడా మరీ కరడుకట్టిన గ్రాంథిక వాదులవలె లేరు. హృదయంలో మంచివాళ్ళవలె కనబడుతూ నేవున్నారు (వ్యావహారిక) "భాషతో పనిలేదని మా తాత్పర్యముకాదు. వామహస్తమని సటకి వేసికొనువారుందురా? స్థానాస్థానముల నరయఁజేయుటయే యుపాధ్యాయుల కర్తవ్యము" అని ఆ తొలిపలుకులోనే రాశారు అయితే ఏది స్థానం? ఏది అస్థానం? ఏది వామహస్తం నా వృద్ధే కంలో 'కృతకభాషే' వామహస్తం ఎడమ చెయ్యికదా అని సరకవంసిన అవివేకం చెయ్యకుండా దాన్ని పాత పుస్తకాల గోరీలలో శాంతియుతంగా పడుకోనివ్వడమే మేలు.

"పరీక్షలలో బాలురు తప్పకుండా ఉండడమే" పరమార్థంగా పెట్టుకొన్న

ఉపాధ్యాయులు వాడుకభాష అస్థానమని అనుకోడంలో తప్పులేదేమోగాని విశ్వవిద్యాలయంవాళ్ళు వ్యావహారిక భాషని ఒప్పుకొంటే అదే 'స్థానం' అవుతుంది. అంతదాకా పరీక్షలలో మట్టుకూ ఈ 'తప్పని సరి తద్దినపు' గ్రాంధిక భాష వదలిపెట్టరు. అది వదలిపెట్టేదాకా ఉపాధ్యాయుల కర్తవ్యం ఒకటి ఉందని నా నమ్మకం.

రామ్మూర్తి పంతులుగారు చెప్పినట్టు "నిత్యమూ వాడుకొనే భాషలోనైనా చక్కగా అభ్యాసము చేసుకొంటేనేగాని వాక్యవిన్యాసము కుదురుగా ఉండదు" కొబట్టి బాలుర వాక్యవిన్యాసము కుదురుగా ఉండడానికి వీలుగా వాళ్లని వాడుక భాషలోనే రచనలు రాయనిచ్చి వాటిని పాఠశాల పత్రికలలో ప్రచురించడం మంచిదని నా అభిప్రాయం.

* * *

అసలు గోపాలరెడ్డిగారు ప్రోఛాన్సలర్ గా అయినప్పుడే విశ్వవిద్యాలయంలో వాడుకభాషకున్న దేవిడీమన్నా తప్పుతుందని పొరపాటున అనుకున్నాను. గోపాలరెడ్డిగారు రవీంద్రనాథ ఠాగూరుగారి భక్తులు, శిష్యులు. గిడుగు రామ్మూర్తి పంతులుగారు తమ వ్యావహారిక భాషావాదాన్ని ప్రచారం చెయ్యడానికి ఠాగూరుగారి వ్యాసాలని ఉదహరించారు. 'పండిత ప్రకాండుల అర్థంలేని కృతకభాషవల్ల పిల్లలు చెడిపోతున్నారని' రవీంద్రుల వాదం. గురుదేవుడి పుణ్యమా అని బెంగాలీవాళ్ళకి కృతకభాష బెడద తప్పింది ఆ ఠాగూరుగారి శిష్యులైన గోపాలరెడ్డిగారు ప్రోఛాన్సలర్ అయ్యాక కూడా వాడుకభాషని విశ్వవిద్యాలయం వెలివెయ్యడంలో కారణాలు ఏమిటో ?

రవీంద్ర సాహిత్యాన్ని గోపాలరెడ్డిగారు తెలుగులోకి అనువదించారుగాని రవీంద్రుడి వ్యావహారిక వాదాన్ని జీవితంలో అనుసరించేటట్టు లేదు. ఏమంటే ఈ అనువాదాలు ఫస్టు గ్రాంధికంలోనే ఉన్నాయి ఇంక గోపాలరెడ్డిగారివల్ల వ్యావహారిక భాషావాదానికి ఏమైనా మేలు చేకూర్తుందని ఆశించకూడదేమో! లేక ఆశించవచ్చా?

* * *

పార్లమెంటులో హరీంద్రనాథ ఛట్టోపాధ్యాయ, స్టేట్ కౌన్సిల్ లో పృథ్వీరాజ్ కపూర్ ఎప్పుడైనా మాట్లాడుతారా అని ఒకటే ఎదురుచూస్తున్నాను. ఇప్పటిదాకా పృథ్వీరాజ్ మాట్లాడినట్టు చెప్పుకోదగ్గ వార్త ఏదీ పడలేదు. ఎప్పుడో ఏడాదికిందట రైల్వే బడ్జెటులో హరీన్ ఛలోక్తిగా ఒక 'ప్రాసక్రీడ' పద్యం చెప్పినట్టు పేపర్లు ప్రచురించాయి. మన తెలుగు పత్రికలు ఆపద్యాన్ని అనువాదంకూడా చేశాయి ఆతరవాత అడపా దడపా కమ్యూనిష్టులు పార్లమెంటులోంచి 'వాకౌట్' ప్రదర్శనం చేసినప్పుడు వాళ్ళతోపాటు బయటికి వెళ్ళడం లోపలకి రావడంతప్ప, అంతకన్న మరేదీ హరీన్ చేసినట్టేలేదు పార్లమెంటులో అతడి గొంతుక మూగబోవడం చూసి నేను చాలావిచారించాను. ఏమీ మాట్లాడడే అని తెగ మధనపడ్డాను.

ఉన్నట్టుండి హరీన్ 'హైడ్రోజన్ బాంబు' లాంటి ఉపన్యాసం చేశాడు. ఆయన తరవాత ఆ సభలో ప్రసంగించిన వారంతా సమాచార ప్రచురణ శాఖ కార్యక్రమంపై చర్చలు జరపడానికి మారు చటోపాధ్యాయనే ప్రధాన విమర్శ విషయంగా తీసుకొన్నారట! "ఆయన ప్రసంగం వింటున్నప్పుడు ఒకొక్క సమయంలో ఆయన స్పృహతోనే మాట్లాడుతున్నాడా అని తనకు అనుమానం కలిగిందని" శ్రీమతి ఉమా నెహ్రూ అన్నదట!

అంతా హరీన్ మీద విరుచుకుపడ్డారుగాని అతని ప్రసంగంలోని వేడిని క్షమించి అందులోని విషయాలని కొంచెం సహృదయతతో చూస్తే కొన్ని నిజమైన సంగతులు లేకపోలేదు. కేస్కార్ గారి విధానాలు వెర్రితలలు వెయ్యడం అందరికీ విదితమే. అదీకాక తను చెప్పినదంతా ఋజువు తస్తానని హరీన్ సవాలుకూడా చేస్తున్నాడు. సమాచార ప్రచురణ శాఖ కార్యకలాపాలని ముఖ్యంగా డాక్టర్ కేస్కార్ హయాం వచ్చాక జరిగినవాటిని పరిశీలించడానికి పార్లమెంటరీ కమిషన్ ఒకటి వేయమంటున్నాడు. ప్రవీణుల సంఘాన్ని వెయ్యకూడదూ?

* * *

వెయ్యరులెండి వేసినా ఏంలాభం? పద్దెనిమిది మాసాలకిందట ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిశీలనకు ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించారట. ఆ సంఘం ఇవాళదాకా సమావేశమైతే ఒట్టు! ఈ సంఘంయొక్క వ్యవహారమంతా నవ్వులాటగా మారిందని సాక్షాత్తూ శ్రీ కట్జూగారే పార్లమెంటులో చెప్పారు. ఇలా ఉంటాయి ప్రత్యేక పరిశీలనా సంఘాలు!

ఏయే మార్గాలు అవలంబించితే ప్రత్యేక పరిశీలనా సంఘాలు తొందరగా పరిశీలనలు చేసి తమ నివేదికలు అందచేస్తాయో తెలుసుకోడానికి ఒక ప్రత్యేక పరిశీలనా సంఘాన్ని ఏర్పాటుచేస్తేనేగాని ఇజం తెరిపిన పడేటట్టులేదు !

* * *

మా ఎదురింట్లో దంపతులు చాలా అన్యోన్యంగా ఉండేవారు. భార్యారత్నం భర్తగారి నెత్తిమీద ప్రేమతో కనీసం రోజుకొక కుండైనా బద్దలు కొడుతూ ఉండేది. ఆ మగడు పక్షిగాడు తగిలిన గాయాలకి తగినన్ని కట్లు ఎక్కడో కట్టించుకొని వచ్చేవాడు. ఆ కట్లు చూశాక భార్యారత్నంగారి ఏడుపు కట్లు తెంచుకొనేది. "నా చేతులు పడిపోనూ! అయ్యో నా చేతులు పడిపోనూ! ఈ కట్లు కట్టడం నా కొస్తే దెబ్బతగలగానే నేనే కట్టేదాన్నిగా!" అని ఆమె వాపోయేది. వాపులు పోయాక భర్తగారికి మరి నాలుగు తగలనిచ్చేది.

నిజమే! ఆవిడగారికి కట్లుకట్టడం వస్తే ఎంత బాగుంటుంది. కత్తిపీటతో చెయ్యి కోసుకొంటే కుంకం పెట్టడం—వంటింట్లో చెయ్యి కాలితే నూనెరాయడం—ద్వారబంధం తగిలి బొప్పికడితే పట్టువేయడం ఇలాంటి ప్రథమచికిత్సలే మన ఆడవాళ్ళకి వచ్చు. అంతకన్నా హెచ్చు తెలియడానికి ప్రస్తుతం ఆస్కారాలు లేవు.

అయితే ఇంకో పదేళ్లుపోయాక, కాపరానికొచ్చే ఆడవాళ్ళు హైద్రాబాద్ రాష్ట్రంలో ఆరితేరిన నర్సులుగా ఉంటారేమో అని ఆశగా ఉంది. ఏమంటే "ఉన్నత పాఠశాలలలోని విద్యార్థినులకు నర్సింగ్ కోర్సు నిర్బంధం చెయ్యాలి"లని బూర్గుల రామకృష్ణరావుగారు ఆలోచిస్తున్నారు. "దీనివల్ల నర్సుల కొరత తగ్గటమే కాక విద్యార్థినులు అనంతరం తగిన తల్లులు కావడానికి వీలుందని" వారు భావిస్తున్నారు. శుభస్య శీఘ్రం! ఆడపిల్లలకి నిర్బంధంగా నర్సింగ్ శిక్షణ ఇవ్వాల్సిందే!


గాని నాకొక అనుమానం ఉంది. "మాన్యువల్ ట్రైనింగ్" పేర వడ్రంగం అవీ నేర్పుతారు. వారానికో గంట నేర్చుకొని, రెండేళ్ళు కష్టపడి, ఒక అద్దుకాగితాల చెక్క, ఒక కవ్వం, ఒక వ్యాసపీఠం చెయ్యడం మగపిల్లలు నేర్చుకుంటున్నారు. జీవితంలో ప్రవేశించాక పడకకుర్చీ విరిగిపోయినా, ముక్కాలుపీట కోడు ఊడినా వడ్రంగిని కేకేయాల్సి వస్తున్నది ఆడపిల్లలకి నిర్బంధంగా నేర్పే నర్సింగ్ శిక్షణ కూడా, ఈ మాదిరిగానే ఉపయోగపడుతుందేమో చూడాలి! ★


## రెండు మహానగరాలు

**Tale of Two Cities**

వెల: **3-0-0.**

ఆంధ్ర గ్రంథమాల,



# కుర్చీలో కూనిరాగం

ఆరుద్ర

"కుర్చీలు విరిగిపోతే
కూర్చోడం మానినట్లు కొత్తరచనలన్
కూర్చెడి శక్తి నశిస్తే
చేర్చెద నొకయింత చెత్త సిరిసిరి మువ్వా!"

అని మును పెపుడో శ్రీశ్రీ
ధ్వనించెగానీ, హుషారు వార్తలు నైతో
పనికట్టుకు పది పేజీ
ల నింపిన శివ! శివ! పతితలను చంపడమే.

నా కుర్చీ విరిగినచో
ఏ కుర్చైనను చాలు, ఎంచేతంటే,
నాకంతం విడు సేకు
ర్చీ కనపడినా కలం కుషీగా ఉంటే.

ఈ వారం తలభారం!
ఏ పేవో రాయబోయి ఏదో రాస్తే
భావాలు తీర్థమై పో
గా వర్ధు ప్రసాదమాను కనుక సహిస్తే!

పట్టావూ అంటే పెద్దడాక్టరు గారికి చూపించి ఉన్న ఆ కొస్త అనుమానం తీర్చుకోవచ్చు నూతుంది!"

బావగారిమాట చెవిని పడగానే ఆమె లేచి, బీరువామూలకుపోయి అంతా విన్నది. ఏమీ బదులాడకుండా తలదించేసుకుంది!

ఆ రాత్రంతా ఆమెకు నిద్ర పట్టలేదు. సగంరాత్రయేసరికి లేచికూచుంది. నుదురూ, శరీరమూ వేడిగా వున్నట్టనుభవించింది. గొంతులో ఏదో వుండ చుట్టుకున్నట్టుంటే గట్టిగా దగ్గింది! కఫం బయటికొచ్చింది! దీపంవెలుగులో చూసింది! అందులో ఆమెకేమీ కనిపించలేదు! కొస్త ఎఱ్ఱజీరయినా ఆమె కందులో కనిపించలేదు! మనసుకు కొస్త వూరట కలిగింది! చేతులుకడుక్కొని దీపంఆర్పి ప్రక్కమీద వాలిపోయింది!

మర్నాటి వుదయం శారదాంబ ఒక వుత్తరం ఆమె కందిస్తూ "నమ్మలేనివో నువ్వు పరాయివాళ్లుగా చూస్తున్నావు! మీ నాన్నగారేం రాశారో చూడు!" అని వెళ్లిపోయింది.

ఆ వుత్తరం సోమేశ్వరరావు పేర వ్రాసి ఉంది.

"ఉభయకుశలోపరి! మీరు రాసిన ఉత్తరం అందింది. కమల స్థితికి విచారిస్తున్నాం! దాన్నిక్కడకు తీసుకురావటానికేమీ అభ్యంతరంలేదు. కాని ఇది ఉత్త పల్లెటూరు! మందూ మాకూ యిచ్చేవాళ్ళు లేరు! అంతా నాటువైద్యం! ఇది మీకు తెలియందికాదు. కనుక దాన్నక్కడుంచే తగిన యేర్పాట్లు చేయకోరిక! ఇంటివగ్గఱకన్నా ఆస్పత్రిలో చేర్పించటమే అన్ని విధాలా మంచిది. ఇలా రాశానని వేరే విధంగా తలంచరని అనుకుంటున్నాను. వీలయినంత త్వరలో మందు ఖర్చులకు ఏమయినా పంపిస్తున్నాను.

వెంకటేశ్వర్లు."

అది చదివి కమల కుప్పపెట్టున కూలిపోయింది. కన్నతండ్రే యిలాంటి వుద్దేశం కనబర్చినప్పుడు మిగిలినవాళ్లెలా ప్రవర్తిస్తారు? నిజంవాడుకోవాల్సొస్తే ఆ కన్నవారికన్నా ఈ అత్తవారే లక్షురెట్లు నయం!

మర్నాడు సోమేశ్వరరావు మోటారు తెప్పించి వాకిట్లో ఉంచినాడు. కమల పల్లెత్తు మాటాడకుండా వెళ్ళి అందులో కూచుంది. పెద్దాసుపత్రిలో మెడికలాఫీసరు టి బి. స్పెషలిస్టు, లేడీ డాక్టరు ఆమెను పరీక్షించారు! ఎక్సరే తీసి ఇంటికి పంపించి వేశారు.

మూడోనాటికి ఫొటోలొచ్చాయి! సోమేశ్వరరావు శారదాంబలు ఆతృతతో వాటిని చూశారు! కమలకూడ అక్కడే వుంది! రెండు నిముషాలు పరీక్షించాక సోమేశ్వరరావు వాటిని కమల కందించి తలదించివేశాడు!

"ఫొటోల దిగువ ఏంవిటి రాసివుంది?" శారదాంబ ప్రశ్నించింది.

"నథింగ్ స్పెషల్ ఫౌండ్" అని అతను మెల్లగా అన్నాడు.

"అంటే?" తిరుగా శారదాంబ అడిగింది!

"జబ్బులో విశేష గుణంలేదు. మామూలు దగ్గు - జ్వరమూనూ." అని అతడు బయటికి వెళిపోయాడు!

'లోకం పోకడ ఇలానే వుంటుందికాబోలును' అనుకొని కమల శాంతిపూర్వకంగా నిట్టూర్చింది.

★

## సవరణ

గతవారం సంచిక 10-వ పేజీలో ప్రచురించబడిన 'తోడు దొంగలు' అను ఫోటోను పంపినవారు వి. తంబిగారు కాదనీ, న్యూఢిల్లీనుంచి శ్రీ టి. జగన్నాథాచార్యగారు పంపారనీ గుర్తించ ప్రార్థన. —సం.

**ఆరుద్ర**

"లలాటాన కుంకుమాగ్ని
భుజంమీద బుబ్బుదుబ్బు
కాళ్ళకింద కిర్రు చెప్పు
అగ్నోస్త్రం పాడుంకాయ
అవధి లేని అవధానం
వెళిపోయిం వెళిపోయింది"

అని ఒకటింపావు పుస్తకాల కిందటే జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి వాపోయాడు. నిజమే! ఆశు కవిత్వాలకీ, అవధానాలకీ ఇవి రోజులు కావు. ఆ యుగం అంతరించిందా అనిపిస్తుంది. తిరుపతి కవుల ధర్మమా అని రెండు తరాల కిందటదాకా, ఊరికి కనీసం ఇద్దరు జంటకవుల ముఠాలు, వీధికో ఆశుకవి పూర్వం మనకి ఉండేవారు. నెలాళ్ళ కొకసారైనా ఏదో అవధానం ఉండేది. ఆ వాయస స్వర్ణయుగం అయిపోయింది.

జంటకవిత్వం, ఆశుకవిత్వం ఆరోజుల్లో మరీ వెర్రి తలలు వేసి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు కంఠాభరణంలో గేలి చేయవలసినంత, చేసినంత దుస్థితికి వెళింది. 'భేడా ఇశ్వేదవు గేడ పేడా! భరలోన్' అనే పద్ధతిలోనే చిల్లర కవిత్వం దిగిపోయింది. ఆశుకవులన్నా అవధానం చేసేవాళ్ళన్నా చిన్నచూపు, అగౌరవం, అంటరానితనం మొదలైనవి ఈరోజుల్లో పరిపాటి అయిపోయింది.

కాని ఆశుకవిత్వాన్నీ అవధానాన్నీ అంతగా కొట్టిపారెయ్యకూడదు ఈ విద్య అంతరించకూడదు. సమర్థులైనవాళ్లు ఆశుకవిత్వం చెపుతూఉంటే సదస్యులకి షడ్రసోపేతమైన భోజనం చేసినట్టు ఉండక తప్పదు.

సర్వసామాన్యులకి ఎవరైనా కవిగారిని పరిచయం చేస్తున్నప్పుడు – "కవిగారూ – ఆ చీపురుకట్టమీద పద్యం చెప్పండి – ఈ గొంగళీపురుగుమీద కవిత్వం కట్టండి" అని అడగడం ఆ సర్వసామాన్యులకి సర్వసామాన్యం. ఇలాగ మామూళ్ళు విషయాల మీద కావ్యవస్తువులు కాని వాటి మీద పద్యాలు చెప్పమంటే భావకవులకి కోపం రావచ్చు. ఆధునిక కవులు అలా చెప్పడానికి ఇష్టపడకపోవచ్చు గాని చెప్పగలగడం మంచిది. చెప్తే మరీ మంచిది.

శ్రీశ్రీ చెప్పినట్టు
"అగ్గిపుల్లా
సబ్బుబిళ్లా
కుక్కపిల్లా
కాదేదీ కవితకనర్హం
ఔనౌను శిల్పమనర్ఘం"

చెప్పగలిగినవాడుంటే దేనిమీదైనా పద్యం చెప్పగలడు. ప్రజలను రంజింపచెయ్యడం కవిత్వంయొక్క బహు ప్రయోజనాలలో ఒకటి. చిత్రకవిత్వం, సాముగరిడీలు, సమస్యా పూరణాలు మొదలైనవి కూడా సజీవంగా ఉండాలి. వాటిని ప్రాక్టీసుచేసి ప్రజలలో కవితాశక్తిని ప్రదర్శించి, కవితాసక్తిని పెంపొందింపగే కవులు ఉండాలి.

అందుకే మొన్న కర్నూలులో ఎవరో ఆశు కవిగారికి సన్మానం జరిగిందని చదవగానే ప్రాణం లేచొచ్చింది. ప్రతి ఊళ్ళో మూడునెలల కొకసారైనా ఆశుకవిత్వ ప్రదర్శనాలు, అవధానాలు జరిపించి ఆ కవులకి తగు రీతిగా సన్మానాలు చేయిస్తే చాలా మంచిది

ఆధునిక కవిసమ్మేళనాలు కావ్యపఠనాలు జరిగే ఈరోజుల్లో ఇలాగ పాతపద్ధతిలో అవధానాలు అవీ జరిపించడం, సత్కారాన్ని వెనక్కి తిప్పడం అని భావించకూడదు. కవిత్వంలో ప్రజలు స్వయంగా పాల్గొనే పద్ధతి అవధానం. ఉత్సాహం ఉన్నవాళ్లు ఒక సమస్య ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. లేదా "పూలదండ" "మాలముండ" "కొత్తకుండ" "గోలకొండ" లాంటి ఏవో మాటలుపెట్టి పద్యం అల్లమంటారు అదికూడా అడగలేనివారు ఏదో మామూళ్ళు విషయంమీద ఏదో పద్యం చెప్పించుకొంటారు. ఏమైనా ప్రజలు సంతోషించేది అవధానం. దాన్ని పునరుద్ధరించడం ఆరకం కవుల ధర్మం. ఆ కవులని ప్రోత్సహించి పోషించడం ప్రజల విధి!

* * *

సుభద్రా బలభద్ర సమేతుడైన శ్రీ జగన్నాథుడు రథంమీద వేంచేయించి-యాత్ర సాగించి, గుడిసన్న గుళ్ళకివెళ్ళి అక్కడ ఒక పదిరోజులు కేంపు ఖరాయిస్తాడు. బండి జగడిలాంటి మన ఆంధ్ర ప్రభుత్వం కూడా వేసవిలో రథయాత్ర లాంటి పొగబండీ యాత్ర చేసి, గుడిసన్న గుళ్ళలాంటి పెద్ద వాల్తేరు కాలేజీ భవనాలలో కచేరీ పెట్టుకొని కేంపు ఖరాయిస్తుందట! శ్రీ జగన్నాథుడు ఆ పది రోజులు అక్కడ వేంచేసినమీదట పూజారులు రోజుకో అవతారం చొప్పున స్వామివారికి దశావతారాలు అలంకరించుతారు. మన ఆంధ్రప్రభుత్వం మట్టుకూ వాల్తేరులో ఉన్నంతకాలం రోజుకో అవతారం దాల్చకుండా ఉంటే చాలు!

రాజధాని రావలసినది అది ఎగిరిపోయింది. పోనీ హైకోర్టు వస్తుందా అంటే ఆ కోరికా విరిగిపోయింది. విశాఖపట్నం వాళ్లకి వళ్ళు మండి - ఏడుపొస్తున్నది. "నేను విశాఖపట్నం వొదలిపెట్టేసి చెన్నపట్నానికి శాశ్వతంగాయి వెళిపొచ్చేసినా నా అంతరాత్మ అక్కడే తచ్చాడుతూ ఉంటుంది. కాబట్టి మాఊరివాళ్ల లోలోపలి ఏడుపు వినిపించేస్తూఉంటుంది" వాంఛూ వాంఛించినా మా ఊరుకి ఏ ఒక్కటీ ఇవ్వకపోతే మా విస్సినాదంగారు ఊరుకొంటారా?

'భ్రష్టులార పతితులారా
విశాఖపట్నం వాసులారా
దగాపడిన తమ్ములార
ఏడవకం ఏడవకం
ఏడవకండి!
వొస్తున్నాయ్ వొస్తున్నాయ్
వొస్తున్నాయ్ వొస్తున్నాయ్
జగన్నాథ రథచక్రా
లొస్తున్నాయ్ ఒస్తున్నాయ్"

అని వేసవి ప్రభుత్వ రథ చక్రాలని తుమ్మెదల మెట్టదగ్గర చినవాల్తేరులోదింపి - ఎర్ర మంటిదిబ్బల పెదవాల్తేరు పట్టిస్తున్నారు. అయితే ఒక్కందుకు నాకు విచారం! నానాకాలం చదువు ఎంత ప్రయోజనకారో ఎండాకాలం రాజధాని కూడా అంతేకదా అని నా మనవి! ఆంధ్రదేశంలో ఎండలులేనిచోటు ఎక్కడుంది. (మదనపల్లి తప్పించి). శాసనసభ్యులు అకర్నూలులో కూర్చొని పబ్లిగ్గా తగాదాల మలిన వస్త్రాలు ఉతుక్కోవడమే మంచిదేమో

* * *

హోవెన్‌లో చిన్న నేషనల్ కాంగ్రెసు లేవదీసి దేవుడిగారి పవర్సు తాను తీసుకొని గిరీశం ఆంధ్రదేశానికి ... వచ్చే కొన్ని ప్రణాళికలు అమలు జరుపుతానన్నాడు. అవి వరసగా: ఒకటి— ఈస్టరన్ ఘాట్స్ అనగా మన తూర్పు

(౫౩-వ పేజీ చూడండి)

తెల్లవారుఝామున మూడు గంటలప్పుడు డాక్టరుగారింట్లో టెలిఫోన్ మోగింది. మంచి నిద్రలో వున్న డాక్టరుగారు మెలకువ తెచ్చుకొని లేచివచ్చి రిసీవర్ ఎత్తి చెవులో పెట్టుకొన్నాడు.

"డాక్టరుగారూ! నిద్రపట్టటం లేదండీ" అని ఒక గొంతుక ఆయన చెవుల్లో గొణిగింది.

"అల్లాగా! అయితే టెలిఫోన్ అలాగేపట్టుకునివుండండి; - జోలపాట పాడతాను!"

తం పులమారి! ఇక్కడి వక్కడా, అక్కడి వక్కడాచేరేసి ..వాళ్లకి వీళ్లకిమధ్య రాయబారం నడిపి తగూలాడుకుంటే చూడాలని ఏడుస్తోంది "ఇంగాంటి వాళ్లని మెడబట్టుకు గెంటెయ్యాలి" - సుబ్బలక్ష్మి రాజారావు మాటల్ని అంగుకొంటూ, "వచ్చిన మొదట్లోనే మమ్మల్ని విడిపొమ్మని సలహా యిచ్చింది. ఈ రెండుమూడు రోజుల్లోనే ఎంత నిప్పు రాజబెట్టిం దనుకొంటున్నారు? కాంతక్కయ్యతో, తియ్యగా మాట్లాడుతూ, మీఆయ నెప్పుడూ ఆ సుబ్బలక్ష్మి మీదే కళ్ళు పారేసి చూస్తాడేవే అందిట!"

ఈమాటలకి కాంతారాణి, రామరాజు ఫక్కున నవ్వుకున్నారు

"ఈవిడతో హాస్య కాలక్షేపం బాగానే వుందే! ఇదివరలో ఇంత సందడీ వడీ లేదు. ఎప్పుడూ మందకొడిగాఉండేది! రత్తమ్మగారొచ్చి మనలో చైతన్యాన్ని మేల్కొల్పారు"

ఈ నవ్వులకీ, మాటలకీ రాజారావు వళ్లు మండుతోంది

"ఇంకా నయం! ఈవిడ మాటలు వింటే కొంపలు గుండమౌతాయి. నిన్న రాత్రి చాటుగా పిలిచి, సుబ్బలక్ష్మికి ఈయింట్లో ఉండడం ఇష్టం లేదుట! వేరే ఉండాలని ఉందిట! అందుకని ఈవిడ రాయబారం నడుపుతోందిట!. ఆమెయిన్ని నాలుగు చీవాట్లు వేద్దామనుకొన్నా" -

"అంతదాకా వచ్చిందా ఈవిడతతంగం?"

"ఇదేనేమిటి! ఇలాంటివి లక్షలు! ... ఎందుకూ? ఎవళ్లదగ్గర వాళ్ల మాటలాడి తగ్గుదామని చూస్తోందండీ"

సుబ్బలక్ష్మి మాటలకి కొరకొరలాడుతూ, "ఏదీ ఎక్కడుంది? పిలువూ" అన్నాడు రాజారావు

"ఏరోయ్ రాజూ! అనవసరంగా ఆవిడ మీద చెయ్యి చేసుకోకు ... ఎందుకొచ్చిన అప్రతిష్ఠ" -

"లోపల గుర్రుపెట్టి నిద్ర పోతోంది" -

"బాగా మదించిలినీ .." రాజారావు లోపలికి వెళ్ళాడు

ఇవతల రామరాజూ, కాంతారాణీ, సుబ్బలక్ష్మి ఊపిరి బిగబట్టుకూర్చున్నారు. కాబోయే సంఘటన ఊహించుకొంటూ, వచ్చేనవ్వు నాపుకొంటూ.

రాజారావు అన్నంతపనీ చేశాడు.

ఇవతలికి తీసుకొచ్చి, "ఏం రత్తమ్మగారూ! కడుపునిండా తిని కళ్ళనిండా నిద్రపోయారా?. ఐతే, ఇక్కడికి మీరేం పనిమీద వచ్చినట్టు?"

రత్తమ్మగారు ఆవలిస్తూనే, సగం కునికిపాట్లు పడుతూ జోగుతూ,

"ఉండరారాజూ! శుభ్రమైన నిద్ర చెడగొట్టేశావు. అయ్యో! రామ! పెద్దముండనిలా కష్టపెడితే ఎట్లారా! రేపు నీకొడుకు నెత్తుకొని, ఆడించాలా? ఎందుకొచ్చానంటావా? మిమ్మల్ని చూసి పోవడానికి! అయ్యోరాత! లేకపోతే నేనెందుకురా ఇక్కడికి రావడం?" -

రత్తమ్మ కిప్పటికి, రాజారావు కళ్ళలోంచి చూస్తే వేడియూపులికి నెమ్మదిగా నిద్ర తెల్లవారింది

"ఐతే నువ్వొచ్చి ఉద్ధరించేదేమిటిక్కడ? వాళ్ళకీ వీళ్ళకీ తంపులు పెట్టడానికా? చిన్నప్పట్నుంచీ నీ పాడుబుద్ధి పోనిచ్చుకున్నావా? వచ్చి, రెండుమూడురోజులైందోలేదో అప్పుడే నిక్షేపంలాంటి సంసారంలో నిప్పులు పొయ్యడానికి చూస్తున్నావా?"

"అయ్యోకర్మ!. చూశారా! చూశారా? న్యాయంలేదూ? దేవుడులేడూ? వీడి పొగరు పొగబెట్ట! ముప్పయ్యేళ్లు అగ్నిహోత్రంలో బతికినదాన్ని. నన్నెలాంటి మాట లంటున్నాడో! పురుగులుబట్టి చస్తారు! మీ సంసారాలకి నే నేం పీడనయ్యాన్రా!"

"నువ్వు చేసిందేవిటి? నిన్న రాత్రి పిలిచి విడిపొండని చెపుతావా?"

"అందులో తప్పేవుంది? ఇంతకంటె మహాకబుర్లు చెప్పినవాళ్లే విడిపోయ్యారు! అన్నదమ్ములైనందుకు విడిపోవాల్సిందేరా! పొత్తు కుదరకపోతే, ఏం చేస్తారు?...చిన్నప్పట్నుంచీ ఎంత గౌరవంగా బతికాను! ఆయనున్నంతకాలం పల్లెత్తుమాట అనిపించుకున్నానా? .నాకేం భయమా? ఎదుటగుండా నే అంటాను! నీపెళ్లాం ఓసబ్బు. దేవతలికి పంచాంగం చెబుతుంది... పెళ్ళాం మాట వినేవాడెకి, అమృతమైనా చేదేనట" -

"ఇక్కడ మీ రోక్షణం ఉండడానికి వీల్లేదు. తక్షణం వెళ్ళిపోవాల్సిందే"

"వెళ్లక ఇక్కడ కాపురం చేస్తాననుకున్నావురా?" -

రామరాజు పర్సుతీసి, "ఇదిగోండి! బామ్మగారూ! రైలు ఖర్చులి కుంచండి" అని ఎదురూపాయలనోటు అందించాడు

"నెయ్యేళ్లు వర్ధిల్లురా తండ్రి వర్ధిల్లు! ఈ వెర్రి రత్తమ్మని మర్చిపోకు" -

"రత్తమ్మ మూటా, పాత ట్రంకూ పట్టుకుని గుమ్మం దిగింది.

రాజారావుకళ్ళల్లో నిప్పులు చెరుగుతూ, "ఐదురూపాయ లెందుకురా దానికివ్వడం? మతిలేకపోతేగాని! ఇలాంటి చీడపురుగుల్ని నలిపి పారెయ్యాలి" -

సుబ్బలక్ష్మి కాంతారాణీ బరువుగా ఓ నిట్టూర్పు విడిచారు.

★

## ★ కుర్చీలో కూనిరాగం ★

(4-వ పేజీ తరువాయి)

కనుమలు అంతా పొగాకు తోటలుగా చేయడం, రెండు విశాఖపట్టానికి మంచి నీళ్ళ సముద్రం భీమునిపట్నానికి పాల సముద్రం తీసుకురావడం ఎవరూ ప్రణాలికలు వెయ్యకుండానే పొగాకు కంపెనీల ధర్మమా అని ఆంధ్రదేశంలో పొగాకు షంటే భారీ పంట అయి కూర్చొంది ఆమధ్య ఎప్పుడో భీమునిపట్నానికి ప్రభుత్వం ఆఫీసులు తెస్తామని విశ్వనాథం గారు జనాంతికంగా గొణిగేరు విశాఖపట్నానికి వేసవి రాజధాని తెచ్చారు బాగానే ఉంది. వేసవి రాజధానికన్నా ముఖ్యంగా విశాఖపట్నానికి కావలసినది మంచినీళు చెన్నపట్నంలో పదవులలో లేనప్పుడు మరే రాజకీయ వ్యవహారాలలో బిజీగా ఉండనప్పుడు విశాఖపట్నం చైర్మన్‌గా విశ్వనాథంగారు చాలాకాలం ఉన్నారు కనుక ఆఊరికి నీరు ఎంతముఖ్యంగా అవసరమో చెప్పక్కర్లేదు గిరీశంగారు చెప్పినట్టు మంచినీళ్ళ సముద్రం తెచ్చినా తేకపోయినా "ఎప్పుడు నెడతెగక పారు" వాటర్ సప్లయి ఏర్పాటు చేస్తే అదే పది

## ★ కాలక్షేపం ★

(3-వ పేజీ తరువాయి)

ఉంది. లోకుల కది వినియోగపడుట లేదని గాని, సలాము సాహెబు గారి ద్రవ్యంతో లోకులకు ఋణ పదానాలు ఒరుగుట లేదని గాని వాదించలేము కొబట్టి ఆయన ద్రవ్యం లోక సంగ్రహార్థం బ్యాంకుద్వారా వినియోగపడుతూనే ఉంది వారి ద్రవ్యం సర్వమైన వ్యాపారరంగంలో అనేక వృత్తులకూ పరిశ్రమలకూ కొంగు బంగారమువలె, పండిన పెరటి కల్పకమువలె, దొడ్డిబెట్టిన వేల్పుగిడ్డి వలె, కాలకులమున్న తంగేటి జున్నువలె అక్కరకు వస్తోంది దేశంలో రకరకాల వస్తువులను ఉత్పత్తి చేసేవారికీ, పలురకాల పంటలు పండించేవారికీ, బ్యాంకువారు అప్పులిస్తారు అందువల ప్రజలకు కావలసిన పంట ఉత్పత్తి కాగలదు ప్రజలకు కావలసిన వస్తువులు ఉత్పత్తి కాగలవు కనుక, బ్యాంకులోనుంచి తియ్యకుండా స్థిరంగా సలాం సాహెబ్ గారు తను సేర డిపాజిట్టును ఉంచడమే వారు లోకానికి మేలెంచడం — అట ఉతమ గిరా సుగిరా లక్షణముల నడి పి క్కా గా డిపాజిట్లుగల బ్యాంకు యీ మహాత్మను శశాంకుడని మెచ్చుకోవచ్చు

అయితే, తాను అనుభవించని ద్రవ్యం నియపయోగం అయినట్లుగా నిర్ణయించడానికి వీలులేదు శాస్త్ర పరిశోధనలో కృషి చేసేటటువంటి మహాకోవిదుడు అనేక నూతన విషయాలను అనేక వింత శక్తులను కనిపెట్టగలడు కాని ఆ శాస్త్ర రహస్యములను ఎవరికీ బోధించకుండా దాచియుంచినట్లయితే అటువంటివాడు బ్రహ్మరాక్షసియై పుట్టగలడు. ఆ విద్యారహస్యము లోకసంగ్రహార్థం వినియోగించకపోయినట్లయితే, లోకానికి గాని, మరి కొందరు శిష్యులకు గాని వెల్లడించకపోయినట్లయితే, అటువంటవాడు శాస్త్రలోభి - విద్యాలోభి అంతకంటె ప్రమాదకరమైన మనిషి యింకొకడు ఉండడు. తన విద్యను ఇంకొకడు నేర్చుకొంటే, ఇంకొకడు తన జ్ఞానంలో భాగం పంచుకొంటే సహించలేనివానిని లోకం సహింపదు విద్యా ధనమును యితరులకు బోధించినకొద్దీ యితరులకు పంచి పెటినకొద్దీ, పంచి పెట్టనవాని విద్య అటువంటి బోధనాసాకంవల్ల వృద్ధిఅవుతూంటుంది ఆ మాట నిజమే కాని, తానుకనిపెట్టిన యంత్రతంత్ర మంత్రరహస్యములను యితరులకు బోధించుటవల్ల యితరులు ఆ శాస్త్రవిషయములను యింకా మథించి యింకా పరిశోధించవచ్చు. అందువల్ల ఆ విద్య వృద్ధియై వడ్డీకివడ్డీ పెరిగినటుగా పెరుగుతుంది ఈ గోజన అమెరికావారికి తెలిసినన్ని ఆటంబాంబు రహస్యాలు యింకెవ్వరికీ తెలియవని వారి అహంభావం ఈ ఆటంబాంబు పాండిత్యం తమకు ఉండడంవల్లనే ప్రపంచం అంతా తమకు గజగజలాడుతోంది అంటె నిజమో అనిజమో జగమెరుంగు అందువల్లనే అనేక దేశాలు వారి చుట్టూచేరి భజన చేస్తున్నవనే విషయం మనం తర్జన భర్జన చేయనక్కరలేదు కాని, జగమును గజగజలాడిస్తున్న బ్రహ్మరాక్షసి వలెనని భ్రమించడం; అటంబాంబు రహస్యములయందే సదా రమించడం; అందులో అందరికంటు మించడం; చూస్తే, లోకకంటక, ప్రపంచ విదారక, జగజ్జనని గర్భనిర్భేదక ఉదజనిబాంబులను ప్రయోగించడంమాత్రై, రాడుసంగానే ఉంది ప్రపంచబ్యాంకు అనే అంతర్జాతీయ బ్యాంకును ఏర్పాటు చేసిన అమెరికావారు, అణుశక్తివిద్యా ధనమునుకూడా సర్వలోక సంగ్రహార్థమై వినియోగపడేటట్లుగా ఒక అంతర్జాతీయ శాస్త్రవేత్తల పరిషత్తుకు నివేదించడం ఉత్తమం. అణుశక్తి రహస్యాలను దాచిఉంచే అంతర్జాతీయశాస్త్ర విజ్ఞాన బ్యాంకును వారు ఏర్పాటుచేస్తే ఆ విద్యా ధనం లోకవినాశకరం కాదు అసురులు కావలసిన అమెరికావారు అసురులు కారు. అణుశక్తిని అవిరంగా అన్ని దేశాల పండితులకు దానం చెయ్యాలి మానవకోటియొక్క సౌఖ్యాభివృద్ధికి వినియోగించ చక్కగా అనుభవించాలి ఈ రెండూ చెయ్యకపోతే, యీ అణుశక్తి రహస్యం అనేది లోకనాశన హేతువవుతుంది ★

## కుర్చీలో కూనిరాగం

వేల (వేసవిరాజధానుల) ను కొంటూ రు అక్కడివాళ్ళు!

*     *     *

వేసవిరాజధానిలో మద్యనిషేధంగురించి ఇటో అటో తేలిపోతుందట ఈలోగా కాంగ్రెసు పెద్దల్కు ఎలుగెత్తి, ఇంగ్లీషులో చెప్పినట్టు ఇళ్ళ కప్పులమీంచి "నిషేధం ఉండాలి! ఉండాలి! ఉండాలి!" అని అభిభాషిస్తున్నారు. ఉద్ఘాటిస్తున్నారు. గాని మద్యనిషేధంమీద యాటంబాంబు లాంటిది పడ్డది ఈ వార్త చిత్తగించండి

"టోకియో, ఏప్రెలు 22—1945 లో హిరోషిమాలో యాటంబాంబు ప్రేల్చినప్పుడు రేడియో ధార్మికశక్తి ప్రసారితమై తీవ్రంగా దెబ్బతిన్న జాపనీయులలో ముగ్గురు జీవితంపై నిరాశచెంది ఆల్కహాల్ మితిమీరి సేవించగా వారివ్యాధి క్రమక్రమేణా తగ్గినటు జాపనీస్ డాక్టర్ మిచియో యనమొటో నేడు యిక్కడ వెల్లడించాడు. రేడియో ధార్మికశక్తి తెచ్చే వ్యాధులన్నింటిని ఆల్కహాలు నిర్మూలించగలదని ఇందువల్ల విశ్వసించ వచ్చునట"

చూశారా మరి! పాశుపతాస్త్రాలు, బ్రహ్మాస్త్రాలు, నారాయణాస్త్రాలు మున్నగు వాటి ప్రయోగించాక, లోకాలు తల్లడిల్లిపోతూ ఉంటే మన దేవతలు ఆ అస్త్రాలకి విరుగుడు కనిపెట్టడానికే 'సుర' కనిపెట్టే ఉంటారు ప్రస్తుత అంతర్జాతీయ జాతీయ కష్టకిష్ట పరిస్థితులలో ఇండియా యాటంబాంబులని తయారు చేసుకోలేకపోతే పోయింది గాని యాటం వ్యాధులకి విరుగుణ్ణి నిషేధించడం ఏంబాగుంది అయితే ఒకటిలెండి-యాటం బాంబుల్నికూడా నిషేధించాలని మనం అంటున్నాం కనుక దానివల్ల వచ్చే వ్యాధుల విరుగుణ్ణి కూడా నిషేధించాలంటాం అంటారు మనవాళ్ళు! అమెరికావాళ్ళు ఎలాగా ఆటంబాంబుని అంతకంటె ఘనమైన హైడ్రోజన్ బాంబుల్ని చెయ్యడం మానరుకొబట్టి వాటవల్ల వచ్చే సాధక బాధకాలకి మనం విరుగుడు తయారు చేసుకోడం మంచిదేమో పెద్దలు ఆలోచించడం మంచిది ★

## ఊయ్యాలలో తుఫాను

(9-వ పేజీ తరువాయి)

నిద్దర్లో భయపడ్డావా నాన్నా!
భయంలేదు బజ్జోరాకన్నా
(పాడుతూ)
ఉయ్యాలా జంపాలా
ఊరుకోరబాలా
ఏడిస్తే నిన్నెవ్వా
రెత్తుకోనువారూ.
కొండల రెండటవకుమా
కోనేరొకటుంది
కోనేరావలిగట్టున
కొమ్మలచెట్టుంది
కొమ్మలపై కూర్చున్నవి
కోయిలలెన్నెన్నో
ఒక కొమ్మకు వేలాడే
ఉయ్యాలొకటుంది.
గాలికి చెట్టూగేనూ
పూలూ కురిసేనూ
కొమ్మలపై ఉయ్యాలను
ఊపును చిరుగాలీ ॥ఉయ్యాలా॥ ★